ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఒంగోలు
fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam


1-9-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 211 పేజీలు: 12 వెల: 6.50

భారత్ క్వాడ్ సదస్సుకు ట్రంప్ డుమ్మా!

భారత్‌పై ఆంక్షలు విధించండి: అమెరికా

9

# ఇక 'గ్రీన్ హైడ్రోజన్' విప్లవం



2030 నాటికి ఎపిని గ్రీన్‌హైడ్రోజన్ వ్యాలీగా మారుస్తాం

కిలో హైడ్రోజన్ గ్యాస్ రూ.460 నుంచి రూ.160కి తగ్గేలా ప్రణాళిక

విశాఖ, కృష్ణపట్నం, కాకినాడ, తిరుపతిలో రూ. 2.50 లక్షల కోట్ల ప్రాజెక్టులు

రాష్ట్రంలో 160 గిగావాట్ల పునరుత్పాదక ప్రాజెక్టులు: సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఆగస్టు31,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో గ్రీన్ హైడ్రోజన్ విప్లవానికి ఆంధ్రప్రదేశ్ మార్గదర్శిగా నిలుస్తోందని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రత్యామ్నాయం ఇంధన రంగంలో ఏపీ ముందుకు దూసుకుని వెళ్ళడంతో పాటుగా అద్భుత ఫలితాలను సాధిస్తుందని తెలిపారు.సీఎం చంద్రబాబు తెలిపిన వివరాలను అనుసరించి తీర ప్రాంతంలో డీసాలినేషన్ టెక్నాలజీతో సముద్ర జలాన్ని తాగునీటిగా మార్చితే పెద్దఎత్తున హైడ్రోజన్ ఉత్పత్తి చేయవచ్చు. సమీపంలోని పోర్టుల ద్వారా దాన్ని విదేశాలకు ఎగుమతి చేయవచ్చు. రాష్ట్రంలోని పోర్టులు, తీర ప్రాంతం, నీటి వనరులు, పునరుత్పాదక శక్తి ఇలా ఎన్నో అవకాశాలు ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే గ్రీన్ ఎనర్జీ కేంద్రంగా నిలబెట్టనున్నట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారన్నారు. ఇప్పటికే పునాది పడిన ఈ ప్రాజెక్టులు విజయవంతమైతే, ఆంధ్రప్రదేశ్ జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్లో ముందంజలో ఉండటమే కాకుండా, అంతర్జాతీయ ఎగుమతి కేంద్రంగా కూడా ఎదుగుతుంది. ఈ మేరకు సీఎం చంద్రబాబు కార్యాలయం నుంచి ఒక సమాచార పత్రం విడుదలయింది.ముఖ్యంగా ఉక్కు, సిమెంట్, విద్యుత్ రంగాలకు ఇది శాశ్వత ప్రత్యామ్నాయం అవుతుంది. ఆంధ్రప్రదేశ్ గ్రీన్ హైడ్రోజన్ ప్రయాణం కేవలం ఎనర్జీరంగాన్ని మాత్రమే కాకుండా రాష్ట్రఆర్థిక భవిష్యత్తును మలుపుతిప్పేశక్తిగా మారబోతోంది హైడ్రోజన్ ఉత్పత్తి సులభమే అయినా,ఎలెక్ట్రోలైజర్ల ఖర్చు ఎక్కువ. వీటిలో ప్లాటినం, టైటానియం వంటి అరుదైన లోహాలు ఉపయోగించడం వల్ల కిలోకు రూ.400 వరకూ అవుతోంది. ప్రభుత్వాలు దీన్ని రూ.150-200కి తగ్గించాలన్న లక్ష్యంతో పెద్దఎత్తున పెట్టుబడులను >>2

# పోటీదారులం కాదు భాగస్వాములం

ద్వైపాక్షిక భేటీ తర్వాత ప్రధాని మోడీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్

తియాంజిన్‌లో ఉభయనేతల శిఖరాగ్ర భేటీ

సరిహద్దుల్లో శాంతియుత వాతావరణంపై సంతృప్తి

బ్రిక్స్ సదస్సుకు జిన్‌పింగ్‌ను ఆహ్వానించిన ప్రధాని మోడీ



తియాంజిన్‌లో జిన్‌పింగ్‌తో ప్రధాని మోడీ

**బీజింగ్, ఆగస్టు 31:** భారత్, చైనాలు పరస్పరం పోటీదారులు కావని, అభివృద్ధిలో భాగస్వాములని ప్రధానిమోడీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌లు పునరుద్ఘాటించారు.నేతలు పునరుద్ఘాటించారు. ఇరు దేశాల మధ్య ఉన్న అభిప్రాయ భేదాలు ఎట్టి పరిస్థితుల్లోనూ వివాదాలుగా మారకూడదని వారు బలమైన ఏకాభిప్రాయానికి వచ్చారు. గత ఏడాది (2024) రష్యాలోని కజన్‌లో జరిగిన సమావేశం తర్వాత ద్వైపాక్షిక సంబంధాలలో సాధించిన పురోగతిని మోదీ, జిన్‌పింగ్ >>2

# తాడిపత్రిలో రణరంగం



ఆదివారం తాడిపత్రిలో ఇరువర్గాల మధ్య ఘర్షణ దృశ్యం

వినాయక నిమజ్జనంలో టిడిపి వర్గాల మధ్య ఘర్షణ

పరస్పరం దాడులు, పోలీసు జోక్యంతో సద్దుమణిగిన రగడ



అల్లరిమూకలను చెదరగొడుతున్న పోలీసులు

**తాడిపత్రి, ఆగస్టు 31, ప్రభాతవార్త:** అధికార పార్టీకి చెందిన ఇద్దరు నాయకుల అనుచరుల పరస్పర దాడులతో తాడిపత్రిలో వినాయక నిమజ్జనం ఆదివారం వివాదాస్పదంగా మారింది. అరుపులు కేకలు, కర్రలు, రాళ్లతో ఒక్కసారిగా తాడిపత్రి పట్టణంలోని ప్రధాన రహదారి రణరంగాన్ని తలపించింది. తెదేపా నాయకులు జేసీ ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల రంగనాథ్‌ల మధ్య నివురుగప్పిన నిప్పులా ఉన్న అసంతృప్తి ఒక్కసారిగా నిమజ్జనం సందర్భంగా అగ్గిరాజుకుంది. నువ్వెంత అంటే నువ్వెంత అనే స్థాయిలో ఇద్దరు నాయకుల మధ్య రేకెత్తిన మాటల యుద్ధం కాస్తా రాళ్ల దాడిగా మారింది. తాడిపత్రి పట్టణ వ్యాప్తంగా ఆదివారం నిర్వహించ తలపెట్టిన వినాయక నిమజ్జనం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావాలనేది జేసీ ప్రభాకర్‌రెడ్డి నేతృత్వంలోని నిర్వహకుల ఆలోచన. ఆ ఆలోచన ప్రకారమే అన్ని విగ్రహాలు శోభాయాత్రలో పాల్గొంటూ ముందుకు సాగాయి. సాయంత్రం 3 గంటల ప్రాంతంలో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కాకర్ల రంగనాథ్ ఆధ్వర్యంలో వస్తున్న వినాయక విగ్రహ తరలింపు వాహనానికి ఎదురెళ్లిన జేసీ ప్రభాకర్‌రెడ్డి అన్ని వాహనాలతో పాటు రావాల్సిందని, త్వరగా కదలాలని రంగనాథ్‌కు సూచించడం, అది చెప్పడానికి మీరెవరంటూ రంగనాథ్ వాదించడంతో మాటా మాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. జై జేసీ అంటే...జై కాకర్ల అంటూ ఇరు వర్గాల అనుచరులు చేసిన అరుపులు, కేకలతో ఒక్కసారిగా పరిస్థితి చేయిదాటి పోయింది. పోలీసులు జోక్యం చేసుకొని ఇద్దరు నాయకులకు సర్దిచెప్పడంతో తాత్కాలికంగా గొడవ సద్దుమణిగింది. కాకర్ల రంగనాథ్ వాహనం రామచంద్ర లాడ్జి వద్దకు రాగానే ఎదురుగా జేసీ అనుచరులు పెద్ద ఎత్తున తరలివచ్చి మరోసారి ఘర్షణకు దిగారు. జేసీ వర్గీయులు రాళ్లదాడికి దిగడంతో మరోసారి పోలీసులు రంగ ప్రవేశం చేయాల్సి వచ్చింది. రామచంద్ర లాడ్జి వద్ద పరిస్థితి రణరంగాన్ని తలపించడంతో పోలీసులు లాఠీలకు పనిచెప్పి, ఇరువర్గాల అనుచరులను చెదరగొట్టి ఘర్షణ వాతావారణాన్ని అదుపులోకి తీసుకొని వచ్చారు. కాకర్ల రంగనాథ్ వాహనాలు దెబ్బతినడం, పోలీసులే >>2



# 18 నుంచి అసెంబ్లీ

14, 15న తిరుపతిలో మహిళా పార్లమెంటేరియన్ల సమావేశం

**విజయవాడ, ఆగస్టు31, ప్రభాతవార్త ప్రతినిధి:** వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు సెప్టెంబరు 18 నుంచి ప్రారంభం కానున్నాయని ఏపీ శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఆ మేరకు స్పీకరు కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదలయింది. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై అసెంబ్లీ సమావేశాల్లో విశేష చర్చ జరిగే అవకాశముంది. రాష్ట్రంలోని ముఖ్యమైన అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు కూడా ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అలాగే తాజా రాజకీయ పరిణామాలు, ప్రభుత్వ పథకాల అమలుపై కూడా అసెంబ్లీలో ప్రత్యేక చర్చలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో బనకచర్ల ప్రాజెక్టు అంశంపై ప్రత్యేకంగా చర్చించే యోచన >>2

# సమృద్ధిగా జలవిద్యుత్

ఈ నెలలో గరిష్ట ఉత్పత్తికి అవకాశం

నేటి నుండి ఇపిఎంఎస్ పైలట్ ప్రాజెక్టు

విద్యుత్ సరఫరా మెరుగుదలకు జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు: సిఎస్ విజయానంద్



**విజయవాడ, ఆగస్టు 31,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో సెప్టెంబర్ నెలలో విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని వర్షాకాలం కారణంగా లభిస్తున్న జల విద్యుత్ ఉత్పత్తిని గరిష్టంగా వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ విద్యుత్ సంస్థలకు ఆదేశించారు. ఆదివారం సీఎస్ క్యాంప్ కార్యాలయం నుండి ఏపీజెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్ బాబు, ఏపిట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ కీర్తి చెకూరి, ఏపిట్రాన్స్‌కో డైరెక్టర్లు ఎ.కె.వి. భాస్కర్, జె.వి. రావు, ఎన్.వి. రమణమూర్తి, ఏపీజెన్‌కో డైరెక్టర్లు ఎం. సుజయ్ కుమార్, పి.అశోక్ కుమార్ రెడ్డి, సిఈ రాజేంద్ర ప్రసాద్ తదితరులతో సిఎస్ వర్చువల్‌గా సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ ప్రస్తుతానికి రోజుకు సుమారు 22 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి అవుతున్న జలవిద్యుత్ ఉత్పత్తిని పూర్తి స్థాయిలో వినియోగిస్తే రోజువారీగా 26 మిలియన్ యూనిట్లు వరకు చేరుకోవచ్చన్నారు.దీని వలన మార్కెట్ కొనుగోళ్లపై ఆధారాన్ని తగ్గించడంతో పాటు, నాణ్యమైన విద్యుత్ అందించవచ్చని ఆయన పేర్కొన్నారు.
వ్యవసాయం, పరిశ్రమ, గృహాలకు రాబోయే పండుగల సీజన్ లో అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించేలా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని తగ్గిస్తూ జలవిద్యుత్ ఉత్పత్తిని గరిష్టంగా పెంచాలన్నారు. బ్యాంకింగ్ ద్వారా నిల్వ ఉంచిన విద్యుత్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారంకోసం విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయాలని ఆయన ఆదేశించారు. జిల్లా స్థాయిలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ సరఫరా ను మరింత సమర్ధవంతంగా పర్యవేక్షించడంతో పాటు వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా అందించేందుకు వ్యవసాయ, సాగునీటి విభాగాలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ట్రాన్స్‌మిషన్ మరియు డిస్ట్రిబ్యూషన్ రంగంలో సామర్థ్యం పెంచాలని, ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్లు, సబ్‌స్టేషన్లు ఎల్లప్పుడూ సజావుగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముందస్తు మరమత్తులు, అవసరమైన పరికరాలను ఏర్పాటుచేసుకోవాలని ఆయన సూచించారు.
ఎనర్జీ పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈపీఎంఎస్) యాప్ అనే దేశీయంగా అభివృద్ధి చేయబడిన డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను సెప్టెంబర్ 1వ తేదీ నుండి ప్రయోగాత్మకంగా శ్రీకారం చుడుతున్నామన్నారు.తద్వారా తక్కువ ధరలతో విద్యుత్ కొనుగోళ్ల వ్యయాన్ని తగ్గించవచ్చని, విజయవంతమైతే ఈ యాప్ ను విస్తృతంగా అమలు చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విద్యుత్ సరఫరా స్థితిని >>2

# ఫిబ్రవరిలోనే ఇంటర్ పరీక్షలు



**విజయవాడ, ఆగస్టు 31, ప్రభాతవార్త ప్రతినిధి:** ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను ఈ విద్యాసంవత్సరంలో ఫిబ్రవరిలోనే నిర్వహించేందుకు ఇంటర్మీడియట్ విద్యామండలి ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఇప్పటివరకు మార్చి నెలలో ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతుండగా, ఈసారి సీబీఎస్ఈతో పాటు ఫిబ్రవరిలోనే నిర్వహించాలని నిర్ణయించింది. ఏప్రిల్‌లో తరగతులను నిర్వహించేందుకు ముందుగానే పరీక్షలన్నీ పూర్తవుతాయి. అందుకు అనుగుణంగానే పరీక్షల విధానంలోనూ పలు మార్పులు జరిగాయి. మొదట సైన్స్ విద్యార్థులకు గ్రూపు సబ్జెక్టులతో పరీక్షలు ప్రారంభమవుతాయి. రోజుకు ఒక్క సబ్జెక్టు పరీక్షే ఉంటుంది. గతంలో ఎంపీసీ అభ్యర్థులకు ఏదైనా సబ్జెక్టు పరీక్ష ఉన్నప్పుడు అదేరోజు బైపీసీ, ఆర్ట్స్ గ్రూపుల వారికి ఇతర సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహించేవారు ఇప్పుడు ఎంపీసీ అభ్యర్థులకు గణితం పరీక్ష ఉంటే ఆ రోజు ఆ సబ్జెక్టు ఒక్కటే ఉంటుంది. ఎంబైపీసీ గ్రూపును తీసుకురావడంతో ఎంపీసీ విద్యార్థులూ జీవశాస్త్రం చదివే >>2



# మంత్రి లోకేష్‌కు మరో అరుదైన గౌరవం

ఆస్ట్రేలియా ప్రభుత్వ స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్‌లో భాగస్వామ్యం కావాలని ప్రత్యేక ఆహ్వానం

**విజయవాడ,ఆగస్టు31,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యారంగంలో సంస్కరణల ద్వారా ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌కు శ్రీకారం చుట్టిన విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌కు మరోఅరుదైన గౌరవం దక్కింది. ఆస్ట్రేలియా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్‌లో పాల్గొనాల్సిందిగా మంత్రి లోకేష్ కు ప్రత్యేక ఆహ్వానం పంపింది. ఈ మేరకు ఢిల్లీలోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ ఆహ్వాన లేఖను పంపారు. మానవ వనరులు, సాంకేతిక, ఆర్థికాభివృద్ధి రంగాల్లో ఏపీ నాయకత్వాన్ని ప్రశంసించిన ఆస్ట్రేలియా ప్రభుత్వం..ఈ మేరకు స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్‌లో భాగస్వామ్యం >>2



# రాష్ట్రంలో మరో అల్పపీడనం

తగ్గుతున్న కృష్ణ, గోదావరి ఉధృతి

**విజయవాడ,ఆగస్టు31,ప్రభాతవార్తప్రతినిధి:** వాయవ్య బంగాళాఖాతంలో సెప్టెంబరు 2 నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ప్రస్తుతం పశ్చిమ బెంగాల్, ఒడిశా తీరాలకు సమీపంలో వాయువ్య బంగాళాఖాతంపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇది సముద్ర మట్టానికి సగటున 1.5 కిలోమీటర్ల నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉంది. ఈ ఆవర్తనం ప్రభావంతోనే అల్పపీడనం ఏర్పడనుందని, దీని ఫలితంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. పలు ప్రాంతాల్లో మోస్తరు >>2

# గణపతి నిమజ్జన వేళ అపశ్రుతి


ట్రాక్టర్ ఢీకొని నలుగురి మృతి

**నరసాపురం, ఆగస్టు 31, ప్రభాతవార్త:** ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా సినీ పాట లకు నృత్యాలు చేస్తున్న ఆ నలుగురికి మృత్యువు ట్రాక్టర్ రూపంలో వచ్చి కబళిస్తుందని తెలియదు. ఒక్కసారిగా మీద పడ్డ ట్రాక్టర్ కింద నాలుగు నిండు ప్రాణాలు నుజ్జాయి పోయాయి. మరో ఇద్దరు గాయపడటంతో వారిని నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ లో తీసుకువెళ్లారు. ఆదివారం రాత్రి 8 9 గంటల మధ్య సమయంలో ఈ ప్రమాదం జరిగింది. మరో 10 నిమిషాల్లో వినాయకుని నిమజ్జనం చేస్తామనగా ఈ ఘటన జరగడంతో గ్రామం ఉలిక్కిపడింది. తూర్పు తాళ్ళు సెంటర్లో ఎంతో ఉల్లాసంగా సాగుతున్న ఊరేగింపులో ట్రాక్టర్ దూసుకు రావడంతో గురుజి మురళి తిరుమల సూర్యనారాయణ ఇవన నరసింహస్వామి కడియం దినేష్ అనే విద్యార్థి అక్కడికక్కడే చనిపోయారు. >>2



# మైసూరు తరహాలో 'విజయవాడ ఉత్సవ్'

కొత్త హంగులతో దసరా వేడుకలకు రంగం సిద్ధం



11 రోజులపాటు వివిధ ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు

అంగరంగవైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

**విజయవాడ, ఆగస్టు31, ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలో దసరా వేడుకలను మైసూర్ తరహాలో నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. విజయవాడ ఉత్సవ్ పేరుతో హెలీకాప్టర్ రైడ్, గ్యాస్ ఎయిర్ బెలూన్స్, ఎగ్జిబిషన్, జలక్రీడలు, సినీ, సాంస్కృతిక ప్రదర్శనలు 11 రోజుల పాటు రోజూ ఒక ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను అందుబాటులోకి తీసుకుని రానున్నారు. తొలిసారిగా ఈ ఏడాది దసరా సంబరాలు విజయవాడ ఉత్సవ్ పేరుతో జరుగుతాయి. విజయవాడకు వచ్చే ప్రతి ఒక్కరూ కనీసం రెండు రోజులుండి, ఈ ఉత్సవాలను తిలకించి వెళ్లేలా వైభవంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) వెల్లడించారు. నగరంలోని నదీ పరివాహకం సహా అన్ని ప్రాంతాల్లోనూ సినీ, సాంస్కృతిక కళా ప్రదర్శనలు, అమ్యూజ్‌మెంట్ పార్కులు, జల క్రీడలు, హెలీకాప్టర్‌రైడ్, దుకాణ సముదాయాల స్టాళ్లు, మిరుమిట్లు గొలిపే డ్రోన్ల ప్రదర్శనలు కనువిందు చేయనున్నాయి. దసరా అనగానే విజయవాడకు కచ్చితంగా వెళ్లాలనేలా వేడుకలు నిర్వహించనున్నారు. ఇప్పటి వరకూ చూడనంత గొప్ప విద్యుత్తు >>2

ప్రపంచ స్కేట్ పసిఫిక్ కప్‌లో బెజవాడ బాలికకు ఏడు బంగారు పతకాలు 2

01-09pg2exHMNWJQE 2ND_01-09pg2exHMNWJQE.qxd 9/1/2025 12:02 AM Page 1





చైనాలోని టియాంజిన్‌లో నేపాల్ ప్రధాని కెపి ఓలితో మాట్లాడుతున్న ప్రధాని నరేంద్ర మోడీ

## నేటి నుంచి పులివెందులలో జగన్ పర్యటన

**జయవాడ,ఆగస్టు31,ప్రభాతవార్తప్రతినిధి:** సెప్టెంబర్ 1,2,3 తేదీల్లో వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ పులివెందులలో పర్యటించనున్నారు. 2వ తేదీన వైఎస్ఆర్ వర్ధంతి కార్యక్రమంలో జగన్ పాల్గొంటారు.సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు భాకరాపేటలోని క్యాంప్ కార్యాలయానికి వైఎస్ జగన్ చేరుకుంటారు. మంగళవారం ఉదయం 7.15 గంటలకు ఇడుపులపాయకు చేరుకుని వైఎస్ఆర్ ఘాట్ వద్ద తన తండ్రికి జగన్ నివాళులర్పించనున్నారు.

## 5 లోగా 'ఆడుదాం ఆంధ్ర' అవినీతిపై చర్యలు

### -శాప్ ఛైర్మన్ రవినాయుడు

**విజయవాడ,ఆగస్టు 31,ప్రభాతవార్త ప్రతినిధి:** వైసిపి హయాంలో నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్ర'లో అవినీతికి పాల్పడిన వారిపై సెప్టెంబరు 5 లోపు చర్యలుంటాయని శాప్ ఛైర్మన్ రవినాయుడు వెల్లడించారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే ప్రభుత్వానికి విజిలెన్స్ నివేదిక అందినట్లు పేర్కొన్నారు. దోషులు ఎవరైన సరే ప్రభుత్వం ఉపేక్షించదని, లింగ భేధం లేకుండా చర్యలుంటాయని స్పష్టం చేశారు. విజయవాడ లోని శాప్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఒక ఆటకు రెండు,మూడు సంఘాలు ఉండటంతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. శాప్ నియమావళి మేరకు నెల రోజుల్లోగా ఒక క్రీడకు సంఘంగా ఏర్పడి ముందుకు రావాలి. డీఎస్సీకి సంబంధించి స్పోర్ట్స్ కోటాలో ఒక పోస్టుకు ముగ్గురు చొప్పున జాబితాను తయారు చేసి విద్యాశాఖకు సమర్పించాం. తుది జాబితాను త్వరలో ప్రకటిస్తారు. దీనిపైనా అభ్యంతరాలు స్వీకరించే అవకాశం ఉంది. వీటికి ధరఖాస్తు చేసిన వారిలో 870 మంది నకిలీ ధృవపత్రాలు పెట్టినట్టు గుర్తించాం'అని పేర్కొన్నారు శాప్ పాలకమండలి సభ్యుడు ఎస్.సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తాడిపత్రిలో రణరంగం

>> రంగనాథ్ వాహనాన్ని నిమజ్జనం వరకు తరలించడం జరిగింది. అనంతరం పోలీసులు ఇరు వర్గాలకు చెందిన నాయకులను వారి ఇళ్లవద్దకు సాగనంపి పరిస్థితిని అదుపులోకి తీసుకొని వచ్చారు. ప్రశాంతంగా..ఉత్సాహంగా జరగాల్సిన నిమజ్జన సమయంలో ప్రధాన రహదారిపై రాళ్లదాడి చోటు చేసుకోవడంతో జనం భయభ్రాంతులకు గురయ్యారు. కాకర్ల రంగనాథ్ వర్గానికి చెందిన ముగ్గురికి తీవ్రగాయాలవడంతో ఆసుపత్రికి తరలించారు. అధికార తెదేపాకు చెందిన ఇద్దరు బలమైన నాయకుల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడం, పరస్పరం రాళ్లు రువ్వుకోవడం నియోజకవర్గ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇకపై చట్టాన్ని ఎవరు అతిక్రమించినా కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ సంఘటనల నేపథ్యంలో కాకర్ల రంగనాథ్ ఇంటి వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సంఘటనపై అధిష్టానం నుంచి తమకు ఫోన్ వచ్చినట్లు, సమాచారమంతా చేరవేసినట్లు కాకర్ల రంగనాథ్ విలేకరులతో పేర్కొన్నారు.

## రాష్ట్రంలో మరో అల్పపీడనం

>> నుంచి భారీవర్షాలు పడతాయని, తీర ప్రాంత ప్రజలు, లోతట్టు ప్రాంతాల వారు మరింత జాగ్రత్తగా ఉండాలనిహెచ్చరికలు జారీ చేసింది. ఇక విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది.ఎన్టీఆర్,కృష్ణా,గుంటూరు జిల్లాల్లో అక్కడక్కడ సాధారణ నుంచి మోస్తరు వర్షాలు కురిసాయి.ధవలేశ్వరం ఆనకట్ట వద్ద గోదావరి వరద ఉధృతి స్థిరంగా ఉంది.ఉమ్మడి గోదావరి జిల్లాలోను వర్షాలు పడ్డాయి.ఉత్తరాంధ్ర,రాయలసీమ ప్రాంతాల్లోవానలు పడ్డాయని సమాచారం.ఈ వర్షాలుమరోనాలుగురోజులు ఉంటాయని అంచనా వేస్తున్నారు.ఇంచుమించు ఆగస్టు నెలంతా కురిసిన వరుస వానలు కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర, రాయలసీమలకు భారీగా పంట నష్టం సంభవించింది.

## ప్రపంచ స్కేట్ పసిఫిక్ కప్‌లో బెజవాడ బాలికకు 7 బంగారు పతకాలు

**విజయవాడ,ఆగస్టు31,ప్రభాతవార్తప్రతినిధి:** ఆస్ట్రేలియాలోని మోంట్ వారెన్,క్వీన్స్‌ల్యాండ్ లో ఆగస్టు 28వ తేదీన నుండి 31వ తేదీ వరకు జరిగిన 2025 వరల్డ్ స్కేట్ పసిఫిక్ కప్‌లో విజయవాడకు చెందిన భారతీయ స్కేటింగ్ క్రీడాకారిణి కుమారి పి.చైత్ర దీపిక అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధిస్తూ స్కేటింగ్లో జైత్రయాత్ర కొనసాగిస్తోంది. 2025 వరల్డ్ స్కేట్ పసిఫిక్ కప్ (వరల్డ్ స్కేట్ ఓషేనియా) పోటీల్లో భారత జట్టు కు పలు విభాగాలులో ప్రాతినిత్యం వహించి, పెయిర్ స్కేటింగ్ విభాగం లో బంగారు పతకం, ఇన్‌లైన్ విభాగం లో బంగారు పతకం, కపుల్ డాన్స్ విభాగం లో బంగారు పతకాలు, మరియు వి.హృతిక్స్ విభాగం లో బంగారు పతకం, పెయిర్ స్కేటింగ్ విభాగం లో బంగారు పతకం, ద్వి డాన్స్ విభాగం లో బంగారు పతకాలు మరియు సోలో డాన్స్ లో సిల్వర్ పతకం సాధించి దేశానికి ఏంతో పేరు తీసుకొచ్చారు. ఏడు పతకాలు సాధించి భారతదేశానికి గర్వకారణంగా నిలిచారు. దీపక్ ఎల్లాప్రగడ తాయ్ ప్రెసిడెంట్,ఆస్ట్రేలియా తెలుగు సంఘం చైత్ర క్రీడా ప్రయాణంలో తమ మద్దతును అందించగలిగినందుకు గర్వంగా భావించింది. ఆమె సాధించిన అద్భుత విజయాన్ని హర్షభరితంగా అభినందించింది.ఆమెకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు దుర్గేష్ కందుల,రాంప్ర సాద్‌రెడ్డి మండిపల్లి, వంగలపూడి అనిత,శాప్ ఛైర్మన్ రవినాయుడు, మహిళా కమీషన్ ఛైర్‌పర్సన్ శైలజా రాయపాటి అభినందనలు తెలిపారు.




వరల్డ్ స్కేట్ పసిఫిక్ కప్‌లో బెజవాడ అమ్మాయి చైత్ర దీపిక

## 18 నుంచి అసెంబ్లీ

>> ఉన్నట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంవత్సరం పూర్తయిన సందర్భంగా.. పాలనపై సమగ్రంగా చర్చ జరగనుంది. 14, 15 తేదీల్లో తిరుపతిలో మహిళా పార్లమెంటేరియన్ సమావేశం జరగనుందని, దేశంలోని అన్ని రాష్ట్రాల మహిళా శాసన సభ్యులు సహా సుమారు 300 మంది హాజరు కానున్నారని తెలిపారు. ఈ సమావేశాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్యం ఇస్తోందని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇతర విషయాలపైనా మాట్లాడారు. మహిళా పార్లమెంటేరియన్ సమావేశాన్ని 14న లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. 15న ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్, జస్టిస్ అబ్దుల్ నజీర్ హాజరవుతారని చెప్పారు. ఇక 10 రోజులపాటు ఏపీ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలనే యోచనలో కూటమి ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. సెప్టెంబర్ 4న జరిగే కేబినెట్ భేటీలో అసెంబ్లీ సమావేశాల షెడ్యూల్ ఖరారు చేసే అవకాశం ఉంది. ఈ విషయాన్నీ గత నెలలలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడించారు.

## సమృద్ధిగా జలవిద్యుత్

>> ఎప్పటికపుడు సమీక్షిస్తున్నారని వినియోగదారులకు నాణ్యమైన,నిరంతర విద్యుత్ అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.ఏపీఎస్ఎల్డీసి డిమాండ్ అంచనా ప్రకారం సెప్టెంబర్ మొదటి వారంలో రోజువారీ విద్యుత్ అవసరం 210 నుండి 225 మిలియన్ యూనిట్ల వరకు, పీక్ డిమాండ్ సుమారు 10,200 నుండి 10,500 మెగావాట్ల వరకు ఉండనుందని అంచనా వేసినట్లు తెలిపారు. ఈ అవసరాలను తీర్చడానికి ఏపీజెన్‌కోకు చెందిన జలవిద్యుత్ , థర్మల్ విద్యుత్ కేంద్రాలు రోజుకు 100 మిలియన్ యూనిట్లకు పైగా, కేంద్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థలు 3540 మిలియన్ యూనిట్ల వరకు, పునరుత్పాదక వనరులు వాతావరణ పరిస్థితులను బట్టి 2530 మిలియన్ యూనిట్ల వరకు ఉత్పత్తి చేస్తాయని ఆయన వివరించారు. దీనికి అదనంగా, ఆగస్టు నెలలో నిల్వ (బ్యాంకు) చేసిన 326 మిలియన్ యూనిట్ల నిల్వను అవసరాల కోసం వినియోగించుకోవచ్చుని, మార్కెట్ నుండి విద్యుత్ కొనుగోళ్లు అవసరమైనంత మేరకు కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు. ఆగస్టు ముగిసే నాటికి జలవిద్యుత్ ఉత్పత్తి 2000 మిలియన్ యూనిట్లు దాటిందన్నారు. ఇది గత దశాబ్ద కాలానికి పైగా ఉత్పత్తి చేసిన అత్యధిక స్థాయి రికార్డుగా నమోదైందని ఏ పీ జెన్కో అధికారులు ఈ సందర్భంగా సిఎస్ కు వెల్లడించారు.

## వారం - వర్జ్యం

01-09-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
నవమి రా.2.41
జ్యేష్ఠ రా.7.51
వర్జ్యం : ఉ.9.05-10.48
దు.మ.12.33-మ.1.23,
2) 3.03-3.53
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** దూర ప్రాంతాలలో ఉన్న మీ వారికి సహాయసహకారాలు అందిస్తారు. వస్తులాభం

**వృషభం:** శ్రమకు తగిన ఫలితాలు ఎక్కువగా చేతికి అందుతాయి. ప్రయాణాలు లాభిస్తాయి.

**మిథునం:**స్త్రీ సంతాన విషయమై విశేషంగా శ్రమించి సత్ఫలితాలు సాధిస్తారు.

**కర్కాటకం:**చెప్పుకోదగిన మార్పు ఆలోచనా ధోరణిలో ఏర్పడుతుంది. వాహనయోగం.

**సింహం:**ఎదుటి వారిని బాగా అంచనా వేయగలుగుతారు. తద్వారా లాభపడతారు.

**కన్య :** జీవిత భాగస్వామితో రాజీ ధోరణి అవలంబించడం మేలు. కాంట్రాక్టులు దక్కుతాయి.

**తుల :**ఆర్థిక విషయ వ్యవహారాలు సానుకూలంగా ఉంటాయి. ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు.

**వృశ్చికం:**ముఖ్యమైన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. వివాహ యత్నాలు.

**ధనుస్సు:** సన్నిహితాల నుండి సహాయ సహకారాలు అందుకుంటారు. సోదరుల కలయిక.

**మకరం:** ఆస్తి వ్యవహారాలు మీకు అనుకూలంగా మారే అవకాశాలు సూచిస్తున్నాయి.

**కుంభం:** మిత్రులు నుండి శుభవార్తలు అందుకుంటారు. ఇంటర్వ్యూలు పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు.

**మీనం :** ఊహించని అవకాశాలు అప్రయత్నంగా లభిస్తాయి. సంఘంలో గౌరవ ప్రతిష్ఠలు పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# పోటీదారులం కాదు భాగస్వాములం

>> ఈ సందర్భంగా సమీక్షించారు. ఇరు దేశాల మధ్య స్థిరమైన, స్నేహపూర్వక సంబంధాలు కొనసాగడం ఆర్థిక వృద్ధికి, ప్రపంచంలో బహుళ ధ్రువ వ్యవస్థకు ఎంతో ముఖ్యమని వారు అభిప్రాయపడ్డారు. భారత్, చైనా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా ఇరువురునేతల వ్యాఖ్యలు కనిపించాయి. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సు సందర్భంగా చైనాలోని తియాంజిన్‌లో ఆదివారం భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ భేటీలో ఇరు దేశాల మధ్య నెలకొన్న పలు కీలక అంశాలపై ఫలప్రదమైన చర్చలు జరిగాయి.ముఖ్యంగా, ద్వైపాక్షిక సంబంధాలు నిరంతరం అభివృద్ధి చెందాలంటే సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, ప్రశాంతత అత్యంత కీలకమని ప్రధాని మోదీ నొక్కిచెప్పారు. గత ఏడాది సరిహద్దుల నుంచి ఇరు దేశాల సైన్యాలు విజయవంతంగా వైదొలగడం, అప్పటి నుంచి శాంతియుత వాతావరణం కొనసాగుతుండటంపై నేతలిద్దరూ సంతృప్తి వ్యక్తం చేశారు. సరిహద్దు వివాదానికి సంబంధించి ఇరు దేశాల ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, రాజకీయ కోణంలో న్యాయమైన, సహేతుకమైన, పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనేందుకు కట్టుబడి ఉన్నామని వారు స్పష్టం చేశారు. ప్రజల మధ్య సంబంధాలను మరింత పెంపొందించుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఇందులో భాగంగా, నిలిచిపోయిన ప్రత్యక్ష విమాన సర్వీసులను పునరుద్ధరించడం, వీసా విధానాలను సులభతరం చేయడం వంటి చర్యలు చేపట్టాలని అంగీకరించారు. ఇటీవల కైలాస మానససరోవర యాత్ర, పర్యాటక వీసాలు తిరిగి ప్రారంభమైన నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆర్థిక, వాణిజ్య సంబంధాలపై కూడా లోతైన చర్చ జరిగింది. ప్రపంచ వాణిజ్యాన్ని స్థిరీకరించడంలో భారత్, చైనా ఆర్థిక వ్యవస్థలు పోషించగల కీలక పాత్రను ఇరువురు నేతలు గుర్తించారు. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని, పెట్టుబడులను విస్తరించుకోవడంతో పాటు, వాణిజ్య లోటును తగ్గించే దిశగా రాజకీయ, వ్యూహాత్మక మార్గనిర్దేశంతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని వారు ప్రస్తావించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఒక ముఖ్యమైన విషయాన్ని స్పష్టం చేశారు. భారత్, చైనా రెండూ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని అనుసరిస్తాయి. మన సంబంధాలను మూడో దేశం కోణంలోంచి చూడకూడదని అన్నారు. ఉగ్రవాదం, న్యాయమైన వాణిజ్యం వంటి ప్రాంతీయ, ప్రపంచ సవాళ్లపై బహుళపక్ష వేదికల మీద ఉమ్మడి వైఖరిని అవలంబించాల్సిన ఆవశ్యకత ఉందని నేతలు అభిప్రాయపడ్డారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ చైనా కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటీ సభ్యుడు కై కీతో కూడా ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక, రాజకీయ, ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై వారు చర్చించారు. మోదీజిన్‌పింగ్ మధ్య కుదిరిన ఏకాభిప్రాయానికి అనుగుణంగా ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరచడానికి చైనా సిద్ధంగా ఉందని కై కీ తెలిపారు. ఎస్‌సీవో సదస్సు నిర్వహణలో చైనా అధ్యక్షతకు ప్రధాని మోదీ మద్దతు తెలిపారు. అదేవిధంగా, 2026లో భారత్ ఆతిథ్యం ఇవ్వనున్న బ్రిక్స్ సదస్సుకు హాజరుకావాల్సిందిగా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను ప్రధాని ఆహ్వానించారు. ఈ ఆహ్వానానికి జిన్‌పింగ్ ధన్యవాదాలు తెలుపుతూ, భారత్ అధ్యక్షతన జరిగే బ్రిక్స్ సదస్సుకు చైనా పూర్తి మద్దతు ఇస్తుందని హామీ ఇచ్చారు.



ఆదివారం పంజాబ్‌లోని వరద ప్రభావిత ప్రాంతాన్ని సందర్శించిన ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు

## 'విజయవాడ ఉత్సవ్'

>> దీపాలంకరణలతో నగరాన్ని ధగధగలాడించనున్నారు. దసరా ఉత్సవాల కోసం విజయవాడకు ఏటా 11 రోజుల్లో రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు, దేశవిదేశాల నుంచి 12-15 లక్షల మంది వస్తుంటారు. వీరు కనకదుర్గమ్మను దర్శించుకొని వెళ్లడం తప్ప మరే ఆకర్షణ లేదు. అందుకే ఈ ఏడాది నుంచి దసరా ఉత్సవాలతో మిళితం చేస్తూ విజయవాడ ఉత్సవ్‌ను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ వేడుకలు కార్నివాల్ తరహాలో జరుగుతాయి. పున్నమిఘాట్, తుమ్మలపల్లి కళాక్షేత్రం, గొల్ల పూడిలో ఎగ్జిబిషన్ మైదానాల్లో అంతర్జాతీయ స్థాయిలో కార్నివాల్ తరహాలో వేడుకల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. అలాగే వినూత్న రీతిలో దుకాణ సముదాయాల స్టాళ్లు, జలక్రీడలు, దాండియా నృత్యాలు, ప్రముఖ మ్యూజిక్ బ్యాండ్స్ ఆధ్వర్యంలో ప్రదర్శనలు, పిల్లలకు ప్రత్యేకంగా క్రీడాజోన్లు పెడతారు.రోజూ ఒక ప్రీ రిలీజ్ ఈవెంట్ గొల్లపూడిలో 39 ఎకరాల్లో ఎగ్జిబిషన్ మైదానం పెట్టి వినూత్న కార్యక్రమానికి రూపకల్పన చేశారు. 11 రోజులు ఒక్కో సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. ఓజీ ప్రీరిలీజ్ ఈవెంట్‌తో కార్యక్రమాలు ఆరంభం కాబోతున్నాయి. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిత్యం ఉదయం నుంచి రాత్రి వరకూ సినీ, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. ఈ దసరాలకు హెలీకాప్టర్ రైడ్, గ్యాస్ ఎయిర్ బెలూన్స్‌లో నింగిలోకి వెళ్లే అనుభూతిని కూడా విజయవాడ వాసులు, పర్యాటకులు పొందొచ్చు. ఇవేకాక నగరంలో అన్ని ప్రాంతాల్లోనూ పిల్లలు ఆడుకునేలా క్రీడాపరికరాలు పెట్టనున్నారు. దసరా వస్తోందంటే చాలూ ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిస్తోంది. శరన్నవరాత్రుల్లో అమ్మవారు రోజుకొక అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు. తెలుగు ప్రజలంతా "అమ్మలగన్న అమ్మ మము కన్నతల్లి మాతల్లి దుర్గమ్మ" అని నోరారా విజయవాడ కనకదుర్గమ్మను పిలుచుకుంటారు. ఇంద్రకీలాద్రిపై వెలిసిన కనక దుర్గాదేవికి ప్రతి సంవత్సరం శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

ఇప్పటికే విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ఇందుకోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీని ఉపయోగించనున్నట్లు చెప్పారు. ఈసారి ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమర్ధవంతంగా వేడుకలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు అన్ని శాఖలతో కలిసి సమన్వయంతో పని చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే విజయదశమి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే దుర్గా దేవి మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది.

## మంత్రి లోకేష్‌కు మరో అరుదైన గౌరవం

>> కావాలని మంత్రి లోకేష్‌ను కోరింది. గత 20 ఏళ్లలో భారతదేశంలోని ప్రముఖ రాజకీయ నాయకులు ఈ కార్యక్రమం ద్వారా ఆస్ట్రేలియాలో పర్యటించారని, 2001లో ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకూడా SVPలో భాగస్వాములయ్యారని వెల్లడించింది. స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్ లో భాగస్వామ్యం కావడం ద్వారా ఆస్ట్రేలియాలోని కీలక రాజకీయ నేతలు, విద్యారంగ నిపుణులు, వ్యాపారవేత్తలు, ప్రవాస భారతీయులతో సమావేశమయ్యే అవకాశం ఏర్పడుతుంది.

తద్వారా ఏపీ అభివృద్ధి ప్రాధాన్యతలు.. ముఖ్యంగా విద్యారంగం, నైపుణ్యాలు, పెట్టుబడులు, ఆక్వాకల్చర్, మౌలిక వసతులపై ఆస్ట్రేలియాతో చర్చించేందుకు ఈ పర్యటన దోహదం చేస్తుంది.

## ఫిబ్రవరిలోనే ఇంటర్ పరీక్షలు

>> అవకాశం వచ్చింది. అందువల్ల ఒకేరోజు 2 పరీక్షలు రాయడం సాధ్యం కాదు కాబట్టి ఒక రోజు ఒకే పరీక్ష పెట్టనున్నారు. సైన్స్ గ్రూపు సబ్జెక్టులన్నీ పూర్తయ్యాక చివరిలో భాషల పరీక్షలు ఉంటాయి. అనంతరం ఆర్ట్స్ గ్రూపు పరీక్షలు ప్రారంభమవుతాయి. ప్రాక్టికల్ పరీక్షలను జనవరి చివరిలో నిర్వహించాలా? లేదంటే రాతపరీక్షలు పూర్తయ్యాక నిర్వహించాలా? అనేదానిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ఈ ఏడాది ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రధానంగా అనేక రకాలైన సంస్కరణలను తీసుకొని రావడం గమనార్హం. పూర్తిగా ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌ను అమలు చేశారు. అదే విధంగా ఎంబైపీసీ, జీవశాస్త్రంతో ఎంపీసీ చదువుకునే వెసులుబాటును సైతం కల్పించారు. ఆర్ట్స్ విద్యార్థులు సైతం కొందరు ఐచ్ఛికంగా సైన్స్ సబ్జెక్టులు ఎంచుకున్నారు. మరికొందరు కొందరు సైన్స్ గ్రూపు విద్యార్థులు రాజనీతిశాస్త్రం, చరిత్ర, ఆర్థికశాస్త్రం ఎంపిక చేసుకున్నారు. ఇంజినీరింగ్, ఎంబీబీఎస్ దేనికైనా అర్హత సాధించేందుకు ఇలా సబ్జెక్టులను ఎంచుకున్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ప్రశ్నపత్రాల విధానాన్ని కూడా మార్చారు. భౌతిక శాస్త్రం, రసాయన, జీవశాస్త్రం సబ్జెక్టులను 85 మార్కుల చొప్పున నిర్వహిస్తారు. మిగతా మార్కులు రెండో ఏడాదిలో ప్రాక్టికల్స్‌కు ఉంటాయి. అన్ని పేపర్లలోనూ ఒక్క మార్కు ప్రశ్నలను కొత్తగా తీసుకొచ్చారు. ఇకపై జీవశాస్త్రంలో వృక్షశాస్త్రం 43 మార్కులకు, జంతుశాస్త్రం 42 మార్కులకు ఉండనుంది. పరీక్షా విధానంలో పలు సంస్కరణలను ఏపీ ప్రభుత్వం చేపట్టింది.అందులో భాగంగా ఇంటర్ పరీక్షలను సంస్కరణలను తీసుకుని వచ్చింది.దాంతో ఇంటర్ పరీక్షల్లో ఇకపై రోజుకు ఒక్క సబ్జెక్టుకే పరీక్షలు జరగనున్నాయి. మొదట సైన్స్ గ్రూపులకు, ఆ తర్వాత ఆర్ట్స్ గ్రూపులకు పరీక్షలు నిర్వహించేలా ఇంటర్ విద్యామండలి మార్పులు చేసింది.

## గణపతి నిమజ్జన వేళ అపశ్రుతి

>> బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పరామర్శించారు. డీఎస్పీ శ్రీ వేద ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ఈ సంఘటనలతో తీరప్రాంత గ్రామమైన తూర్పు తాళ్ళు తీవ్ర విషాదంలో నిండిపోయింది.

**కలెక్టర్ చదలవాడ నాగరాణి దిగ్భ్రాంతి**

ప్రమాద సంఘటనపై కలెక్టర్ నాగరాణి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు కలెక్టర్ హుటాహుటిని భీమవరంనుండి బయలుదేరారు. ట్రాక్టర్ డ్రైవర్ మంచినీళ్లు తాగేందుకుదిగడంతో ఓపిల్లవాడు ట్రాక్టర్‌స్టార్ట్ చేయగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఎమ్మెల్యే ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకునే అవసరమైన చర్యలకు ఆదేశాలు ఇచ్చారు.

## 'గ్రీన్ హైడ్రోజన్' విప్లవం

>> ప్రోత్సహిస్తున్నాయి. అదే విధంగా హైడ్రోజన్ నిల్వ చేయడం, రవాణా చేయడం చాలా కష్టం. అత్యంత భద్రతా ప్రమాణాలు అవసర ఉంది.సుమారు 974 కి.మీ. సుదీర్ఘ తీరప్రాంతం, కీలకమైన కృష్ణపట్నం, కాకినాడ వంటి పోర్టులు, అలాగే గోదావరి, కృష్ణా వంటి నదుల జల వనరులు ఆంధ్రప్రదేశ్ సొంతం. ఇవే గ్రీన్ ఎనర్జీ హబ్‌గా ఏపీ ఎదగడానికి అనుకూలతలుగా మారుతున్నాయి. ఇప్పటికే రూ.2.50 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు వివిధ ప్రాజెక్టుల రూపంలో విశాఖపట్నం, కృష్ణపట్నం, కాకినాడ, తిరుపతిలోకి వచ్చాయి. ఇవి పూర్తి స్థాయిలో రూపుదిద్దుకుంటే, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థనే మార్చేస్తాయని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.నీరు (బీ వీ)లోని హైడ్రోజన్, ఆక్సిజన్ మూలకాలను వేరు చేసి హైడ్రోజన్ ఉత్పత్తి చేస్తారు. ఈ ప్రక్రియకు సైతం పవన, సౌర విద్యుత్తును ఉపయోగిస్తారు. దీన్ని సౌర, పవన విద్యుత్ ద్వారా ఎలెక్ట్రోలైజర్లలో వేరు చేస్తే, కర్బన్ ఉద్గారాలు లేకుండా ఉత్పత్తి జరుగుతుంది. ఈ విధంగా హైడ్రోజన్, ఆక్సిజన్ వేరు చేస్తారు. ఇదే గ్రీన్ హైడ్రోజన్. దీనిని విద్యుత్, రవాణా, వ్యవసాయం, ఉక్కు, సిమెంట్ రంగాలలో ఉపయోగించవచ్చు. ఇవన్నీ భారీ కర్బన్ ఉద్గారాలను విడుదల చేసే రంగాలు కావడంతో, గ్రీన్ హైడ్రోజన్ మంచి ప్రత్యామ్నాయం కానుంది. మరోవైపు హైడ్రోజన్‌ని వేరుచేసినప్పుడు వాతావరణంలోకి ఆక్సిజన్ చేరడం వల్ల దాని శాతం పెరుగుతుంది. ఓజోన్ పొర వృద్ధి చెందడానికి, భూగోళం వేడెక్కకుండా కాపాడేందుకు అవకాశం ఏర్పడుతుంది.

పర్యావరణ పరిరక్షణలో భాగంగా అమరావతిలో ఏర్పాటు చేసే గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ రాష్ట్రానికి గేమ్ ఛేంజర్ కానుందని ప్రభుత్వం విశ్వసిస్తోందన్నారు.. ఏపీలో పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని సీఎం చంద్రబాబు భావిస్తున్నట్లు స్పష్టం చేసారు.భూ తాపం నేపథ్యంలో ఉష్ణోగ్రతలు తగ్గించేందుకు ప్రపంచ దేశాలు హరిత ఇంధనం వైపు అడుగులు వేస్తున్నాయి. అందుకు తగినట్లే సౌర, పవన, పంప్డ్ స్టోరేజి విద్యుత్ ప్రాజెక్టు, ఉత్పత్తుల ఎగుమతులకు పోర్టులు, గ్రీన్ హైడ్రోజన్ తయారీకి అవసరమైన నీరు పుష్కలం వంటి అనుకూల వాతావరణం రాష్ట్రంలో ఉంది. అందుకే కేంద్రం నిర్దేశించుకున్న 500గిగావాట్లలో ఏపీలో 160 గిగావాట్ల పునరుత్పాదక ప్రాజెక్టులు ఏర్పాటు చేసేలా పాలసీని రూపొందించారు. వచ్చే ఐదేళ్లలో 10 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులతో 7.5 లక్షల మందికి ఉపాధి కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. విశాఖపట్నం జిల్లా పూడిమడకలో: ఎన్‌టీపీసీ (విగిశిది) రూ.1.85 లక్షల కోట్లు పెట్టుబడితో భారీ గ్రీన్ హైడ్రోజన్ హబ్‌ను నిర్మిస్తోంది. గత ఏడాదినవంబరులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దీని పునాది రాయి వేశారు. నెల్లూరు జిల్లా కృష్ణపట్నం వద్ద: యూకేకు చెందిన యామ్నా కంపెనీ సంవత్సరానికి ఒక మిలియన్ టన్నుల గ్రీన్ అమోనియా ఉత్పత్తి యూనిట్‌ను రూ.16,000 కోట్లు పెట్టుబడితో ఏర్పాటు చేస్తోంది. కాకినాడలో ఏఎం గ్రీన్ అమోనియా ఇండియా సంస్థసంవత్సరానికి ఒక మిలియన్ టన్నుల అమోనియా యూనిట్‌తో పాటు 2 గిగావాట్ల ఎలెక్ట్రోలైజర్ ప్రాజెక్టును రూ.12,000 కోట్లు పెట్టుబడితో నిర్మిస్తోంది. పోలాండ్‌కి చెందిన హైఇన్ఫ్రా కంపెనీ రూ.35,000 కోట్ల పెట్టుబడితో 150 కిలో టన్నుల హైడ్రోజన్, 600 కిలో టన్నుల గ్రీన్ అమోనియా యూనిట్‌ను నెలకొల్పేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. దీని ద్వారా 10,000 మందికి ఉపాధి లభించనుంది.

**ఏపీలో గ్రీన్ హైడ్రోజన్ తయారీకి భౌగోళిక అనుకూలతలు**

హైడ్రోజన్‌ను దేశీయ అవసరాలతో పాటు విదేశాలకు సైతం ఎగుమతి చేయాలనే లక్ష్యంతో పునరుత్పాదక ఇంధన వనరుల్ని 500 గిగావాట్లకు పెంచేలా కేంద్రం ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. అందులో 20 హైడ్రోజన్ ఏపీలో ఉత్పత్తి చేయాలని సంకల్పించినట్లు సీఎం చంద్రబాబు స్పష్టం చేసారు. దీనికి అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయడానికి అమరావతిలో గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్2025 నిర్వహించామన్నారు.. రాష్ట్రంలో ఉన్న అవకాశాలను పారిశ్రామికవేత్తలకు వివరించి పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. సదస్సులోనే 51,000 కోట్ల రూపాయల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు జరిగాయి. దీంతో గ్రీన్ హైడ్రోజన్ తయారీకి కీలక అడుగులు పడినట్లైందని నిపుణులు అభిప్రాయమని సీఎం తెలిపారు.గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ సంబంధించి అమరావతి డిక్లరేషన్ ను ఇప్పటికే విడుదల చేసామన్నారు. 2030 నాటికి ఏపీని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా మార్చేందుకు కార్యాచరణ ప్రకటించారు. గ్రీన్‌హైడ్రోజన్ ఉత్పత్తికి దేశంలోనే అతిపెద్ద ఎకో సిస్టంను నెలకొల్పాలని డిక్లరేషన్‌లో తెలిపారు. 2027 నాటికి 2 గిగావాట్లు, 2029కి 5 గిగావాట్ల ఎలక్ట్రోలైజర్ల గ్రీన్ హైడ్రోజన్ తయారీ చేయాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు. 2029 నాటికి ఏడాదికి 1.5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయనున్నారు. కిలో హైడ్రోజన్ గ్యాస్‌రూ. 460 నుంచి రూ. 160 తగ్గించేలా కార్యాచరణ రూపొందించనున్నారు. 2029 నాటికి 25 గిగావాట్ల రెన్యువబుల్ ఎనర్జీ పంపిణీకి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేయనున్నారు. అంతేగాక, గ్రీన్ ఎనర్జీ కారిడార్‌గా అమరావతిని తీర్చిదిద్దాలని డిక్లరేషన్‌లో నిర్ణయించారు. ఇందుకోసం గ్రీన్‌హైడ్రోజన్ దిశగా 50 స్టార్టప్‌లకు ప్రోత్సాహం కల్పించాలని డిక్లరేషన్‌లో ప్రకటించారు.గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి కిలోకు 4 డాలర్ల వరకు ఖర్చవుతోంది. దీన్ని 1.5 డాలర్లకు తగ్గించే దిశగా పరిశోధనలు జరుగుతున్నాయి. 2030 నాటికి 5 మిలియన్ టన్నుల హైడ్రోజన్ ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనివల్ల లక్షల కోట్ల పెట్టుబడులు రావడంతో పాటు ఉపాధి అవకాశాలు లభిస్తాయని కేంద్రం భావిస్తోంది. ఐతే, ఇంధన తయారీలో విడుదలయ్యే కర్బన ఉద్గారాలు తగ్గించటం కీలకం. ఈ క్రమంలో 50 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్బన్ డయాక్సైడ్ తగ్గేఅవకాశం ఉందని ఇంధన రంగ నిపుణులు చెబుతున్నారు. ఏపీలో గ్రీన్ హైడ్రోజన్ తయారీకి భౌగోళిక అనుకూలతలు ఉన్నాయి. గాలి, నీరు, సౌరశక్తితో పాటు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. సౌర, పవన,జల విద్యుత్‌ను పునరుత్పాదక ఇంధన వనరులు ఉపయోగించి గ్రీన్ హైడ్రోజన్ తయారు చేస్తారు. విద్యుత్ విశ్లేషణ ప్రక్రియ ద్వారా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి అవుతుంది. నీటిని హైడ్రోజన్, ఆక్సిజన్‌గా విడగొట్టటం ఇందులో కీలకం. ఈ ప్రక్రియలో తయారైన హైడ్రోజన్‌ని గ్రీన్ హైడ్రోజన్‌గా పిలుస్తారు. ప్రపంచ వ్యాప్తంగా దీన్నే క్లీన్ హైడ్రోజన్‌గా అత్యంత శుద్ధమైందిగా అభివర్ణిస్తారు. శిలాజ ఇంధనాలకు గ్రీన్ హైడ్రోజన్‌ని ప్రత్యామ్నాయంగా నిపుణులు చెబుతున్నారు.దీనికి ఖర్చు ఎక్కువయ్యే అవకాశం ఉన్నప్పటికీ పరిశోధనలుజరిగి ఉత్పత్తి పెరిగితే వ్యయం తగ్గొచ్చని నిపుణులు వెల్లడించినట్లు సీఎం వివరించారు.



## రైల్వే బోర్డు చైర్మన్ సతీష్ కుమార్ పదవీ కాలం యేడాది పొడిగింపు

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 31,ప్రభాతవార్త:** భారతీయ రైల్వే బోర్డు చైర్మన్, సిఈఓగా పనిచేస్తున్న సతీస్ కుమార్ పదవికాలాన్ని మరో ఏడాది కాలం పాటు పొడిగిస్తూ కేంద్ర నియామకాల క్యాబినెట్ కమిటీ కార్యదర్శి మనిషా సక్సేనా ఆదేశాల జారీ చేశారు. ఐఆర్ఎస్ఎంఇ క్యాడర్‌కు చెందిన సతీష్ కుమార్ 1986-88బ్యాచ్ అధికారి. 1988లో వారణాసి లోని డీజిల్ లోకోమోటివ్ వర్క్స్(డిఎల్‌డబ్ల్యు) లో ఎఎంఇగా తనసర్వీసు ప్రారంభించిన ఆయన అంచెలంచెలుగా తన ప్రతిభా సామర్థ్యాలను కనబరిచి 2022లో నార్త్ సెంట్రల్ రైల్వే అలహాబాద్ జోన్ జనరల్ మేనేజర్‌గా పనిచేసిన ఆయన 2024సెప్టెంబరు 1 నుంచి రైల్వే బోర్డు చైర్మన్/సిఇఓగా నియమించింది. సతీష్ కుమార్ ఆగస్టు 31నపదవి విరమణ చేయాల్సి ఉండగా, ఆయన సేవలను గుర్తించిన కేంద్రప్రభుత్వం సతీష్ కుమార్‌ను రైల్వే బోర్డుచైర్మన్‌గా 1-9-2025నుంచి మరో ఏడాది పాటు రైల్వే బోర్డు చైర్మన్,సిఇఓగా కొనసాగించాలని నిర్ణ

### ఎదురుమొండి గొల్లమంద రోడ్డుకు

## త్వరలో శంకుస్థాపన: ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

**విజయవాడ,ఆగస్టు31,ప్రభాతవార్తప్రతినిధి:** నాగాయలంక మండలం ఎదురుమొండి గొల్లమంద వయా బ్రహ్మయ్యగారి మూల రహదారి నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన జరుగుతుందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. ఆదివారం అవనిగడ్డలోని తమ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ రహదారికి శంకుస్థాపన చేయడానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అంగీ కరించినట్లు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఆసియా ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్మెంట్ బ్యాంక్ నిధులు రూ.13 కోట్ల 88 లక్షలతో నిర్మించ తలపెట్టిన ఈ రోడ్డు టెండర్ ప్రక్రియ ముగిసినట్లు తెలిపారు. త్వరలో శంకుస్థాపన తేదీ ఖరారు చేస్తారని పేర్కొన్నారు. ఎదురుమొండి గొల్లమంద వయా బ్రహ్మయ్య గారి మూల రోడ్డు కోతకు గురి కావడం, ప్రజలకు రహదారి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిధులు మంజూరు చేయించారని బుద్ధప్రసాద్ తెలిపారు. అవనిగడ్డ నియోజక వర్గంలో అధ్వాన్న స్థితిలో ఉన్న ప్రధాన రహదారుల గురించి, అటవీ శాఖ సమస్యల గురించి వారి దృష్టికి తీసుకెళ్ళినట్లు వివరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అధికారులకు తగిన ఆదేశాలిచ్చారని తెలిపారు.



## ఆరోగ్య గమ్యానికి సైకిల్ సవారీ: కలెక్టర్ లక్ష్మీశ



పెడల్ ఫర్ ఫిట్నెస్ అండ్ యునిటీ ఇతివృత్తంతో నిర్వహించిన సైకిల్ రైడ్ లో ఎన్టీఆర్‌కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ,ఆగస్టు31,ప్రభాతవార్తప్రతినిధి:** ఆరోగ్యం, ఆహ్లాదం.. ఆపై పర్యావరణ పరిరక్షణకూ సైక్లింగ్ చేయూతనిస్తుందని, చిన్నారులు, యువత సైకిల్ సవారీని అలవాటుగా చేసుకొని శారీరక, మానసిక ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవడంతో పాటు కాలుష్య రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.

జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా అమరావతి రన్నర్స్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో పెడల్ ఫర్ ఫిట్నెస్ అండ్ యునిటీ ఇతివృత్తంతో నిర్వహించిన సైకిల్ రైడ్ లో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పాల్గొన్నారు. డా. బీఆర్ అంబేద్కర్ స్మృతి వనం నుంచి ప్రారంభమైన ఈ రైడ్ బెంజ్ సర్కిల్, రామవరప్పాడు, బీఆర్టీఎస్ రోడ్డు, గాంధీనగర్, మునిసిపల్ ఆఫీస్, ప్రకాశం బ్యారేజ్, కంట్రోల్ రూమ్, స్టేడియం వరకు మొత్తం 21 కి.మీ. మేర సాగింది. దాదాపు 80 మంది సైక్లిస్టులు ఉత్సాహంగా పాల్గొని ఐక్యతా మార్గంలో క్రీడాస్ఫూర్తిని చాటిచెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే సైక్లింగ్ ను హాబీగా మార్చుకొని ముందుకువెళ్లాలని, ఓ మంచి అలవాటు ఎన్నో విజయాలకు సోపానమవుతుందని పేర్కొన్నారు. అందుకే అవగాహన పెంచుకొని సైక్లింగ్ ను అభిరుచిగా మార్చుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. లండన్ ఎడిన్బర్గ్ లండన్ (ఎల్ ఈ ఎల్) సైక్లింగ్ ఈవెంట్ 2025లో పాల్గొన్న నిషికాంత్ ను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో అమరావతి రన్నర్స్ ప్రెసిడెంట్ ఆర్.రమేష్ రవి, సభ్యులు బసవేశ్వరరావు, జీవీ సత్యనారాయణ, నిషికాంత్ తదితరులతో పాటు సీవైసీవో, డెకథ్లాన్ సైక్లింగ్ క్లబ్స్ సభ్యులు, సిటీ రన్నర్స్ పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ జిల్లా పేరులో విజయవాడను చేర్చండి

### బిజెపి నేత లక్ష్మీపతి రాజా

**విజయవాడ,ఆగస్టు31,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ కేంద్రంగా ఉన్న ఎన్టీఆర్ జిల్లా పేరును, 'ఎన్టీఆర్ విజయవాడ జిల్లా'గా, మచిలీపట్నం కేంద్రంగాఉన్న కృష్ణాజిల్లా పేరును 'పింగళి వెంకయ్య కృష్ణాజిల్లా'గా మార్చాలని భారతీయ జనతాపార్టీ నేత కేవీ లక్ష్మీపతి రాజా సీఎం చంద్రబాబుకు బహిరంగ లేఖను రాసారు. ఒంగోలు కేంద్రంగా ఉన్న ప్రకాశం జిల్లా పేరును 'శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు జిల్లా'గా మార్పు చేయవలసిందిగా విజ్ఞప్తి చేసారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పేర్లు మార్పు చేర్పుల అంశంలో నియమించిన మంత్రివర్గ ఉప సంఘం దృష్టికి ప్రజా వినతులు స్వీకరించుటకు ఇచ్చిన అవకాశం ఆధారంగా తాను ఈ లేఖను రాస్తున్నట్లు లక్ష్మీపతిరాజా పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్య కూడలి నగరమైన విజయవాడ నగరానికి ఆధ్యాత్మిక, చారిత్రాత్మక, రాజకీయ రంగాలతో పాటుగా విద్యను అందించే విజయవాడ నగరంగా పేరు ఉన్న సంగతి గమనించాల న్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల మార్పులు, జిల్లా పేర్ల మార్పులు, కొత్త జిల్లాల ఏర్పాటు, ఇతర అంశములు పరిగణలోకి తీసుకుని సరిహద్దులు మార్పు అంశాలు ప్రజల ఆశలకు అనుగుణంగా ఏర్పాటు చేయటానికి, ప్రభుత్వం ఏర్పాటుచేసిన మంత్రివర్గ ఉప సంఘం సభ్యులు ఈ అంశం సమగ్రంగా పరిశీలించి తగు సానుకూల నిర్ణయం తీసుకుంటారని కోరుకుంటున్నాము.

## రూ. 2,746.52 కోట్ల భరసో పెన్షన్ నిధులు విడుదల

### స్పౌజ్ పెన్షన్‌ల కోసం అదనంగా రూ.3.15 కోట్లు విడుదల: మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**విజయవాడ ఆగస్టు31,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీర్ భరోసా పెన్షన్ పథకం కింద సెప్టెంబర్ ఒకటవ తేదీన 63,61,380 మంది లబ్ధిదారులకు పెన్షన్ మొత్తాన్ని పంపిణీ చేసేందుకు రూ. 2,746.52 కోట్లు గ్రామ, వార్డు సచివాలయాలకు విడుదల చేసిందని రాష్ట్ర సూక్ష్మ,, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. కొత్తగా మంజూరైన 7,872 మంది స్పౌజ్ పెన్షన్ లబ్దిదారులకు సెప్టెంబర్ 1న పెన్షన్ పంపిణీ చేయడానికి రూ. 3.15 కోట్లు కూడా విడుదలచేశామని మంత్రి చెప్పారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి పించన్ల కోసం రూ. 32,143 కోట్లు బడ్జెట్ కేటాయించగా, ఇందులో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ 2025 వరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ల పంపిణీకి రూ. 16,366.80 కోట్లు విడుదలయ్యాయని తెలిపారు. దేశంలో మరే రాష్ట్ర ప్రభుత్వం కూడా పెన్షన్ కోసం రూ. 10,000 కోట్లకు మించి కేటాయించడం లేదని తెలియజేశారు. పెన్షన్ పంపిణీ ప్రక్రియ మరింత పారదర్శకంగా ఉండేలా, లబ్ధిదారుల ఇంటి వద్దే పెన్షన్ అందించడం తోపాటు వారి జియోకోఆర్డినేట్స్‌ను కూడా నమోదు చేస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికి, అభివృద్ధికి కట్టుబడి ఉందని, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు వంటి నిరుపేద, నిస్సహాయ వర్గాల కష్టాలను తొలగించడానికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్



పథకాన్ని ఒక ముఖ్యమైన సంక్షేమ పథకంగా అమలు చేస్తోందని అన్నారు. దేశంలో సామాజిక భద్రతా పెన్షన్ కోసం అత్యధిక మొత్తాన్ని ఖర్చు చేస్తున్నది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమేనని మంత్రి శ్రీనివాస్ తెలియజేశారు.

## మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు

**విజయవాడ,ఆగస్టు31,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న వన్ స్టాప్ సెంటర్ (విజయవాడ)లో సెంటర్ అడ్మినిస్ట్రేటర్ 1 పోస్ట్, సైకో సోషల్ కౌన్సెలర్ 1 పోస్ట్ భర్తీ చేసేందుకు గత ఏడాది అక్టోబర్ 16ననోటిఫికేషన్ ఇచ్చి ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందని అయితే ఇంటర్వ్యూలో ఎవరూ అర్హత సాధించనందున తిరిగి నోటిఫికేషన్ జారిచేసినట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి షేక్ రుక్సానా సుల్తానా బేగం తెలిపారు. కాంట్రాక్టు/ఔట్సోర్సింగ్ పద్ధతిపై పనిచేయుటకు స్థానిక అర్హులైన 18 నుండి 42 సంవత్సరాల వయస్సు గలిగిన మహిళా అభ్యర్థులు నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ మహిళలకు 5 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాల గరిష్ట వయస్సు సడలింపు ఉంటుందన్నారు. సెప్టెంబర్ 9 వరకు ఆసక్తిగల స్థానిక మహిళా అభ్యర్థులు ఎన్టీఆర్.ఏపీ గవ్నట్ ఇన్ నుండి దరఖాస్తులు డౌన్లోడు చేసుకొని.. పూర్తిచేసి, ధ్రువీకరణ పత్రాల నకళ్ళను గజిటెడ్ అధికారిచే అటెస్ట్ చేయించి.. ఆ దరఖాస్తులను జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారిణి వారి కార్యాలయం, డోర్ నెంబర్ 31429/ఏ, గద్దె పూర్ణచంద్రరావు విధి, మారుతీనగర్ సెకండ్ లేన్, విజయవాడ కార్యాలయంలో అభ్యర్థులు స్వయంగా సమర్పించాలన్నారు.

## ప్రజల్ని జాగృతపరిచే సాహిత్యం రావాలి

### ఎక్స్‌రే జాతీయ సాహిత్య పురస్కారాల ప్రధాన సభలో పలువురు వక్తలు



ఎక్స్‌రే కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న ఇంతియాజ్ తదితరులు

**విజయవాడ,ఆగస్టు31,ప్రభాతవార్తప్రతినిధి:** కవులు సమాజంపట్ల భాధ్యత వహించి చైతన్యవంతమైన, ప్రజల్ని జాగృతపరిచే సాహిత్యం సృజన చేయాలని మెప్మా మాజీ అధికారి, విశ్రాంతఐఎఎస్ ఎఎండి ఇంతి యాజ్ అన్నారు. ఆదివారం జాతీయ స్థాయి కవితల పోటీ విజేతలకు 2024 -ఎక్స్ రే అవార్డుల.. ప్రదాన కార్యక్రమం ..విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటి హాల్‌లో జరిగింది.ఎక్స్ రే.. సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ ఆద్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎ ఎమ్ డి ఇంతియాజ్ ప్రసంగం కొనసాగిస్తూ సామాన్యులకు కూడా అర్థమయ్యే భాషలో కవిత్వం రావాలి అన్నారు. మన పూర్వికులు అద్భుతమైన సాహిత్యాన్ని మనకందించారని, వాటిని అవగాహన చేసుకుని ప్రభావితం కావాలి అన్నారు. కవులు అద్భుత పద ప్రయోగం చేసాము అని ఉత్సాహపడక, తన సాహిత్యం ఎంతమంది చదవగలుగుతున్నారు అని ఆలోచించాలి అన్నారు. వేమన, గుర్రం జాషువా, మహాకవి శ్రీశ్రీ కవిత్వాన్ని ఇంతియాజ్ విశదపరిచారు. మహిళలు కూడా కవిత్వ రచనలో ముందుండాలని డిప్యూటీ కలెక్టర్ కొమ్మెర్ల కృష్ణవేణి అన్నారు. దైనందిన జీవితంలో సామాన్యుడి కష్టాలను కవిత్వంలో చూపాలని కృష్ణవేణి అన్నారు. ఎక్స్ రే అధ్యక్షులు కొల్లూరి తన అధ్యక్షోపన్యాసంలో గత 44 సంవత్సరాలుగా ఈ కవితల పోటీలు నిర్వహిస్తుందన్నారు. నిజాయతీగా, నిష్కర్షగా న్యాయ నిర్ణేతలచే విజేతలనుఎంపిక చేస్తామన్నారు. కవుల జీవితంలో చిరస్థాయిగా గుర్తుండేలా అవార్డు ప్రదానం, సత్కారం చేస్తామన్నారు. వర్తమాన సమస్యలను ప్రతిభింబిస్తూ చేసే రచనలు చిరకాలం ప్రజల మనస్సుల్లో ఉంటాయని ఎక్స్ రే కార్యదర్శి బోడి ఆంజనేయ రాజు స్వాగతం పలుకుతూ అన్నారు. ప్రధాన అవార్డు గ్రహీతగా కన్నీటి రణం.. కవిత రచించిన మానుకోట కు చెందిన అక్షరం ప్రభాకర్ కు 12 వేల నగదు, జ్ఞాపిక, శాలువ తో వేదికపై ఉన్న కలెక్టర్ల చే సన్మానం జరిగింది. ఉత్తమ కవులుగా మామిడిశెట్టి శ్రీనివాస రావు(దొడ్డిపట్ల), శ్రీధర్ బాబు(నెల్లూరు), చిత్రాడ కిషోర్ కుమార్(విజయవాడ), జగరావు శంకరరావు(గజపతి నగరం), శ్రీకంఠస్ఫూర్తి (విజయవాడ), దుప్పటి రమేష్ బాబు(నెల్లూరు), ధవళేశ్వరపు రవికుమార్(విశాఖ పట్నం), డాక్టర్ కోరుప్రోలు హరనాథ్(హైదరాబాదు) లు వెయ్యి రూపాయిలు నగదు, జ్ఞాపిక, శాలువా అవార్డుతో సత్కరించారు. ఈకార్యక్రమంలో పోటీల్లో విజేతల కవితలతో ప్రచురించి ఎర్స్ రే కవితా సంపుట్టిని ఇంతియాజ్ ఆవిష్కరించారు. వేదికపై శ్రీశ్రీ సాహిత్యానిధి సింగంపల్లి అశోక్ కుమార్, హెచ్ఆర్పిఎస్ నేషనల్ కమిటీ కంచర్ల ముత్యప్రసాద్, కవి కె వి శ్యాంసుందర్, నందనోదయ ప్రసంగించారు. న్యాయనిర్ణేత, కవి, జర్నలిస్ట్ సర్వజిత్ బహుమతి కవితలను విశ్లేషించారు. విజేతలైన కవులు తమ స్పందన వినిపించారు. సభ ప్రారంభంలో చిన్నారుల నృత్యాలు అలరించాయి. సంస్థ కోశాధికారి చామర్తి వెంకట సుబ్బయ్య, కందికొండ రవికిరణ్, పొత్తూరి సీతారామారావు, బి వసంత కుమార్, కొల్లూరి కనకవల్లి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

## విజయవాడ ఠాగూర్ లైబ్రరీలో ధ్యాన శిక్షణ

**విజయవాడ,ఆగస్టు31,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం ధ్యానం తరగతులు నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రంథపాలకురాలు రమాదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తన దైనందిన జీవితంలో ధ్యానంను భాగం చేసుకోవాలని, ధ్యానం ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుందని ఆరోగ్యంగా ఉంటారని తెలియజేశారు. ప్రతీ రోజు కనీసం 5 నిమిషాలు చేయాలన్నారు. ఇకపై గ్రంథాలయంలో నిర్దిష్ట సమయాల్లో ధ్యాన్య శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు.ఈ సందర్భంలోనే ఆర్అండ్‌బీ ఇంజినీర్లు ఎం.హరిబాబు, శశిరేఖ, ప్రోత్సాహంతో 100మంది విద్యార్థులకు శాశ్వత సభ్యత్వం కల్పించినట్లు తెలిపారు. బిషప్ హాజరయ్యా ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రధానోపా ధ్యాయురాలు నిర్మలమా విద్యార్థులకు పుస్తక పఠనం పెంపొందించుట కొరకు మాకు కొన్ని పుస్తకాలు తమ గ్రంధాలయం నుంచి ఇవ్వగలరు అని కోరామన్నారు. ఈ విషయం హరిబాబు దంపతులకు తెలియజేయగా లైబ్రరీకి ఎంతో ప్రోత్సాహం ఇస్తున్న దంపతులు వెంటనే వందమంది విద్యార్థులకు తాము శాశ్వత సభ్యత్వం కడతామని ముందుకు వచ్చారన్నారు.రూ. 5000 తమకు అందజేసినట్లు తెలిపారు.దాంతో 100 మంది పిల్లలతో శాశ్వత సభ్యత్వం కట్టించినట్లు తెలిపారు.

## తిరుపతిలో ప్రశాంతంగా గణేశ విగ్రహాల నిమజ్జనాలు

**తిరుపతి,ఆగస్టు 31ప్రభాతవార్తప్రతినిధి:** ఆధ్యాత్మికనగరం తిరుపతిలో ఆదివారం ఉదయం నుండి రాత్రి వరకు వినాయకసాగర్‌లో వందలాది విగ్రహాలు ప్రశాంతంగా నిమజ్జనం చేశారు. తిరుపతిలోని వరసిద్ధివినాయక మహోత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు, అదనపు ఎస్పీ రవిమనోహరచారి, డిఎస్పీ భక్తవత్సలం, అలిపిరి సిఐ రామకిశోర్ సిబ్బందితో,వినాయక కమిటీ సభ్యులు ఉదయం నుండి సాగర్‌కెళ్ళే మార్గాల్లో ప్రత్యేక శిబిరాల నుండి ప్రశాంత నిమజ్జనానికి సహకరించారు. ఆయా విగ్రహాల మండపాల కమిటీలకు నిర్వాహకులకు ముందుగానే సూచించిన రూట్‌మ్యాప్,సమయం మేరకు విగ్రహాలను నిమజ్జనానికి భక్తిశ్రద్ధలతో పూర్తిగా ఆధ్యాత్మిక వాతావరణంలో తరలించారు. యువత నృత్యాలు చేస్తూ డ్రమ్స్‌వాయిస్తూ జై బోలో గణేశ్‌మహారాజ్ కీ జై ..జై గణేశ్ అంటూ క్రమపద్ధతిలో నిమజ్జనం చేశారు.వినాయక మహోత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు గోపీనాథరెడ్డి, భాస్కర్‌నాయుడు, నవీన్‌కు మార్‌రెడ్డి, ఆర్‌సి మునికృష్ణ, తొం డమ నాటి సుబ్రమణ్యంరెడ్డి,చెంగారెడ్డి,సురేశ్ స్వామి, చంగల్‌రాయలు,నిమజ్జనం చేయించారు,

# తిరుమల సమాచారం

## బాలాజీని దర్శించుకోవడం ఆనందంగా ఉంది

### త్రిసేనల లార్డ్‌బుద్ధ సర్క్యూట్ యాత్రబృందం

**తిరుమల,ఆగస్టు 31ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని (బాలాజీస్వామిని) దర్శించుకోవడం ఆనందంగా ఉందని త్రిసేనల లార్డ్‌బుద్ధసర్క్యూట్ మోటార్‌సైకిల్ యాత్ర బృందం కన్వీనర్ రాహుల్‌పాటిల్ తెలిపారు. స్వామివారిని దర్శించుకునే భాగ్యం కల్పించిన తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలుతెలిపారు. భారతరక్షణ మంత్రిత్వశాఖకు చెందిన త్రిసేనల అధికారులు, బిమ్‌స్టెక్ దేశాల నుండి వచ్చిన ప్రతినిధులు యాత్రద్వారా భగవాన్ బుద్ధుని శాశ్వత సందేశమైన శాంతి, కరుణ, సౌభ్రాతృత్వంను భారతదేశం అంతటా వ్యాపించేటట్లు చేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. బుద్ధ సర్క్యూట్ పేరుతో పురాతన సాంస్కృతిక, ఆధ్యాత్మిక మార్గాలను పునఃఅన్వేషించడానికి ఈ మోటార్‌సైకిల్ యాత్ర ఉపకరిస్తుందన్నారు. త్రిపుర రాష్ట్రం నుండి మొదలైన ఈ యాత్ర విజయవంతంగా ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగి తిరుమల బాలాజీస్వామిని దర్శించుకోవడం జరిగిందన్నారు. తిరుపతి స్థానిక ప్రజలు అందించిన ప్రోత్సాహం, ఆతిథ్యానికి బృందం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది.ఈ యాత్ర ఆదివారం తిరుపతి నుండి బయలుదేరి చిత్తూరుమీదుగా కర్నాటకకుచేరుకుంటుందని రాహుల్‌పాటిల్ తెలిపారు.తిరుమల ఆలయ అధికారులు చక్కటి దర్శనం చేయించారని కృతజ్ఞతలు తెలిపారు.



## శ్రీవారి దర్శనంతో మనసు ఆనందం





**తిరుమల,ఆగస్టు31ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటే మనసు ఆనందం కలుగుతుందని, స్వామివారి ఆశీస్సులతో అందరికీ అంతా మంచి జరగాలని ప్రార్థించినట్లు ఆంధ్రప్రదేశ్ మాజీ ఎస్ఇసి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్, న్యూఢిల్లీలో తమిళనాడు ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఎకెఎస్ విజయన్ తెలిపారు. స్వామివారి దర్శనం చేసుకుని ఆశీస్సులందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆదివారం ఉదయం ఆలయంలోపలకు చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఆదిభట్ల నారాయణదాసు విగ్రహానికి పుష్పాంజలి

**తిరుమల,ఆగస్టు 31ప్రభాతవార్తప్రతినిధి:** హరికథ పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు జయంతి సందర్భంగా ఆదివారం ఉదయం ఆయన విగ్రహానికి పలువురు పుష్పాంజలి ఘటించారు. ఎస్వీ సంగీతనృత్యకళాశాలలోని ఆయన విగ్రహానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమా ముద్దుబాల, డిపిపి కార్యదర్శి శ్రీరామ్ రఘురామ్, సంగీత కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



## భగవంతుని అనుగ్రహానికి భక్తి ఒక్కటే మార్గం: మేడసాని

**తిరుమల,ఆగస్టు 31ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగంలో భగవంతుని అనుగ్రహం పొందడానికి భక్తి ఒక్కటే మార్గమని మేడసాని మోహన్ తెలిపారు. భగవంతుని నమ్మిచెడిపోయిన వారు లేరని అన్నారు. హరి అంటే చేసిన పాపాలు పటాపంచలైపోతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. భక్తులలో ప్రథమస్థానంలో ప్రహ్లాదుడు ఉన్నారన్నారు. ఆదివారం ఉదయం ఆదిభట్ల నారాయణదాసు 160వ జయంతి వేడుకలు మహతి ఆడిటోరియంలో జరిగాయి. ఈ సందర్భంగా హరికథ ప్రాశస్త్యంపై డిపిపి కళాకారులు ఆదిపట్ల నారాయణ దాసు జీవితం,కీర్తనలపై గోష్టిగానం చేశారు. హరికథ ధర్మప్రచారంపై డాక్టర్ వై.వెంకటేశ్వర్లు భాగవతులు ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో భాగవతారిణి పి.వరలక్ష్మి, డాక్టర్ ఎంవి సింహాచలశాస్త్రి, ఎం.రాముడు, విజయకుమారి, హెచ్‌డిపిపి కార్యదర్శి శ్రీరామ్ రఘునాథ్, డిప్యూటీ కార్యదర్శి రామగోపాల్, ఎఇఒ సిహెచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




## భక్తాగ్రేసరులలో తిరుమలనంబి ప్రసిద్ధి

**తిరుమల,ఆగస్టు 31ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని పలురకాలుగా తమ తమ స్థాయిలో కొలిచి తరించిన భక్తాగ్రేసరులలో తిరుమలనంబి ప్రసిద్ధిచెందారని హిందూ ధార్మికప్రాజెక్టుల ప్రోగ్రామ్ అధికారి రాజగోపాల్ కొనియాడారు. తిరుమలలో ఆది వారం ఉదయం తిరుమలనంబి 1052 అవతా రమహోత్సవాలు వేడుకగా జరిగాయి. ఆలయ దక్షిణ మాఢవీధిలోని తిరుమలనంబి ఆలయంలో ఈసం దర్భంగా 16మంది పండితులు జీవిత చరిత్రపై ఉపన్యసించారు. భగవద్రామానుజులకు స్వయాన మేనమామ. గురుతుల్యులు, శ్రీవారి భక్తాగ్రేసరులలో ఒకరు తిరుమలనంబి. శ్రీవారికి అభిషేకానికి సంబంధించిన పవిత్రజలాలలను తీసుకువచ్చి విశేష సేవచేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పండితులు, అర్చకులు, టిటిడి సిబ్బంది పాల్గొన్నారు.



## టిటిడి ట్రస్ట్‌లకు భూరి విరాళాలు

### బర్డ్ ట్రస్ట్‌కు రూ.3.04కోట్లు, అన్నప్రసాదంకు రూ.10లక్షలు





**తిరుమల,ఆగస్టు 31ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మిక సంస్థ తిరుమలతిరుపతిదేవస్థానం నిర్వహిస్తున్న పలు ట్రస్ట్‌లకు ,పథకాలకు దాతలైన శ్రీవారి భక్తులు భూరీ విరాళాలందిస్తున్నారు. ఆదివారం ఉదయం ఇద్దరు దాతలు తమవంతుగా 3.04కోట్ల రూపాయలు విరాళాలను టిటిడి బర్డ్ ట్రస్ట్‌కు అందించారు. ఇందులో హైదరాబాద్‌కు చెందిన ఆర్ఎస్‌బి రీటైల్ ఇండియా లిమిటెడ్ సంస్థ 2.93కోట్లు రూపాయలు డిడిలను, ఆర్ఎస్ బ్రదర్స్ జ్యువలరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 1.10కోట్ల రూపాయలు డిడిలను టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఆయా సంస్థల ఎండిలు పొట్టి వేంకటేశ్వర్లు, సీర్న రాజమౌళి,టి.ప్రసాదరావు, పొట్టి మాలతి లక్ష్మీకుమారిలు అందజేశారు. అలాగే నర్సారావుపేటకు చెందిన జె.రామాంజనేయులు ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు 10లక్షలు రూపాయలు విరాళంఅందించారు. దాతలను ఈ సందర్భంగా అదనపు ఇఒ వెంకయ్యచౌదరి అభినందించారు.



వార్త


ఎక్కువ గమనించడం, ఎక్కువ బాధలను అనుభవించడం, ఎక్కువ అధ్యయనం చేయడం ఇవి అభ్యసనకు మూడు ముఖ్య స్తంభాలు.

-ఎమర్సన్

# మత్తుపై చేతల్లో చూపాలి


మాదకద్రవ్యాల వ్యసనం జాతి వినాశనానికి దారితీస్తున్నదని దాన్ని సమష్టింగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని, ఎంతోకాలంగా ప్రపంచవ్యాప్తంగా దేశాధినేతలు సెలవిస్తున్నారు. కానీ అంతకు రెట్టింపు స్థాయిలో ఈ మహమ్మారి యేడాదికి యేడాది విస్తరిస్తుండడం ఆందోళన కలిగించే అంశం. ముఖ్యంగా ఈ వ్యసనం ఇటీవల కాలంలో పదహారు, పదిహేడేళ్ల పిల్లలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. మరోవైపు నేరాల సంఖ్య అదుపు లేకుండా పెరిగిపోతున్నది. మాదకద్రవ్యాల మత్తులో వారు ఏంచేస్తున్నారో వారికే తెలియని పరిస్థితుల్లో చేయరాని, చేయకూడని పనులకు పాల్పడుతున్నారు. అవి కప్పిపుచ్చుకునేందుకు హత్యలు చేయడానికి కూడా వెనుకాడడం లేదు. ప్రపంచవ్యాప్తంగా డాక్యుమెంట్ల ద్వారా జరిగిన మత్తుమందుల వ్యాపారంలో ఆసియా ఖండం వాటా పద్నాలుగా శాతానికిపైగా పెరిగిపోయినట్లు చెప్తున్నారు. అందులో చైనా తర్వాత భారత్‌దే అగ్రస్థానం. భారత్‌లో రెండు దశాబ్దాల క్రితం కోటి డెబ్బైలక్షల మంది మత్తుమందు వాడకందార్లు ఉండగా ప్రస్తుతం పదకొండు కోట్లకుపైగా చేరుకున్నదని అనధికార లెక్కలు వెల్లడిస్తున్నాయి. మత్తుమందుల వాడకంలో పంజాబ్ అగ్రస్థానంలో ఉన్నట్లు అనేక సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఆ రాష్ట్రంలో యేటా పదిహేనువేల కోట్ల రూపాయలకుపైగా మత్తుమందులపై ఖర్చు పెడుతున్నారనే అంచనాలు వెలువడుతున్నాయి. తెలుగురాష్ట్రాల్లో కూడా పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. నిత్యం ఎక్కడో ఒక చోట పట్టుబడుతూనే ఉన్నాయి. ఇంకొకపక్క గంజాయి సాగు ఊహించని రీతిలో పెరిగిపోతున్నది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ ఏజెన్సీలోనూ, ఇటు తెలంగాణలో ఖమ్మం, వరంగల్ తదితరజిల్లాల్లో అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగు విస్తరించినట్లు వార్తలు అందుతున్నాయి. ఇక విదేశాల నుండి భారీఎత్తున డ్రగ్స్ అటు ఆంధ్రప్రదేశ్‌కు ఇటు తెలంగాణకు చేరుకుంటున్నట్లు పట్టుబడుతున్న సంఘటనలు రుజువు చేస్తున్నాయి. గతంలో గుజరాత్‌లోని ముంద్రపోర్టులో ఇరవైఒక్కవేల కోట్ల రూపాయల విలువైన మూడువేల కిలోల హెరాయిన్ పట్టుబడినప్పుడు విజయవాడ లింకులు వెలుగులోకి వచ్చాయి. అప్పట్లో కొందరిని అదుపులోకి తీసుకొని విచారించారు. మత్తు మందు సరఫరా కోట్ల డాలర్ల వ్యవహారంలో ఎక్కువ భాగం ఉగ్రవాదసంస్థలకే చేరుతుందని దర్యాప్తు సంస్థలు చెబుతున్నాయి. పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్, ఉజ్బెకిస్థాన్ తోపాటు మరికొన్ని ఆఫ్రికా దేశాలు ఇందులో విరివిగా పాల్గొంటున్నాయి. కాశ్మీర్ ఉగ్రవాదులకు పంజాబ్‌లోని మత్తుమందుల సరఫరా దారులకు గట్టి సంబంధమే ఉన్నట్లు బయటపడింది. అయితే పట్టుబడుతున్నవి వందోవంతు కూడా ఉండకపోవచ్చు. అన్నింటికంటే ప్రధానంగా అత్యంత లాభదాయకం కావడంవల్ల ప్రపంచవ్యాప్తంగా పెద్దపెద్ద నేరముఠాలు, ఉగ్రవాదులు మాదకద్రవ్యాల ఉత్పత్తి,రవాణాను వ్యాపారంగా మలుచుకుంటున్నాయి. మత్తు ముఠాలు సొంతంగా ఒక పెద్ద నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకొని మారుమూల ప్రాంతాలకు రవాణా చేయగలిగిన రకరకాల మార్గాలను ఏర్పర్చుకుంటున్నారు. భారతదేశంలో ఈతరహా మందులు పెద్దమొత్తంలో ఉత్పత్తి అవుతున్నట్లు సమాచారం. అందుబాటులోకి వస్తున్న ఆధునిక, సాంకేతికపరిజ్ఞానాన్ని ఈ మత్తుమందు వ్యాపారులు ఉపయోగించుకుంటున్నారు. బ్యాంకులు, ఇతర వ్యవస్థలతో సంబంధం లేకుండా సరాసరి ఒకరి ఖాతా నుంచి మరొకరి ఖాతాకు బదలీ చేయగలిగే 'క్రిప్టో కరెన్సీ' వాడకం సైతంపెరగడంతో లావాదేవీలకు అదుపులేకుండా పోయింది. గతంలో మత్తుమందులు కొనేవారు తెలిసినా వాడకందార్లు నమ్మకం ఉన్నవ్యాపారులనే సంప్రదించేవారు. మత్తుమందు తీసుకొని డబ్బు చేతిలో పెట్టేవారు. ఆ వ్యాపారి కూడా అత్యంత రహస్యంగా మూడోకంటికి తెలియకుండా మత్తుమందు తెచ్చి అప్పగించేవాడు. అయితే అత్యంత పకడ్బందీగా జరుగుతున్న నిఘా విభాగం అధికారులు కన్నువేయడంతో ఎక్కడో ఒకదగ్గర దొరికిపోయేవారు. ఇప్పుడు ఆపరిస్థితి లేదు. ఇండియాలో మారుమూల ప్రాంతాల్లో కూర్చొని మత్తుమందు వ్యాపారికి ఆర్డర్ ఇవ్వవచ్చు. మత్తు మందు రవాణా, చెల్లింపు సులభం కావడంతో విక్రయాలు విపరీతంగా పెరిగిపోయాయి. తాజాగా మట్టిగాజులు, డిక్షనరీలు పార్సిల్లో డ్రగ్ పెట్టి సరఫరా చేస్తున్న విషయం హైదరాబాద్‌లో బయటపడింది. ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న పది కొరియర్ సంస్థల ద్వారా యేడాదిలో వందకోట్ల రూపాయలకుపైగా విలువైన డ్రగ్స్‌ను దేశవ్యాప్తంగా తరలించినట్లు వెలుగుచూసింది. హైదరాబాద్‌లోని ప్రముఖప్రతిష్టాకరమైన యూనివర్సిటీ విద్యార్థుల డ్రగ్స్‌దందా బట్టబయలు అయింది. సరఫరాలో పాలుపంచుకున్న ముగ్గురు విద్యార్థులతోసహా మరొక ప్రైవేట్ వ్యక్తిని కూడా దర్యాప్తు అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇలా నిత్యం ఎక్కడో ఒక చోట డ్రగ్స్ పట్టుబడుతూనే ఉన్నది. యేటా కొకైన్, బ్రౌన్‌షుగర్ లాంటి మాదకద్రవ్యాలు ప్రపంచవ్యాప్తంగా మూడు, నాలుగువేల టన్నుల వరకు సరఫరా అవుతున్నట్లు అనధికార అంచనాను బట్టి తెలుస్తున్నది. లక్షలాది కోట్ల వ్యాపారం జరుగుతున్నది. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో కూడా పరిస్థితి అదుపు తప్పుతున్నదేమోననిపిస్తున్నది. పట్టుబడిన కేసు ల్లో కూడా పటిష్టంగా వ్యవహరించకపోవడం వల్లనో, లేక చట్టంలో ఉన్న లొసుగులో ఏమోకానీ జైలు నుంచి బయటకు వచ్చినవారు తిరిగి అదేవ్యాపారంలో కొనసాగుతున్నారు. ఏదిఏమైనా మానవ జీవనంతో ఆటలాడుకుంటున్న ఈ మాదకద్రవ్యాలను నిరోధించే విషయంలో మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో చూపాల్సిన తరుణమిది.

మన ఆలోచనలు నాణ్యమైనవైతే మన మానసిక ఆరోగ్యం చక్కగా ఉంటుంది.



షేక్‌స్పియర్

మిక్కిలి ధనంగానీ, గొప్ప విద్య కానీ, గొప్ప అధికారం కానీ పొందినప్పటికీ గర్వం లేక ఏ వ్యక్తి ప్రవర్తిస్తాడో అతడే పండితుడు.



ప్లినీ

# ప్రజావాక్కు



## పెద్దలు ఆలోచించాలి

ఉపరాష్ట్రపతిగా మాజీ జడ్జి పోటీయే సరికాదని మాజీ ప్రధాననాయమూర్తులు జస్టిస్ పి.సదాశివం,జస్టిస్ రంజన్ గొగోయ్‌తో పాటు 56 మంది విశ్రాంత న్యాయమూర్తులు తీవ్ర అభ్యంతరం వెలుబుచ్చారు. రిటైరైన తరువాతసదాశివం కేరళ గవర్నరయ్యారు. గొగోయ్ రాజ్యసభ మెంబరయ్యారు కదా. అవి మరచిరెడ్డి మీద విరుచుకుపడడం ఎందుకు? మరొక వాస్తవం ఏమంటే 1967లో సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి కోకా సుబ్బారావు గారు తన పదవికి రాజీనామా చేసి భారత దేశ అధ్యక్షునిగా పోటీ చేసారు. 1982 లో సుప్రీంకోర్టు జడ్జి హెచ్.ఆర్. ఖన్నాగారు కూడా దేశ ప్రధమ పౌరుని పదవికి పోటీ చేసారు. అలాగే 1969లోసి.జె.ఐ.గా ఉన్న హిదయతుల్లా గారు అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవిని అలంకరించ లేదా? ఇప్పుడు విపక్ష కూటమి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి పోటీ చేయడం సరికాదనడం అనేక కేసులను పర్యవేక్షించి తీర్పులిచ్చిన వారికిది తగునా? విజ్ఞులు ఆలోచించాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## చరిత్రాత్మక మలుపు

చైనా, రష్యా,బ్రెజిల్ దేశాలు అమెరికా వాణిజ్య యుద్ధానికి ఎదురు నిలుస్తున్న వేళ, భారత్ కూడా వెనుకడుగు వేయకపోవడం విశేషం. ట్రంప్ చూపిస్తున్న వ్యతిరేకత రాజకీయ అహంకారంపైనే ఆధారపడినట్లు భారత్– పాకిస్థాన్‌మధ్య యుద్ధాన్ని తానుఆపినట్టన్న అతని వ్యాఖ్యలను రెండు దేశాలు ఖండించడం నిరూపిస్తోంది. తక్షణ ప్రభావం ప్రతికూలమైనా, దీర్ఘకాలంలో ఈఆంక్షలు భారత్‌ను ఆత్మనిర్భర్ దిశగా నడిపిస్తాయి. స్వదేశీ పరిశ్రమలు, రైతు ఆధారిత ఉత్పత్తులు బలపడతాయి.

- సి. హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## అన్ని రాష్ట్రాలకు మిజోరం ఆదర్శం

మిజోరం రాష్ట్రంలో ఉన్న భిక్షాటకులను పూర్తిగా ఆ పని నుండినిరోధించి వారికిప్రత్యేకంగా పునరావాసం కలిగిస్తూ ఏర్పాట్లు చేస్తూ కొత్త చట్టం చేశారు. ఇది మంచిదే. చట్టం వల్ల, దాని అమలు,పునరావాసం బట్టి మార్పులు వస్తాయి. ఏ ఆధారం లేని వ్యక్తులు అలా మారుతున్నారు. అది వారికీ, సమాజానికి చిన్నతనమే. కావున తగిన పునరావాస ఏర్పాట్లుఉంటే, కచ్చితంగా ఈ ఆలోచన గొప్పదే.

- బొల్లోజు మేఘనాధం, విశాఖపట్నం

## డీఎస్సీ ఎంపిక జాబితా విడుదల చేయాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం డీఎస్సీ 2025 సెలెక్షన్‌కు సంబంధించి ఎంపికయిన అభ్యర్థులకు వ్యక్తిగతంగా ఆన్లైన్లో కాల్ లెటర్లు డౌన్లోడ్ చేసుకునేలా చేసారు. అందరికీ ఒకేసారి అందరికీ కాల్ లెటర్స్ డౌన్లోడ్ చేసుకునే ఏర్పాటు జరగలేదు. కొందరు మెరిట్ మార్క్స్ వచ్చినప్పటికీ కాల్ లెటర్స్ రాక ఆందోళన చెందారు. అభ్యర్థులను గందరగోళ పరిస్థితుల్లోకి నెట్టారు. అధికారులు సరైన విధానంలో స్పందించడం లేదు. కనీసం వెరిఫికేషన్ జాబితాలు కూడా అందరికీ అందుబాటులోకి ఉంచకపోవడంతో డిఎస్సీ అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారు. డిఎస్సీ నియామకాలకు సంబంధించి ఎంపిక జాబితా ప్రకటించి ఉంటే ఈ పరిస్థితులు ఎదురయ్యేవి కావు. గతంలో డిఎస్సీ ఎంపిక జాబితా ముందుగా విడుదల చేసి తర్వాత సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ జరిగేది. కానీ నియామకాలకు సంబంధించి గతంలో లాగా ఎంపిక జాబితా విడుదల చేయలేదు.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

## సరదా వెనుక దాగిన సవాళ్లు

ఆధునిక డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ గేమ్స్ అనేవి కోట్లాది యువతను ఆకర్షిస్తున్న వినోద వేదికలుగా మారాయి. పబ్జ్, ఫైర్,మిన్ క్రాఫ్ట్, వంటి గేమ్స్ కేవలం ఆటలు మాత్రమే కాదు, అంతర్జాతీయ స్థాయిలో మల్టీబిలియన్ డాలర్ల పరిశ్రమగా ఎదిగాయి. ఆధునిక గ్రాఫిక్స్, శబ్ద ప్రభావాలు, రివార్డ్స్, లీడర్ బోర్డ్స్ వంటిఅంశాలు యువతను మరింతగా ఆకట్టుకుంటున్నాయి. కానీవినోదం వెనుకదాగిఉన్న మానసిక,శారీరక, సామాజిక ప్రమాదాలను సమాజం సీరియస్‌గా పరిగణించాల్సిన అవసరం ఉంది. ఆన్‌లైన్ గేమ్స్ ప్రారంభంలో వినోదం కోసం ఆడినా, తరువాత అవి వ్యసనంగా మారుతున్నాయి.

- వెంకటరమణ, గిలకత్తుల

## హామీలు పత్రికల ప్రకటనల వరకేనా?

పశ్చిమగోదావరి జిల్లాఅత్తిలి మండల పరిధిలోని 'ఊరదాళ్ళ పాలెం' గ్రామ ప్రధాన రహదారి మీదుగా రహదారుల మరమ్మతులికి రూ.3.50 కోట్లు మంజూరైనట్లు, టెండర్లు పిలిచి రోడ్లు మరమ్మతులు చేపడతామని జిల్లా కలెక్టర్ జూలై 17న పత్రికల ముఖంగా తెలిపారు. కలెక్టర్ హామీ ఇచ్చి నెల పైనే గడిచినా హామీలు పత్రికా ప్రకటనల వరకే గానీ ఆచరణకు నోచుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో గోతుల్లో పడి ప్రమాదాలు జరుగుతున్నాయి.

-దాసం వెంకటరెడ్డి, పశ్చిమ గోదావరి జిల్లా

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# గ్రామీణ వ్యవస్థకు ఆధునిక టెక్నాలజీ వరమే

***కాలంతో పాటు వస్తున్న మార్పులతో ఆధునిక టెక్నాలజీ గ్రామీణ జీవన విధానాలపై వ్యవసాయ రంగంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నప్పటికీ, సాంకేతిక పరిజ్ఞానం, యంత్రాల పరికరాల కొనుగోలు, విని యోగం గ్రామీణులకు, గ్రామీణప్రాంత చిన్నకారు సన్నకారు రైతులకు ఆర్థిక భారం కలగకుండా టెక్నాలజీ మరింత సుల భతరంగా అందుబాటులోకి వచ్చేవిధంగా ఉండాలని కోరు కునే రైతాంగం లేకపోలేదు. ఏది ఏమైనా గ్రామీణ ప్రాంతాల్లో ఆధునిక టెక్నాలజీ ప్రభావం గ్రామీణ జీవన ఆర్థిక సామాజిక అంశాలపై ప్రభావితం చూపెడుతున్నప్పటికీ, గ్రామీణ ప్రజల్లో ఆర్థికంగా నిలదొక్కుకొని ఉన్న రైతాంగం మాత్రం ఆధునిక యంత్ర పరికరాలపై ప్రత్యేక దృష్టి సారి స్తున్నప్పటికీ పేద మధ్యతరగతి గ్రామీణ రైతాంగం కూడా ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.***

దాడిశెట్టి శ్యామ్ కుమార్

ప్రపంచీకరణ నేపథ్యం జీవన విధానాల్లో వస్తున్న మార్పులు, ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం నేరుగా గ్రామీణ వ్యవస్థపై ప్రభావితం చూపిస్తున్నాయి. గ్రామీణ జానపద, సంస్కృతి సంప్రదాయాలపై ఆధునిక టెక్నాలజీ తీరు తెన్నెలు క్రమక్రమంగా పెరుగుతూ, గతంతో పోలిస్తే ప్రస్తుతం టెక్నాలజీపై ఆసక్తి చూపుతున్న గ్రామీణ జీవన విధానంలో పెనుమార్పులు కనిపిస్తున్నాయి. సాంకేతికత పరిజ్ఞానం, మానవుని అవసరాలకు కావలసిన పనులను సరళీకృతం చేయడానికి అవసరమైనప్పటికీ, ప్రత్యక్ష భౌతిక మానవ సంబంధాల మధ్య తీవ్ర అగాదాన్ని పెంచుతుందని అనిపిస్తుంది. మితిమీరిన సాంకేతికత తరచుగా మానవ జీవన విధానాలపై ప్రభావితం చూపిస్తుంది అనే వాదనలు బలంగా వినిపిస్తున్నప్పటికీ రాను రాను మానవుడు ప్రతి చిన్న విషయానికి సాంకేతికత మీదనే ఆధారపడే పరిస్థితులు వస్తుండటం, సహజ సిద్ధమైన మానవమేధస్సు స్వయంగా ఆలోచించే ధోరణి కుదించకపోయేపరిస్థితి వచ్చినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదనే భిన్న వాదనలు సమాజంలో తెరపైకి వస్తున్నాయి. కంప్యూటర్లు సెల్‌ఫోన్లు నూతన సాఫ్ట్‌వేర్‌లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లాంటి టెక్నాలజీ ఆధునిక మానవుని అవసరాలకు ఉపయుక్తంగాఉన్నప్పటికీ, భవిష్యత్ తరాల్లో వాటి ఆధిపత్యమే మానవ జీవన విధానాలపై ఒత్తిడి పెంచేవిధంగా ఉంటుందేమో అనే సంశయం అన్నిరంగాల్లో విస్తరించిన టెక్నాలజీ వినియోగం తీరు పరిశీలిస్తే అవగతం కాకమానదు. ప్రస్తుత ఆధునిక సాంకేతిక యుగంలో మారుమూల గ్రామాలకు సైతం సమాచార వ్యవస్థ దూసుకుపోతుంది. వివిధ మాధ్యమాలు సాంకేతిక పరికరాలు నేటి గ్రామీణ జీవనశైలిని ఎంతగానో ప్రభావితం చేస్తున్నాయి. ఈ క్రమంలో గ్రామీణ జీవన విధానాల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో రచ్చబండల దగ్గర సమావేశాలు, ఆత్మీయ పలకరింపులు కలుపుగోలుతనం లాంటి మానవ సంబంధాలు చాలావరకు క్రమక్రమంగా తొలగిపోతున్నాయా అనే సంశయం నేటి గ్రామీణ జీవన విధానాల్లో గోచరిస్తుంటుంది. దీనికి కారణం ప్రధానంగా విరివిగా ఆధునిక టెక్నాలజీ వినియోగాన్ని గ్రామీణులు అన్నిరంగాల్లో ఉపయోగించుకోవడం వలన గ్రామీణ వ్యవస్థలో మానవ సంబంధాల మధ్య దూరం పెరుగుతుందా అనే సంశయం కలగకమానదు. గ్రామీణ ప్రాంతాల్లోని గ్రామీణులు ఎక్కువగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే కంప్యూటర్లు సెల్‌ఫోన్లు ఇంటర్నెట్ లాంటి సాంకేతికతను వినియోగిస్తుండడంతో ఎవరికి వారే యమునా తీరే అనే విధంగా అధిక సమయాల్లో వివిధ ఆధునిక సాంకేతిక మధ్యమాలతో అనుబంధాన్ని పెంచుకుంటున్న గ్రామీణులు ఎక్కువగా సెల్ఫోన్ టెక్నాలజీతో దృశ్య శ్రవణ ఆధారిత సంభాషణలకే పరిమితం అవుతున్నారేమో అనిపిస్తుంది. ప్రత్యక్ష మానవ అవసరాల్లో టెక్నాలజీ ఎంతగానో సహకరిస్తున్నప్పటికీ,సహజ సిద్ధమైన మానవ జీవనశైలితో టెక్నాలజీ విడదీయరాని బంధంతో మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోకి వేగంగా పురోగమిస్తుండడం విశేషం.



తరచుగా యంత్ర పరికరాలతో వస్తువులు తయారు కావడం,రెడీమేడ్ వస్తువులు ఆన్‌లైన్ అమ్మకాలు, గ్రామాల్లోకి చొచ్చుకు రావడంతో కులవృత్తుల ఆర్థిక స్థితిగతులు క్రమంగా తగ్గిపోవడం లాంటి పరిస్థితుల్లో దారిద్ర రేఖకు దిగువన ఉన్నటువంటి గ్రామీణ కులవృత్తుల వారు ఎక్కువగా బ్రతుకుతెరువు కొరకు పనులు వెతుక్కుంటూ వేరే ప్రాంతాలకు వలసలుగా బయలుదేరుతున్నారు. వ్యవసాయ రంగంలో ఆధునిక టెక్నాలజీ ప్రభావం కూడా ప్రసరిస్తూనేఉంది. వ్యవసాయదారులు చాలావరకు ఆధునిక పోకడలతో యంత్రాలు, సాంకేతికతను ఉపయోగించుకొని పాత పద్ధతులకు భిన్నంగా వ్యవసాయం చేస్తూ ఉండడం గ్రామీణ వ్యవస్థలో సాధారణంగా మారిపోయింది. గ్రామీణ ప్రాంతాల్లోని ఎక్కువగా సంపన్నులైన వారే అధికంగా యంత్ర పరికరాలను టెక్నాలజీని వ్యవసాయ రంగంలో ఉపయోగిస్తుండడంతో ప్రత్యామ్నాయంగా వ్యవసాయంలో కూలీలు అవసరం తక్కువైపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీ పనులు తగ్గిపోతున్నాయి. తద్వారా గ్రామాల్లోని ఆర్థికపరిస్థితులు సరిగాలేని జనాలు కావాల్సినంత పని దొరకకపోవడంతో వ్యవసాయేతర పనులు వెతుక్కుంటూ పట్టణాలకు వలసలు వెళ్తున్నారు. వ్యవసాయ రంగంలో డ్రోన్లు, కాటన్ పిక్కింగ్, రోబో సిస్టం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లాంటి అనేక సాంకేతిక ఆధునిక యంత్ర పరికరాలు వచ్చిన తర్వాత వ్యవసాయ రంగంలో రైతులకు అధికంగా మేలు జరుగుతుండటం ఒక ఎత్తుఅయితే, దైనందిన గ్రామీణ జీవన విధానంలో టెక్నాలజీ ఆధారిత వ్యవసాయ సాగు జరుగుతున్నప్పటికీ పూర్తిస్థాయిలో ఆధునిక యంత్రాల వినియోగంపై రైతులకు నిర్దిష్టమైన శిక్షణను అవగాహన కల్పించవలసిన ఆవశ్యకత గోచరిస్తుంది. పరిశ్రమలు ఆధునీకరించబడి వస్తుఉత్పత్తి అధికం కావడంతో నేటి గ్రామీణ వ్యవస్థలోకి విరివిగా కంపెనీ వస్తువులు, రెడీమేడ్ వస్తువులు రావడం స్థానిక గ్రామీణ వనరులను తగ్గిం చిందని చెప్పవచ్చు. గ్రామీణులు ఇలాంటి వస్తువులపై ఆకర్షితులవుతున్నారు క్రమంగా కులవృత్తుల వారికి పనులు తక్కువైపోయి చేసిన పనికి గిట్టుబాటు ధర లేకపోవడం ఆధునికరించబడిన పరిశ్రమలలో పనుల కొరకు గ్రామీణులు పట్టణాలకు వలస వెళ్తున్న దృశ్యాలు గ్రామీణ ప్రాంతాల్లో సర్వసాధారణమైపోతున్నాయి. కాలంతో పాటు వస్తున్న మార్పులతో ఆధునిక టెక్నాలజీ గ్రామీణ జీవన విధానాలపై వ్యవసాయ రంగంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నప్పటికీ, సాంకేతిక పరిజ్ఞానం, యంత్రాల పరికరాల కొనుగోలు, వినియోగం గ్రామీణులకు, గ్రామీణప్రాంత చిన్నకారు సన్నకారు రైతులకు ఆర్థిక భారం కలగకుండా టెక్నాలజీ మరింత సులభతరంగా అందుబాటులోకి వచ్చేవిధంగా ఉండాలని కోరుకునే రైతాంగం లేకపోలేదు. ఏది ఏమైనా గ్రామీణ ప్రాంతాల్లో ఆధునిక టెక్నాలజీ ప్రభావం గ్రామీణ జీవన ఆర్థిక సామాజిక అంశాలపై ప్రభావితం చూపెడుతున్నప్పటికీ, గ్రామీణ ప్రజల్లో ఆర్థికంగా నిలదొక్కుకొని ఉన్న రైతాంగం మాత్రం ఆధునిక యంత్ర పరికరాలపై ప్రత్యేక దృష్టి సారి స్తున్నప్పటికీ పేద మధ్యతరగతి గ్రామీణ రైతాంగం కూడా ఆధునిక టెక్నాలజీని అంది పుచ్చుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ●

# ర్యాగింగ్ 'భూతా'నికి వైద్యం చేయలేమా?

జి. అజయ్ కుమార్

తెలుగు రాష్ట్రాల్లో విద్యా ప్రాంగణాల్లో మళ్లీ ర్యాగింగ్ భూతం చాప కింద నీరులా విస్తరిస్తుంది. ఇటీవల నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో, పల్నాడు జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చోటుచేసుకున్న సంఘటనలు సీనియర్స్ జూనియర్స్‌పై వ్యవహరించిన తీరు తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నాయి. విద్యాలయం అనగానేస్నేహం, విజ్ఞానం, నమ్మకం, ఆత్మవిశ్వాసం, జ్ఞాపకాలు గుర్తొచ్చేలా ఉండాలి. కానీ భయం, అవమానం, ఆత్మనూన్యత భావం, కన్నీళ్లు కాదు. అది విద్యాసంస్కృతికి మచ్చలా మారుతుంది. విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తుంది. కొంత మంది సీనియర్లు ర్యాగింగ్‌ను ఇప్పటికీ సరదాగా తీసుకుంటున్నారు. ఇంటరాక్షన్ పేరుతో జూనియర్లతో శాడిస్ట్ లాగా జుగుప్సాకరంగా ప్రవర్తిస్తున్నారు. కానీ వాస్తవానికి అది మానసిక హింస, శారీరక దాడి, సామాజిక అవమానం, చాలా పెద్ద నేరంగా పరిగణించబడుతుంది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (గణాంకాల ప్రకారం ప్రతి సంవత్సరం దేశంలో వందల కొద్దీ ర్యాగింగ్ కేసులు నమోదవుతున్నాయి. చాలా కేసులు పోలీస్ స్టేషన్లలోకి రాకుండానే ఆగిపోతున్నాయి. గత పది సంవత్సరాల కాలంలో దేశవ్యాప్తంగా సుమారు 200 మంది విద్యార్థులు ర్యాగింగ్ కారణంగా ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అదే సమయంలో వేలాది మంది విద్యార్థులు మానసిక ఒత్తిడితో చదువును మధ్యలోనే మానేయాల్సి వచ్చింది. ఇంత పెద్ద నేరాన్ని సరదాగా తీసుకోవడం సమాజానికి అస్సలు మంచిదికాదు. ఇది జూనియర్స్‌తో పాటు సీనియర్స్ భవిష్యత్తును కూడా ప్రశ్నార్థకంగా మారుస్తున్నది. పాఠశాలల నుండి విలువలతో కూడిన విద్య అందకపోవడం, తల్లిదండ్రులు పిల్లలకు సామాజిక విలువలు నేర్పకపోవడం, పక్కవాళ్లతో ఎలా మెలగాలో చెప్పకపోవడం, మితిమీరిన స్వేచ్ఛ ఇవ్వడం వంటివి వారి వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేస్తాయి. కళాశాలలలో యాంటీ ర్యాగింగ్ కమిటీలున్నా వాటి అమలు సరిగా లేకపోవడం కళాశాల యాజమాన్యాలు చూసి చూడనట్టు వదిలివేయడం, నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం వంటివి చట్ట అమలు బలహీనత వుండడం, ర్యాగింగ్‌కు పాల్పడిన వారికి కఠిన శిక్షలు విధించకపోవడం వంటివి. ఇంకా ర్యాగింగ్ సాధారణమైన విషయంగా నేటి సమాజం తల్లిదండ్రుల,ఉపాధ్యాయుల భావించడం వంటివి కూడా దీనికి కారణంగా ఉన్నాయి. ఇలా అన్ని వర్గాలు మౌనంగా ఉండటంతో ర్యాగింగ్ అనే రాక్షసం మళ్లీ మళ్లీ తలెత్తుతోంది. సీనియర్లు అంటే జూనియర్లకు దారి చూపే మార్గదర్శకులు. ప్రోత్సహించే వారు, స్నేహ హస్తం అందించేవారు, భరోసా కల్పించేవారు,కానీ నేటి పరిస్థితుల్లో కొందరు సీనియర్లు జూనియర్లను భయపెట్టడమే తమ గౌరవంగా భావిస్తున్నారు. అది సీనియారిటీ కాదు వారి దురహంకారం. జూనియర్ల భవిష్యత్తు సీనియర్ల చేతుల్లో ఉంటుంది వారు మార్గదర్శకులుగా ఉండాలి. అందుకే సీనియర్ విద్యార్థులు తమ బాధ్యతను మరచిపోకూడదు. సుప్రీంకోర్టు ఇప్పటికే ర్యాగింగ్‌ను నేరంగా ప్రకటించింది. యూజీసీ 2009 ఆంటీ ర్యాగింగ్ రెగ్యులేషన్ల ప్రకారం ర్యాగింగ్ చేసినా, ప్రోత్సహించినా క్రిమినల్ కేసు తప్పదు. కళాశాల నుంచి బహిష్కరణ తప్పదు, స్కాలర్‌షిప్ రద్దు చేయబడుతుంది. ప్రతి కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీలు, హెల్ప్‌లైన్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. కానీ అసలు సమస్య అమలులోనే ఉంది. కొన్ని కళాశాలలు కమిటీలు పేరుకే ఉంటాయి. కానీ అవి పనిచేయవు. ర్యాగింగ్ ఫిర్యాదులు బయటపడితే కళాశాల పేరు చెడిపోతుందనే భయంతో వాటిని దాచేస్తారు. ఇదే ఇంకా ర్యాగింగ్ పెరగడానికి కారణం అవుతుంది. కళాశాలల్లో జీరో టాలరెన్స్ పాలసీని కఠినంగా అమలు చేయాలి. సి సి టీవీ పర్యవేక్షణ తప్పనిసరి. సీనియర్లు భయాన్ని కలిగించడం కాదు భరోసా ఇవ్వండి. సీనియారిటీ మార్గదర్శకత్వంలో, భరోసాని కల్పించడంలో ఉంటుందనే విషయం గుర్తుంచుకోవాలి. జూనియర్లు ర్యాగింగ్ ఎదురైతే మౌనంగా ఉండకుండావెంటనే సంబంధిత అధికారులకు,తల్లిదండ్రులకు తెలియచేయడం, హెల్ప్‌లైన్‌కి ఫిర్యాదు చేయడం చేయాలి. తల్లిదండ్రులు, సమాజం పిల్లల్లో ధైర్యం నింపాలి. ర్యాగింగ్‌ను సహించరాదని స్పష్టంగా నేర్పాలి. ప్రభుత్వం చట్టాలను కఠినంగా అమలు చేయాలి. ●

# అంగడి సరుకుగా మారుతున్న అమ్మతనం



మేకిరి దామోదర్

ఆధునిక సమాజం వ్యక్తిగత స్వేచ్ఛ, సామాజిక బాధ్యతల మధ్య ఎంతగానో నలిగిపోతుంది. నిజమైన స్వేచ్ఛకి పరిమితులుంటాయి. అవి లేని దాన్ని విశృంఖలత్వం అంటారు. ఆధునిక టెక్నాలజీ రెండు వైపులా పదునున్న కత్తి లాంటిది. దానితో ప్రాణం తీయవచ్చు. శస్త్రచికిత్స చేసి ప్రాణం కాపాడవచ్చు. సామాజిక బాధ్యతలు గల పాలకులు,డాక్టర్లు ఆధునిక సాంకేతిక ఫలాలు సామాన్యుడి వికాసానికి, సామాజిక విలువలు పెంచినప్పుడే దానికి సార్ధకత. దేశవ్యాప్తంగా, అలాగే రాష్ట్రంలో అబార్షన్ల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. సృష్టికి ప్రతి సృష్టి చేసే అమ్మతనం పేగు బంధాన్ని తెంచేసుకుంటోంది!. మారుతున్న సామాజిక పోకడలు పాశ్చాత్య సంస్కృతి, భయమో, భారమో, బాధ్యతారాహిత్యమో గర్భస్థ శిశువుల్ని తల్లులు కడుపులోనే చిదిమేస్తున్నారు. ఆధునిక ఆహారపు అలవాట్లు, ఉరుకు పరుగుల ఒత్తిడిలో,ఆధునిక సామాజిక పోకడలతో ఓవైపు మహిళల్లో పునరుత్పత్తి శక్తి సన్నగిల్లుతోందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఆధునిక టెక్నాలజీతోమారుతున్న ఆలోచనలతో గర్భిణులు బిడ్డల్ని వద్దనుకునే కారణాలు అనేకం!. ఈ తరహా పెడధోరణులు సమాజంలో ఆందోళన కలిగిస్తున్నాయి. ఓవైపు భారతదేశంలో ఉత్తరాది, దక్షిణాది ఆధిపత్య రాజకీయాల్లో ఉత్తరాది పెత్తనం పెరిగిపోతుందని, దక్షిణాది రాష్ట్రాల్లో జనాభాను పెంచాలని ఆయా ప్రభుత్వాలు ప్రజల్ని కోరుతున్నాయి. గతంలో కుటుంబ నియంత్రణ పాటిస్తే ఇచ్చిన ప్రయోజనాల కంటే ఎక్కువమంది పిల్లల్ని కంటే ఇంకా ఎక్కువ ప్రయోజనాలు కల్పిస్తామని హామీలు ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో దేశంలో పెరుగుతున్న అబార్షన్లు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా 2020–21లో తెలంగాణలో 2,282 అబార్షన్లు నమోదయ్యాయి. 2024–25 నాటికి ఈ సంఖ్య పదిరెట్లు పెరిగి 16,059 అబార్షన్లు జరిగినట్లు గణాంకాలు చెప్తున్నాయి. ఈ లెక్కలన్నీ పార్లమెంటులో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోనే హెల్త్ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం(హెచ్ఎంఐఎస్) వెల్లడించింది. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో గడిచిన ఐదేళ్లలో అబార్షన్లు నాలుగు రెట్లు పెరిగాయి. ఈ రాష్ట్రంలో 2020–21 ఆర్థికసంవత్సరంలో 2,282అబార్షన్లు జరగగా 2024–25 నాటికి ఈ సంఖ్య10,676కు పెరిగింది. దేశవ్యాప్తంగా అబార్షన్లు అధికంగా జరిగిన టాప్5 రాష్ట్రాల వివరాలను హెచ్ఎంఐఎస్ ప్రకటించింది. అబార్షన్లలో మహారాష్ట్ర మొదటి స్థానంలోఉంది. ఈ రాష్ట్రంలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో 2,07,019 అబార్షన్‌లు జరిగాయి. ఆ తర్వాత స్థానాల్లో తమిళనాడు 1,01,414, అస్సాం 76,642, కర్ణాటక70,241, రాజస్థాన్ 53,714 ఉన్నాయి. అయితే ఈ అబార్షన్ల వెనక అనేక విషాద ఘటనలు ఉన్నాయి. మెడికల్ అన్‌ఫిట్‌తో అబార్షన్లు కావడం వేరు, ఉద్దేశ్యపూర్వకంగా గర్భవిచ్ఛిత్తి చేయించుకోవడంవేరు. సమాజంపై ముఖ్యంగా మహిళల మానసిక,శారీరక ఆరోగ్య పరిస్థితులపై అబార్షన్లు తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి.



అబార్షన్లకు కారణాలు పరిశీలిస్తే, యువతలో మారుతున్న ఆలోచనా ధోరణి, ఆర్థిక స్వేచ్ఛ, కోలివింగ్ లాంటి పాశ్చాత్య సంస్కృతి ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. అదే సమయంలో తెలిసి తెలియని వయసులో మైనర్ బాలికలు గర్భం దాల్చడం, పరువుపోతుందనే భయంతో తల్లిదండ్రులు కులపంచాయతీలు పెట్టి గుట్టుచప్పుడు కాకుండా అబార్షన్లు చేయించడం ఇంకా కొనసాగుతోంది. మరోవైపు ఆదివాసీ గిరిజన ప్రాంతాల మహిళలకు సరైన వైద్యసౌకర్యాలు లేకపోవడం, పౌష్టికాహారం అందకపోవడం వంటివి కూడా అబార్షన్ల పెరుగుదలకు కారణమవుతున్నాయి. మరోవైపు ఆర్థిక భద్రత ఉన్నవారు, ఇప్పట్లో సంతానం వద్దనుకునే దంపతుల సంఖ్య పెరిగిపోతుంది. ఉన్నంతకాలం ఎంజాయ్ చేద్దాం అనే ధోరణి ప్రబలుతోంది. గర్భం దాల్చినట్టు తెలియగానే అబార్షన్ చేయించుకుంటున్నారు. ఈ తరహా ధోరణులు సమాజంలో ఆందోళన కలిగించే అంశాలుగా మారుతోంది. ఈమధ్య మన రాష్ట్రంలో బయటపడ్డ అటు సరోగసీ ఇటు స్పెర్మ్ కలెక్షన్ యువతే లక్ష్యంగా వీర్యకణాల దందా స్పెర్మ్ ఇస్తూ డబ్బులు ఇవ్వ (తీసుకో)వడం పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఐవీఎఫ్ సెంటర్లు తిలాపాపం తలా పిడికెడు అన్నట్లుగా ఉంది. ఇలా ఫెర్టిలిటీ సెంటర్లు పెట్టి స్పెర్మ్ కలెక్షన్ బ్యాంకులలో అమ్మతనాన్ని అంగడి సరుకుగా మార్చేస్తున్నాయి. ఇక్కడ నోరూల్స్,నో హ్యూమానిటీ అంతా (ఓన్లీ)మనీ అన్నట్టుగా వసూళ్ల దందా కొనసాగుతోంది. పెరుగుతోన్న సంతానలేమి సమస్యతో ఐవీఎఫ్ సెంటర్లు పుట్టుకొస్తున్నాయి. ధనార్జనే ధ్యేయంగా పిల్లలు లేని దంపతుల తాపత్రయాన్ని ఆసరా చేసుకుని మోసాలు చేస్తున్నాయి. రాష్ట్రంలో ఐయూఎఫ్, ఐవిఎఫ్ చికిత్సల పేరుతో లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నాయి. కాస్త పేరు గాంచిన సెంటర్లు రెట్టింపుగా వసూలు చేస్తున్నాయి. సంతానలేమి దంపతులు చికిత్సలు,మందులు వాడినా ఫలితం లేకపోవడంతో చివరకు ఈ సెంటర్లు అడ్డదారులు తొక్కుతున్నాయి. ఫెర్టిలిటీ సెంటర్లలో వీర్యకణాల బ్యాంకులను ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఇక్కడ సరిపోగా మిగిలిన వీర్యకణాలను ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దాంతో ఐవిఎఫ్ ట్రీట్మెంట్స్ తీసుకునేవారికే ఇప్పుడు అనుమానాలు వ్యక్తమయ్యేపరిస్థితులు వస్తున్నాయి. వారికి పుట్టిన బిడ్డలు నిజంగా వారికి పుట్టిన వారేనా! లేక వేరే డిఎన్ఏ ఉందా అని సందేహాలు వెంటాడుతున్నాయి. ఇలా ఒక సంస్థ చేసే తప్పుడు పనులతో చాలామంది తల్లిదండ్రుల్లో అనుమానాలు రేకెత్తిస్తోంది. పేద మహిళలను లక్ష్యంగా చేసుకొని సరోగసీ కోసం ఒప్పందాలు చేసినట్టు అప్పటి ఆరోపణలే, ఈమధ్య బయటపడిన సంఘటనలతో నిర్ధారించబడ్డాయి. మనదేశంలో సరోగసీ, స్పెర్మ్ సేకరణలకు నిర్దిష్టమైన చట్టాలు ఉన్నాయి. కమర్షియల్ సరోగసీ మన దేశంలో పూర్తిగా నిషేధం. కేవలం ఆల్ట్రా యిస్టిక్ సరోగసీ అంటే మెడికల్ ఖర్చులు, ఇన్సూరెన్స్ మినహా ఆర్థిక ప్రతిఫలం లేని సరోగసీ అనుమతి ఉంటుంది. అలాగే సరోగసీ మదర్ భారత్ పౌరులై ఉండాలి. 25నుంచి 35ఏళ్ల వయసు కలిగి ఉండాలి. ఇది ఒక్కసారి మాత్రమే సరోగెట్‌గా ఉండగలదు. విదేశీ జంటలకు మన దగ్గర అనుమతి లేదు. 30 ఏళ్లలోపు యువతీ యువకుల నుంచి సేకరించినఅండాలను, శుక్రకణాలను పిల్లల కోసం పరితపించే దంపతులకు అంటగడుతూ డబ్బులు సొమ్ము చేసు కుంటున్నారు. ఏఆర్‌టి చట్టం ప్రకారం,స్పెర్మ్ సేకరణ కోసం ఏ ఆర్‌టీ బ్యాంకులు నేషనల్ రిజిస్ట్రీఆఫ్ బ్యాంక్స్ అండ్ క్లినిక్స్ లో రిజిస్టర్ అయి ఉండాలి. స్పెర్మ్‌డోనర్లు 21–55ఏళ్ల వయసు కలిగిఉండాలి. స్పెర్మ్‌నిల్వల కోసం క్రయోట్యాంకులు 196సీ వద్ద నిర్వహించబడాలి. ఒకవేళ ఈనిబంధనలను ఉల్లంఘిస్తే కనీసం10ఏళ్ల జైలు శిక్ష,రూ.10 లక్షలజరిమానా విధించవచ్చు. అయితే ఈ చట్టాలు కఠినంగా ఉన్నా సరైనపర్యవేక్షణ లేకపోవడంతో సరోగసీ సెంటర్లు రెచ్చిపోతున్నాయి. ఈ సామాజిక రుగ్మతను నిర్మూలించుటకు ప్రజల్లో విస్తృత అవగాహన, చైతన్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. ●

# తస్మాత్ జాగ్రత్త..!

## - ఏసీబి వైపు... ప్రజల చూపు మండలంపై ఏసీబి డేగ కన్ను ?

**పొన్నలూరు, ఆగస్టు 31,ప్రభాతవార్త**

మండలంలోని కొందరు అవినీతి అధికారులు, సిబ్బంది పని తీరుపై విసుగు చెందిన కొందరు ఏసీబీ అధికారులకు సమాచారం అందించినట్లు మండలంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. రెండు, మూడు ప్రధాన శాఖలలోని కొందరు సిబ్బంది బాహాటంగానే వేలకు వేలు లంచాలు అడుగుతున్నారని, సంవత్సరాల తరబడి తిప్పుకుంటూ ఉండటంతో విసుగు చెందిన కొందరు నేరుగా ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారని అనుకుంటున్నారు. వారు చేయాల్సి న చిన్న పనిని కూడా భూతద్దంలో చూపెట్టి అది కుదరదు, ఇది కుదరదు అని తిప్పుకొని కొన్ని రోజుల తర్వాత చిన్నగా బేరం మాట్లాడటం మొదలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఒక గ్రామానికి చెందిన వ్యక్తులు కొందరు ఏసీబి అధికారుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లామనే వార్త కొద్దిరోజుల క్రితం మండలంలో చక్కర్లు కొట్టింది. ఆ ప్రచారంతో అయినా సిబ్బందిలో మార్పు వస్తుందేమో అని ఎదురు చూసిన వారికి నిరాశే ఎదురైనట్లుంది మరలా ఏసీబి,ఏసీబి అనే పేరు జోరుగా వినిపిస్తుంది.ముఖ్యంగా రెండు, మూడు ముఖ్య శాఖలలోని ఇద్దరు,ముగ్గురు సిబ్బందిపై కొందరు తీవ్ర ఆరోపణలు, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు ప్రభుత్వోద్యోగులు కొన్ని పనులకు కావాలని కోర్రిలు వేస్తూ వచ్చి, ఎంతో కొంత సొమ్ము ముట్టడమో, అత్యున్నత స్థాయి ప్రజా ప్రతినిధుల చేత సిఫారసు చేయిస్తే తప్ప పనులు చేయడం లేదని ఆరోపిస్తున్నారు. విసుగు చెందిన కొందరు ఆవేశంతో ఏసీబి అధికారులను ఆశ్రయించి తమ గోడు వెళ్ళబోసుకున్నప్పటికి తరువాత మానవత్వంతో ఆలోచించి ఏసీబి వారికి సహకరించడానికి వెనుకడుగు వేస్తున్నారని చర్చించుకుంటున్నారు.తమకు తాముగా అవినీతి అధికారులను పట్టిస్తే సమాజంలో గుర్తింపు కోల్పొతామని ఆవేదన వ్యక్తం చేస్తూ సంబంధిత అధికారులే తగిన చర్యలు తీసుకుంటే మండలం బాగుపడుతుందని బహిరంగంగా తమ ఆక్రోశాన్ని వెళ్ళగక్కుతున్నారు.ఈ ప్రచారం నేపథ్యంలో అయినా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులలో మార్పు వస్తుందో,లేక ఏసీబి అధికారుల రంగ ప్రవేశంతో ఉద్యోగం పోగొట్టుకొనే స్థితికి వస్తారో వేచి చూడాలి.పరిస్థితి ఇలాగే కొనసాగితే ఏసీబీకి మరో అవినీతి చేప దొరకడం ఖాయం.

# జగన్ నిశ్శబ్దం వ్యూహమా..? బలహీనత..?

**ఒంగోలు, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో మాజీ ముఖ్యమంత్రి వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శైలి ఎప్పట్నించో భిన్నంగా ఉంటుంది. ఎన్ని విమర్శలు ఎదురైనా ఎన్ని ఆరోపణలు వచ్చినా ఆయన సాధారణంగా మౌనమే పాటిస్తారు. ఈ తీరుపై ఇటీవల పార్టీ సీనియర్ నాయకుడు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. మా నాయకుడు అంతే అని ఆయన సరదాగా చెప్పిన వ్యాఖ్య వాస్తవానికి పార్టీ లోపల అసంతృప్తిని బయటపెడుతుందని అనుకోవచ్చు. రాజకీయాల్లో అబద్ధం వేగంగా వ్యాపిస్తుందనే విషయం తెలిసిందే. అలాంటప్పుడు సమయానుసారం స్పందించడం నిజాన్ని ప్రజల ముందు ఉంచడం, నాయకుని బాధ్యత. కానీ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం నిరీక్షణకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆయన ప్రతి స్పందనలో జాప్యం వల్ల ప్రత్యర్థులు ఆరోపణలు మరింత బలంగా వినిపిస్తున్నాయన్న అభిప్రాయం వైసీపీ శ్రేణుల్లో పెరుగుతుంది. ఫలితంగా సీనియర్ నేతల్లో అసంతృప్తి చెలరేగుతుంది. కొందరు బహిరంగంగానే విమర్శించగా మరి కొందరు మౌనంగా పార్టీ భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతున్నారు. ఇక కొందరు నేతలు పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని తమకంటూ యూట్యూబ్ ఛానెల్ నిర్వహిస్తూ పార్టీ పక్షాన వాదనలు వినిపిస్తున్నారు. మరికొందరు మనకేమి పని లేదు అన్నట్లుగా నిశ్శబ్దంగా వ్యవహరిస్తున్నా. ఇంకొందరు అయితే ప్రత్యామ్నాయ రాజకీయ అవకాశాలను పరిశీలిస్తున్నారనే వ్యూహగాణాలు వినిపిస్తున్నాయి. ఈ విధమైన భిన్నాభిప్రాయాలు పార్టీ ఏకాగ్రతను దెబ్బతీయవచ్చన్న భయం వైసీపీ వర్గాల్లో కనపడుతుంది. జగన్ నిశ్శబ్దం వెనుక ఉన్న కారణం ఆయన నమ్మకం అని కొందరు విశ్లేషకులు చెప్తున్నారు. ప్రజలు తన పట్ల ఉన్న విశ్వాసం ఆధారంగా ఎటువంటి ప్రత్యామ్నాయం లేదన్న ధీమాతో ఆయన స్పందించకపోవచ్చని అంటున్నారు. కానీ అదే ధోరణి పార్టీకి రాబోవు ఎన్నికల్లో నష్టాన్ని మిగిల్చే ప్రమాదం ఉందని సీనియర్లు హెచ్చరిస్తున్నారు.ఈ పరిణామాల మధ్య బొత్స సత్యనారాయణ రాజకీయ విరమణ ప్రకటించే అవకాశం ఉందని జరుగుతున్న చర్చ వైసీపీ లోపల ఉద్రిక్తతలను మరింతగా స్పష్టతను ఇస్తుంది. అంతిమంగా జగన్ ఈ మౌనధోరణి ఆయనకు రాజకీయంగా రాజకీయ కవచంగా మారుతుందా, లేక పార్టీ లోపల విబేధాలను మరింత ప్రోత్సహిస్తుందా అన్నది వచ్చే ఎన్నికల ఫలితాల ద్వారానే స్పష్టం అవుతుంది.

# శతాబ్ది ఉత్సవాల సంచిక ఆవిష్కరణ

## - పావలా నాటికి ప్రదర్శన - భరతనాట్య ప్రదర్శన చేసిన అమెరికా అమ్మాయి





**వేటపాలెం, ఆగస్టు 31, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన వేటపాలెంలో బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కాలేజీ ఎదురుగా ఉన్న శ్రీ బాల భక్త భజన నాటక సమాజం, విద్యా గణపతి ఆలయం వారు వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభించి 100 సంవత్సరాలు అయినా సందర్భంగా శతాబ్దిఉత్సవాల సంచిక ఆవిష్కరించారు. శనివారం రాత్రి ఈ సంచికను బండ్ల బాపయ్య విద్యాసంస్థల కమిటీ అధ్యక్షులు బండ్ల అంకయ్య, రోటరీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు గొల్లపూడి సీతారాం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 100 ఏండ్ల పాటు ఎంతో మంది మహనీయులు ఉత్సవాలకు చేయూతనిందిస్తూ ముందుకు కొనసాగించారని, వారిలో కి.శే బొడ్డు చెంచెనాథం, సురేంద్రనాదం ముఖ్యులు అని అన్నారు.ఈ సందర్భంగా యుఎస్ఏ విద్యార్థిని పేరిసెట్ల శివాని ప్రదర్శించిన భరతనాట్యం అందర్నీ ఆకట్టుకుంది. డాక్టర్ నరాల శెట్టిరవికుమార్ బ్రహ్మనాయుడు ఏకపాత్రతో అలరించారు. గణేష్ పాత్రో రచించిన పావలా నాటికను జెడ్ వి దర్శకత్వంలో ప్రదర్శించారు. కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు బొడ్డు శివప్రసాద్, కార్యదర్శి బొడ్డువీరమల్లు, సంచిక కన్వీనర్ బట్ట మోహనరావు, శ్రీ విశ్వంభరానందగిరి స్వామి, రిటైర్డ్ ఉపాధ్యాయులు కొసనం నాగమాంబ, గుత్తి విశ్వేశ్వరరావు, శతాబిన ఉత్సవాల కమిటీ కన్వీనర్ బండారు మల్లిఖార్జునరావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సత్రం మల్లేశ్వరరావు, వంక వెంకట సుధాకర్, కోడూరు రామకృష్ణ, అర్చకులు రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం



వార్త



# ఫైల్ కదలాలంటే లంచం ఇవ్వాల్సిందే

- ముందు నీతి వాఖ్యాలు.. లోపల అవినీతి సూత్రాలు
- అవినీతికి చిరునామాగా ఒంగోలు సబ్‌రిజిస్టార్ కార్యాలయాలు
- గోడలకు అలంకారప్రాయంగా ఏసీబీ వాల్‌పోస్టర్లు
- పేద, ధనిక తేడా లేదు - లంచంలో మార్పు లేదు
- ప్రతి పనికి ఒక రేటు - ప్రభుత్వ బోర్డు మాత్రం పెట్టరు
- ఇది ఒంగోలు సబ్ రిజిస్టార్ కార్యాలయం తంతు

**ఒంగోలు, ప్రభాతవార్త**

ప్రభుత్వాలు మారుతూనే ఉంటాయి. పాలకులు మారుతూనే ఉంటారు.అయితేనా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అవినీతి ఏ మాత్రం తగ్గడం లేదు. కార్యాలయం ముందు లంచం అడిగితే ఫిర్యాదు చేయండంటూ అవినీతి నిరోధక శాఖ వాల్ పోస్టర్లు కనిపిస్తాయి. లోపల పైసలివ్వందే ఫైల్ కదలదు. రిజిస్ట్రేషన్ కాదు ఇది ఒంగోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పనితీరు. ప్రతిపనికి ఫిక్స్ అయిన రేటును బట్టి లంచం చెల్లిస్తేనే పనులు అవుతున్నాయని లేనిపక్షంలో కొర్రీలు పెడుతూ రిజిస్ట్రేషన్‌లను వాయిదా వేస్తున్నారని ప్రజల ఆరోపణ. తమది పారదర్శక ప్రభుత్వం అని పాలకులు చెప్తుంటే తాము కూడా అవినీతిలో పారదర్శకంగా ఉంటామని ఈ ఆఫీసుల వారు ఆచరించి మరి చెప్తుండటం విశేషం. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి రహిత సమాజమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తుండగా ఇక్కడ రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖ అధికారులు అవినీతి సమాజమే లక్ష్యంగా పని చేస్తున్నారు.ఒంగోలు పారిశ్రామిక ప్రాంతమైన రియల్‌ఎస్టేట్ రంగం జిల్లా కేంద్రం కాబట్టి ఎప్పుడు రిజిస్ట్రేషన్‌శాఖ రద్దీగా ఉంటుంది. ఆస్తుల అమ్మకాలు, కొనుగోళ్లు ప్రతినిత్యం జరుగుతూనే ఉంటాయి. ఈ ఆస్తులను యజమానులు కష్టపడి సంపాదించుకుని ఉంటారు. కొనుగోలు చేసేవారు కూడా కష్టపడి సంపాదించి కూడబెట్టి కొనుగోలు చేస్తుంటారు. రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే కార్యాలయంలో చేతిలో నోటు పెట్టనిదే ఫైల్‌మీద పెన్ను పెట్టరు.ఇది నగ్నసత్యం. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి అక్రమాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో అవినీతి నిరోధక శాఖ ఉంది. ఆశాఖ అధికారులు ఒంగోలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలపై అనేక సార్లు దాడులు చేసినా, రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. అవినీతి నిరోధకశాఖ అవినీతి రహిత సమాజమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమంటూ పని చేస్తుంది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆరుబయట గోడలకు ఏసీబీ పోస్టర్లు అతికించి ఉన్నాయి. ఇక్కడికి వచ్చే క్రయవిక్రయ దారులు ఈ పోస్టర్ చూస్తూ చదువుతూ ఉంటారు. ఈ పోస్టర్‌నందు అనేక విషయాలు ఉంటాయి. అవి ఏమిటో తెలుసుకుందాం. ఒక వైపు రాష్ట్ర ప్రభుత్వ రాజముద్ర లోగో, దీనిలో సత్యమే జయతే అని రాసి ఉంటుంది. మూడు సింహాలు ఉంటాయి. మరో వైపు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యాంటికరప్షన్ బ్యూరో అనే పదాలు ఉంటాయి. కింద భాగాన బల్ల, కుర్చీ చిత్రాలతో పాటు ఒక అధికారి కూర్చొని బల్లకింద చెయ్యి పెడుతూ మరో వ్యక్తి నోట్ల కట్టలు చేతికిస్తూ ఉండడం వంటి చిత్రాలుఉంటాయి. ఈ కార్యాలయాల్లో బల్లకింద చేయిపెట్టారు. కార్యాలయానికి సంబంధం లేని ప్రైవేటు ఆఫీసుల్లో లెక్కపెట్టి బల్లపైన పెడితే దళారులు వచ్చి తీసుకెళ్లి సాయంత్రం ఇంటికెళ్లేటప్పుడు అధికారులకు ఇస్తూ ఉంటారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వ ఉద్యోగులు అధికారుల కింద పేర్కొన రీతిలో అవినీతి అక్రమాలు చేయడం గమనించినట్లయితే దయచేసి వెంటనే మాకు తెలియజేయండని కూడా ఉంటుంది. ఫైళ్లు కదలికలకు డిమాండ్ చేయడం, స్వీకరించడం, అధికారికంగా పని చేయడం, లంచం డిమాండ్ చేయడం, స్వీకరించడం, పథకాలు సబ్సిడీ పొందుటకు లంచం డిమాండ్ చేయడం,స్వీకరించడం, ప్రభుత్వ విధులను దుర్వి నియోగం చేయడం,ప్రభుత్వ అధికారులు అక్రమాస్తులు కలిగి ఉండడం అంటూ మీ సమాచారం గోప్యంగా ఉంచబడుతుందని తెలియ పరుస్తూ పెద్దపెద్ద అక్షరాలతో ఉంటాయి. సంప్రదించాల్సి న చిరునామ, అవినీతి నిరోధకశాఖ ప్రకాశంజిల్లా, ఏసీబీ ఉన్నతాధికారుల ఫోన్ నెంబర్లు కూడా ఉంటాయి. కార్యాలయానికి పనులు కోసం వస్తున్న క్రయవిక్రయ దారులు ఏసీబీ పోస్టర్ చూస్తూనే ఉంటారు.సబ్ రిజిస్ట్రర్ కార్యాలయంలో వీళ్లు లంచం ఎందుకు ఇవ్వాలని అడిగితే ఫైల్ పక్కన పెట్టేస్తారు.ఏదొక ఒక వంక చెప్పి రిజిస్ట్రేషన్ జరగదంటూ బయటకు పంపించివేస్తారు.పోస్టర్ చదవకుండా లోపలకు వెళ్లే వారు లంచాలు ఇచ్చి పనులు చేయించు కుంటున్నారు. ప్రతి రోజు కార్యాలయంలో అధికారులకు అక్రమ సంపాదనే ఎక్కువగా ఉంది. రిజిస్ట్రేషన్ కార్యాలయాల కార్య కలాపాలకు వస్తున్న ప్రజలు అధికారులకు చెల్లించాల్సి న లంచాల వల్ల కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ఇక్కడ నోట్ల కట్టలు ఇస్తేనే ఫైళ్లు కదులుతున్నాయి. ఒంగోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రతి పనికి ఒక రేటు ఉంటుంది. అయితే ఇక్కడ బోర్డు మాత్రం పెట్టలేదు.అంత వరకు నిజాయితీ గా అధికారులు ఉన్నారు. స్థిరచరాస్తులు మీది,చట్టబద్దమైన రిజిస్ట్రేషన్ చేసేది మేము. చట్టబద్ధంగా చలానాలు కట్టండి, అవి ప్రభుత్వ ఖజానాలో జమ అవుతాయి.మా సొంత ఖజానాలో లంచాలు జమ చేయండి అంటూ అధికారులు ప్రతి పనికి లంచాలు వసూళ్లు చేస్తున్నారు. పంచాంగంలోని తిథులు, వారాలు, యమగండం, రాహుకాలం, నక్షత్రాలు ఇలాంటివి కూడా చూసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అధికారులు చెప్తుంటారు. ఆయా ఆస్తులకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అదనపు వసూళ్లు ఎక్కువగా జరుగుతున్నాయి.రోజు వారి అక్రమ సంపాదన అధికారులకు లక్షల్లో ఉంటుంది. ఇక్కడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పనులు చేయించుకోవాలంటే అధికారులను చూసి ప్రజలు భయపడి పోతున్నారు. కష్టపడి సంపాదించిన ఆస్తులకు కూడా కాసులు ఇవ్వడం ఏంటని ప్రజలు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ఇప్పటికైనా ఏసీబీ అధికారులు ఒంగోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ప్రత్యేకదృష్టి పెడితే లంచవతారుల భారిన నుండి ప్రజలను కాపాడిన వారు అవుతారని ప్రజలు కోరుతున్నారు.

# తీగలేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.3 కోట్లు ప్రతిపాదనలు : టీడీపీ ఇన్‌ఛార్జీ గూడూరి

## - 'వానర సౌన్యం వారధి నిర్మించుకున్నట్లు గంటవానిపల్లి గ్రామస్తులు దారి నిర్మించుకున్నారు' శీర్షకతో వార్తలో ప్రచురితమైన వార్తకు స్పందన

## - గంటవానిపల్లె ప్రజల దశాబ్దాల కల గూడూరి ఎరిక్షన్‌బాబుతో సాకారం



**పెద్దదోర్నాల, ఆగష్టు 31, ప్రభాతవార్త**

దశాబ్దాలుగా తీగలేరు వాగుపై బ్రిడ్జి కోసం ఎదురుచూస్తున్న గంటవానిపల్లెప్రజలకుశుభవార్త. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో శాశ్వత బ్రిడ్జి నిర్మాణానికి యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌ఛార్జీకృషి ఫలితంగా రూ.3కోట్లు రూపాయల అంచనాలతో ప్రతిపాదనలు పంపించినట్లు గూడూరి ఎరిక్షన్ తెలిపారు.ఇప్పుడు మరమ్మత్తుల క్రిందరూ.5 లక్షలు మంజూరైనాయి. వానరసైన్యం వారధి నిర్మించుకున్నట్లు గంటవానిపల్లి గ్రామస్తులు దారి నిర్మించుకున్నారు అనే శీర్షికతో వార్తలో ప్రచురిత మైన వార్తకు యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ గూడూరి ఎరిక్షన్‌బాబు ఆదివారం గంటవానిపల్లి తీగలేరు వాగును స్వయంగా సందర్శించి దశాబ్దాల సమస్యకు పరిష్కారం చూపారు. త్వరలోనే బ్రిడ్జి పనులు చేపడతారని, తాత్కాలిక మరమ్మత్తులకు రూ.5లక్షలు మంజూరు చేసినట్లు ఆయన ప్రకటించారు. ప్రజల సమస్యలు తీర్చడమే తమ లక్ష్యమని గూడూరి ఎరిక్షన్‌బాబు తెలిపారు.దశాబ్దాల నుండి గంటవానిపల్లె ప్రజలు తీగలేరు వాగుపై బ్రిడ్జి లేకపోవడం, వర్షాలు వచ్చినప్పుడల్లా వాగు పొంగి పొర్లడం, విద్యార్థులు, రైతులు,కూలీలు, రోగులు వాగు ఉధృతికి దాటలేక ఎన్నో అవస్థలు పడ్డారు.ఈ దశాబ్దాల కష్టాన్ని గమనించిన గూడూరి ఎరిక్షన్‌బాబు ముందుకు వచ్చారు.ప్రజల అభ్యర్థనను ప్రభుత్వానికి, ముఖ్య మంత్రికి, మంత్రులకు, ప్రిన్సిపాల్ చీఫ్ సెక్రటరీ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి మాట్లాడారు. శాశ్వత పరిష్కార దిశగా బ్రిడ్జి నిర్మాణానికి రూ.3 కోట్ల రూపాయలు మంజూరు చేయించారు. దీంతో గంటవానిపల్లె ప్రజల దశాబ్దాల కల సాకారం కాబోతుంది.మూడు కోట్ల రూపాయలు మంజూరై నట్లు గూడూరి ఎరిక్షన్‌బాబు ఆదివారం తీగలేరు వాగు సందర్శించి అక్కడే ప్రకటించడంతో ప్రజలు ఆనందోత్స వాలతో గూడూరి ఎరిక్షన్‌బాబును అభినందించారు. మా తరతరాల కలను సాకారం చేయబోతున్న వ్యక్తి గూడూరి ఎరిక్షన్‌బాబు. వర్షాలు వస్తే వాగు దాటలేక మా జీవితాలు కష్టాల్లో ఉండేవి. ఇక ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని సంతోషంగా ఉందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే గ్రామస్తులజీవన ప్రమాణాలు మెరుగవుతాయి. ఒక కృషి వంతుడి పట్టుదలతో ప్రజల కలలు ఎలా సాకారం అవుతాయోగూడూరి ఎరిక్షన్‌బాబు నిరూపించారని ప్రజలు ప్రశంసిస్తున్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు షేక్‌మాబు, వెచ్చహరగోపాల, జడిలక్ష్మయ్య, దొడ్డశేషాద్రి, కొప్పుల వెంకటసుబ్బారెడ్డి, షేక్‌మౌలాలి, షేక్ మంజూరు, దర్శనం సుధీర్‌బాబు , ఎలకపాటి చెంచయ్య, చాట్ల యేసు, తోటకృష్ణ, చిన్న పుల్లయ్య, రంగస్వామి నాయక్, జనసేన మండల కన్వీనర్ కేతి వెంకట మురళి, తదితరులు పాల్గొన్నారు.

# సుందరకాండ చిత్రం విజయోత్సవ యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల





**ఒంగోలు, ప్రభాతవార్త**

హీరో నారా రోహిత్, హీరోయిన్ విర్తి కలిసి నటించిన చిత్రం సుందరకాండ విజయోత్సవ యాత్ర ఆదివారం జరిగింది. ఈ విజయోత్సవ కార్యక్రమానికి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నారారోహిత్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.





పెనుగొండ క్షేత్ర పీఠాధిపతులు పరమ పూజ్యశ్రీ శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి స్వామి వారి ఆధ్వర్యంలో తెనాలి మర్చంట్ అసోసియేషన్ హాల్‌లో జరిగిన అర్ధ చాతుర్మాస వ్రత దీక్ష మహోత్సవం సందర్భంగా పరమ పూజ్య బాల స్వామి వారిని దర్శించుకొని విశేష పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు అందుకున్న రాష్ట్ర మాజీ మంత్రివర్యులు శ్రీ శిద్దా రాఘవరావు ,శ్రీమతి శిద్దా లక్ష్మి పద్మావతి

# జర్నలిస్టులకు రెండు రోజుల శిక్షణ తరగతులు ముగింపు...

## - గ్రామీణాభివృద్ధిలో మీడియా పాత్ర అత్యంత కీలకం...
## - విలేఖరి నిత్యవిద్యార్థి ... జీవితమంతా నేర్చుకుంటూనే ఉంటాడు ...
## - శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి



**మార్కాపురంరూరల్, ఆగస్టు31, ప్రభాతవార్త**

పట్టణంలోని స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన రెండు రోజుల జర్నలిస్టుల శిక్షణ తరగతులు శనివారం విజయ వంతంగా ముగిశాయి.ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ సిఆర్ మీడియా అకాడమి చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ సహకారంతో ఏపియూడబ్ల్యూజే రాష్ట్రఅధ్యక్షులు ఐ.వి.సుబ్బారావు, ఏపియూడబ్ల్యూజే రాష్ట్ర, జిల్లా,డివిజన్, నాయకత్వం, సభ్యులు(ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్), ప్రెస్ క్లబ్‌కమిటీ, సభ్యులు ఏర్పాటు చేసారు. ప్రముఖ మీడియా నిపుణులు, సీనియర్ జర్నలిస్టులు తరగతులకు మార్గ దర్శకులుగా పనిచేశారు. ఈ సందర్భం గా సీనియర్ జర్నలిస్ట్ జి రామకృష్ణ, కుర్రా విజయకుమార్ తెలుగు ఏ ఐ ట్రైనర్, సీనియర్ జర్నలిస్ట్ సతీష్ బాబు పత్రికా బాషా జర్నలిజం నైతికత, వాస్తవ వార్తల ప్రాధాన్యత, డిజిటల్ మీడియా పరిజ్ఞానం వంటి అంశాలపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి, డిఎస్‌పి,యూనాగరాజులు మాట్లాడుతూ ,సమాజ నిర్మాణంలో మీడియా పాత్ర అత్యంత కీలకం. సమగ్ర సమాచారం ప్రజలకు చేరే విధంగా జర్నలిస్టులు వ్యవహరించాలి"అని అన్నారు.కార్యక్రమంలో పలువురు యువ జర్నలిస్టులు, మీడియా విద్యార్థులు పాల్గొన్నారు.శిక్షణపూర్తైన వారికి ధృవపత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏపియూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయరాజ్,ఏపి ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ఏచూరి శివ,ఏ పి యూ డబ్ల్యూ జే రాష్ట్ర కార్యదర్శి ఏ.సురేష్,ఏఎంసి చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి,ఏ 1గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ యం.షంషీర్ ఆలిబేగ్,ఏపియూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఎన్‌వి రమణ,జిల్లా కార్యదర్శి డి.కనకయ్య,జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు బి.వెంకట్రావు,ప్రెస్ క్లబ్ అధ్యక్షులు డి.మోహన్‌రెడ్డి, వార్తబ్రాంచ్ మేనేజర్‌ఎం.అల్లూరిరెడ్డి,సీనియర్ జర్నలిస్ట్ నరసింహారావు, మార్కాపురం సీనియర్ జర్నలిస్ట్‌లు,సంపాదకులు,పాత్రికేయులు, తరగతులకు హాజరయిన జర్నలిస్ట్‌లు పాల్గొన్నారు.ఇంతటి చక్కటి కార్యక్రమం ఇంత విజయవంతం కావటంలో కీలకపాత్ర పోషించిన ఏపి యూడబ్ల్యూజే జిల్లా నాయకత్వానికి, మార్కాపురం డివిజన్ నాయకత్వం, సభ్యులు, సీనియర్ జర్నలిస్టులకు, వక్తలకు ఏపియూడబ్ల్యూజే రాష్ట్ర శాఖ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

6_6.qxd 9/1/2025 12:43 AM Page 1



## విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ కార్యక్రమాన్ని అన్నీ ప్రభుత్వ కార్యాలయాలలో నిర్వహించాలి చెన్నుపల్లి



**అద్దంకి , ఆగష్టు 31, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ కమ్మరి పార్వతమ్మ, కాణిపాక వినాయక చవితి నవరాత్రి ఉత్సవ కార్యక్రమంలో పాల్గొని తిరిగి విజయవాడ వెళుతూ మేదరమెట్లలో ఆగిన సందర్భంగా ఛైర్మన్ కమ్మరి పార్వతమ్మని మర్యాద పూర్వకముగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ప్రకాశం జిల్లా లోని విశ్వబ్రాహ్మణ సంగీయులు ఎదుర్కొంటున్న పలుసమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా ఆలోచన చేయాలని కోరారు. సెప్టెంబర్ 17 జరుగు విశ్వకర్మ యజ్ఞ మహోత్సన్ని అన్నీ ప్రభుత్వ కార్యక్రమంగా ప్రకటించి ఉన్నారు.ఆ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయంలో ప్రభుత్వ పండగగా నిర్వహించే విధంగా తగు చర్యలు చేపట్టాలని తెలియజేశారు. ఛైర్మన్ స్పందించి రెండు రోజుల్లో గౌరవ ముఖ్యమంత్రిని కలిసి విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లి,అందరి అభిప్రాయాలను గౌరవించే విధంగా కార్యక్రమాలు రూపొందిస్తామని హామీ ఇచ్చారు. కలిసిన వారిలో ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చెన్నుపల్లి శ్రీనివాసాచారి, యువజన సంఘం మాజీ అధ్యక్షులు టిడిపి పార్టీ సాధికార కమిటీ కన్వీనర్తువ్వపాటి జనార్ధనాచారి, సంఘ నాయకులు ఏలూరి వీర బ్రహ్మాచారి, సంఘ నాయకులు ఉన్నారు

## కార్మిక, కర్షక ఉద్యమాలను ఉధృతం చేయాలి

### - సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జివి కొండారెడ్డి





**అద్దంకి , ఆగష్టు 31, ప్రభాతవార్త**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక ,కర్షక ఉద్యమాలను ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జివి కొండారెడ్డి అన్నారు.ఆదివారం అద్దంకి లోని సుందరయ్య భవన్లో అద్దంకి నియోజకవర్గస్థాయి సిపిఎం కార్యకర్తల ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో "వర్తమాన రాజకీయాలు"అనే అంశంపై కొండారెడ్డి మాట్లాడారు.శ్రమ శక్తి ద్వారా సంపదను శ్రమజీవులు సృష్టిస్తే,ఆ సంపద కొంత మంది వ్యక్తులు చేతుల్లోకి వెళుతుందని, ఆ సంపదను వాళ్లు పెట్టుబడిగా పెట్టి దాన్ని మరింతగా పెంచుకుంటున్నారని అన్నారు. శ్రమచేసి సంపాదన సృష్టించిన శ్రమజీవులకు సంపద మొత్తం పంచాలన్నదే మార్క్సిస్ట్ పార్టీ లక్ష ్యం అని,వ్యత్యాసాలు లేని అసమానతలు లేని సమాజాన్ని సృష్టించాలన్నదే లక్ష ్యమని, ఇటీవల జరిగిన పార్టీ మహాసభ రాజకీయ తీర్మానం కూడా అదే అని కొండారెడ్డి అన్నారు. పెట్టుబడిదారీ ఆర్థిక 300 కోట్ల జనాభా పరిధిలో ఉంటే, సోషలిస్ట్ ఆర్థిక వ్యవస్థ 150 కోట్ల జనాభా పరిధిలో ఉందని అన్నారు. ప్రస్తుతం పెట్టుబడి దారి ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో ఉందని, ఆ సంక్షోభం నుండి బయటపడేందుకే దేశాల మధ్య యుద్ధాలు సృష్టించి, ఆయుధాలు అమ్ముకొని బలపడాలని ప్రయత్నిస్తుందని, ఇందులో భాగమే రష్యా ఉక్రెయిన్, ఇజ్రాయిల్ పాలస్తీనా యుద్ధాలని కొండారెడ్డి చెప్పారు. ఈ సంక్షోభానికి వ్యతిరేకంగా కార్మిక వర్గం, రైతాంగం ,విద్యార్థులు పోరాటం చేస్తున్నారని, అవసరం అనుకున్న చోట ఆయా ప్రభుత్వాలను కూడా మార్చి వేస్తున్నారని చెప్పారు. పోరాటాలు జరిగిన చోట కొన్ని దేశాల్లో కమ్యూనిస్టులను అధికారంలో తీసుకొస్తున్నారని, పోరాటాలు జరగని దేశాల్లో మితవాదులు ముందుకొస్తున్నారని కొండారెడ్డి చెప్పారు. సోషలిస్ట్ దేశాల్లో ఆర్థిక వ్యవస్థలు స్థిరంగా కొనసాగుతున్నాయని, నిరుద్యోగం ,పేదరికం తగ్గుతున్నాయని కొండారెడ్డి చెప్పారు. బిజెపి అమెరికా సామ్రాజ్యవాదులకు అనుకూలంగా వ్యవహరిస్తుందని, ప్రధాని విదేశీ పర్యటనలన్నీ స్వదేశీ మార్కెట్ను వల్ల కొట్టడానికేనని కొండారెడ్డి అన్నారు. ప్రభుత్వాలు ప్రభుత్వ రంగాన్ని ధ్వంసం చేసి సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్నాయని,ఆశ్రిత పెట్టుబడి విధానం అమలు జరుగుతుందని చెప్పారు. భారత రాజ్యాంగానికి ముప్పు ఏర్పడిందని, భారత ఎన్నికల సంఘం ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తుందని కొండారెడ్డి అన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో వేలాది ఎకరాలను కార్పొరేట్ సంస్థలకు అప్పచెబుతున్నారని, ఒక్క పరిశ్రమ కూడా జిల్లాకు రాలేదని ఆయన అన్నారు. రాష్ట్రంలోని అధికార ప్రతిపక్ష పార్టీలు కేసుల నుండి బయపడి మత విద్వేషాలకు బానిసలు అవుతున్నారని, రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని చెప్పారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక, కర్షక ,విద్యార్థి, రైతు,మహిళ,మేధావి వర్గం అంతా ఉద్యమించాలని ఆయన కోరారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో "పార్టీ నిర్మాణం కర్తవ్యాలు" అనే అంశంపై పార్టీ జిల్లా నాయకులు సిహెచ్ మజుందార్ మాట్లాడుతూ,పోరాటాలు లేకుండాఏ సమస్య పరిష్కారంకాదని,రాబోయే కాలమంతా పోరాటాలమయం కావాలని,ప్రజల పక్షాన పోరాటాల నిర్వహించడానికి పార్టీశ్రేణులు సిద్ధం కావాలన్నారు. స్థానిక సమస్యలపై పార్టీ నాయకత్వం దిష్టి సారించాలని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాడాలని మజుందార్ కోరారు.స్మార్ట్మీటర్లకు వ్యతిరేకంగా ప్రతి గ్రామంలోనూ ప్రజలను కూడగట్టాలని,వాటి వలన కలిగే నష్టాలను వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు అధ్యక్షత వహించారు. అద్దంకి టౌన్ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు వందన సమర్పణ చేశారు.

## ఉత్తమ మోటివేషన్ స్పీకర్గా శ్రీరామ్



**అద్దంకి , ఆగష్టు 31 ప్రభాతవార్త**

ఉత్తమ మోటివేషన్ స్పీకర్, ట్రైనర్గా సర్టిఫికెట్ పొందిన కమదాని శ్రీరామ్ 50 రోజుల ఆన్లైన్ ట్రైనింగ్ అనంతరం శని, ఆదివారాల్లో హైదరాబాదులో జరిగిన ఆఫ్ లైన్ కార్యక్రమంలో ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, ట్రైనర్ అయినటువంటి గంప నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న నైపుణ్య అభివృద్ధి స్వచ్ఛంద సంస్థ ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ట్రైనర్స్, మెంటార్స్ పర్యవేక్షణలో పలు స్పీచ్ లు ,యాక్టివిటీస్,అసైన్మెంట్లు లోముందంజలో నిలిచినందుకు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఛైర్మన్ గంప నాగేశ్వరరావు, హైదరాబాద్ లయన్స్ క్లబ్ వైస్ ఛైర్మన్ మనోహర్ రెడ్డి చేతులమీదుగా ఉత్తమ ప్రదర్శన సర్టిఫికెట్ అందుకున్న బల్లికురవ మండలం, వెలమవారిపాలెం గ్రామం, అద్దంకి నియోజకవర్గం కు చెందిన చెందిన కమదాని శ్రీరామ్.

## వినాయక చవితి సందర్భంగా క్విజ్ పోటీలు

**అద్దంకి, ఆగష్టు 31 ,ప్రభాతవార్త**

వినాయక చవితి పూజా కార్యక్రమాలలో భాగంగా, నాగులపాడు రోడ్డు లోని వినాయక మండపం దగ్గర శివసాయి రెసిడెన్సీ లోని పిల్లలకు ఆదివారం వినాయకవ్రతకల్పంపుస్తకం లోని అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించారు.అనంతరం గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందచేశారు.పిల్లలు ఆటపాటలతో పాటు విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలని,క్విజ్ పోటీలు నిర్వహించిన కోట అంజమ్మ, నాదెళ్ల వాణి,చప్పిడి వీరయ్య పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అపార్ట్మెంట్ లోని పిల్లలు, వారి తల్లితండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



## స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ మిషన్ సంచాలకుడిగా

### చిన్ని శ్రీనివాసరావు నియామకం



**అద్దంకి, ఆగష్టు 31, ప్రభాతవార్త**

అద్దంకి పట్టణానికి చెందిన ప్రముఖ నేత చిన్ని శ్రీనివాసరావును రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ మిషన్ సంచాలకుడిగా నియమించింది. రాష్ట్ర వ్యాప్తంగా 14 మంది సంచాలకులతో కూడిన కమిటీని ప్రభుత్వం శనివారం అధికారికంగా ప్రకటించారు. పట్టణ పురపాలక సంఘం పూర్వ వైస్ ఛైర్మన్గా, పట్టణ తెదేపా అధ్యక్షుడిగా విశేష సేవలు అందించిన శ్రీనివాసరావు కృషిని గుర్తించి ఈ కీలకమైన పదవి లభించడం స్థానిక ప్రజల్లో ఆనందాన్ని కలిగించింది. ఈ సందర్భంగా ఆయనను చుండూరి మురళీ సుధాకర్, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, ఎర్రమోతు శంకరరావు, పూనూరి నరేంద్ర, మన్నం త్రిమూర్తులు ఘనంగా సత్కరించారు. పార్టీ కోసం నిరంతరం శ్రమించిన నాయకులను గుర్తించి బాధ్యతలు అప్పగించడం ద్వారా తక్కువ స్థాయి నాయకులకు ఉత్సాహాన్ని కలిగిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యుత్ శాఖామాత్యులు గొట్టిపాటి రవికుమార్లకు శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. అద్దంకి నుండి రాష్ట్ర స్థాయిలో ఈ విధమైన పదవి రావడం, స్థానిక నాయకత్వానికి ప్రేరణగా నిలుస్తుందనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేశారు.

## పల్లెసీమలలో నిమజ్జనోత్సవాల సందడి



**బల్లికురవ, ఆగష్టు 31, ప్రభాతవార్త**

గణేష్ నిమజ్జనోత్సవాల సందడితో పల్లె సీమలు మార్మోగుతున్నాయి. గణపతి బప్పా మోరియా అంటూ చిన్న పెద్ద తేడా లేకుండా గణనాథుడిని ఘనంగా నిమజ్జనోత్సవానికి సాగనం పుతున్నారు. ఆదివారం మండలంలోని బల్లికురవ, నక్కబుక్కలపాడు, అంబడిపూడి, కొమ్మినేనిపాలెం, కొప్పెరపాలెం, తదితర గ్రామాలలో గణనాతులు నిమజ్జనానికి తరలివెల్లారు. నక్కబొక్కలపాడులో గత 25 సంవత్సరాలుగా సాయిబాబా ఆలయ సమీపంలో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు .సందర్భంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు కోలాట ప్రదర్శనలు కొనసాగాయి. గ్రామాలలో రాజకీయ పార్టీల గీతాల ఆలాపనకు తావు లేకుండా నిమజ్జనోత్సవ కార్యక్రమాలు కొనసాగించుకోవాలని ఎస్సై నాగరాజు ఉత్సవ విగ్రహ కమిటీలకు ముందుగానే తెలియజేయడంతో కార్యక్రమాలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. వినాయక చవితి ప్రాముఖ్యతను వేద పండితులు సుధీర్శర్మ ఈ విధంగా వివరించారు. బారతీయ సనాతన ధర్మాన్ని అనుసరించి ప్రతి దేవత కార్యక్రమం వెనుకపరమార్ధం ఖచ్చితంగా ఉంటుంది. నీటిలో నుండి భూమి ఏర్పడింది. అదే విధంగా జడ పదార్ధమైన పుడమి నీటితో చేరినప్పుడు ప్రాణ శక్తి జనించి, ఆహార పదార్ధాలను, ఔషధాలను అందిస్తుంది. జడ చైతన్య శక్తులైన మట్టి నీళ్ల కలయికతో వినాయక విగ్రహం ఏర్పడుతుంది. ఆరాధన అర్హతను పొందుతుంది. యోగ శాస్త్రం ప్రకారం మూలధార చక్రానికి విఘ్నేశ్వరుడు అధిష్టాన దేవత మూలధారం పృధ్వితత్వం అందుకే లంభోదరని మట్టితోనే చేయాలని చెబుతారు. ఏ తత్వంతో ఏర్పడిన వస్తువు చివరికి మరలా అదే తత్వంలో కలిసిపోవడం సృష్టిధర్మం. అంతే కాకుండా వినాయక విగ్రహాలు నీళ్లలో కలవటం వల్ల అందులోని పంచ తత్వాలు నీటిలో కలిసిపోతాయి. అదే విధంగా ఔషధ గుణాలు కలిగిన 21 రకాల పూజ పత్రాలు, విగ్రహంతో పాటు వీటిలో కలయటం వల్ల ఆ నీటిలోని కాలుష్యం కరిగిపోతుంది. రోగకారక క్రిములు నశిస్తాయంటూ నిమజ్జనోత్సవంలో పరమార్ధాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఎస్సై నాగరాజు భద్రతా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## కూలి ప్రాణం ఖరీదు రూ.3.50 లక్షలు

### - పేదవారి ప్రాణం ఖరీదు కట్టడంలోనూ తేడాలే



**బల్లికురవ, ఆగష్టు 31, ప్రభాతవార్త**

గ్రానైట్ లారీల యజమానుల కాసుల కక్కుర్తికి దుర్మరణం చెందుతున్న కూలీల మరణాలకు ఖరీదు కట్టడంలోనూ పక్షపాతం చూపిస్తున్నారు. ప్రమాదం జరిగిన ప్రతిసారి పంచాయతీల నిర్వహణ కీలక పాత్ర పోషిస్తుంది. అర్హత ఉన్న వాహన చోదకులను నియమించుకుంటే అధిక జీతభత్యాలు చెల్లించాల్సి వస్తుందన్న కుక్కుర్తి ధోరణిలో ఆటోలు కూడా సరిగా నడపటం రాని వారికి లారీల స్టీరింగ్ అప్పగించడం, అందులోనూ వాహన సహాయకులకు మద్యం మత్తులో ఉన్న సమయంలో గ్రానైట్ రాళ్ల లోడింగ్కు పంపడం పలు ప్రమాదాలకు కారణం అవుతుంది. గత శుక్రవారం రాత్రి బల్లికురవ, మల్లాయపాలెం రహదారిలో మృతి చెందిన బల్లికురవ ఎస్సీ కాలనీకి చెందిన జొన్నలగడ్డ మేరమ్మ మరణానికి రూ.3.50లక్షలు ఖరీదు కట్టారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాళ్ల చేతులు విరగకొట్టుకున్న వారికి 50 వేల పరిహారం లెక్కకట్టారు. ఇదే నెలలో గ్రానైట్ క్వారీలో జరిగిన ప్రమాదంలో మరణించిన పరాయి రాష్ట్రం కూలీలకు రూ.14లక్షలు నష్టపరిహారం చెల్లించారు. తీవ్రంగా గాయపడిన వారికి పది లక్షలు చెల్లించారు. మృతుల ప్రాణాలకు ఖరీదు కట్టడంలోనూ పంచాయతీల నిర్వహణ కీలకపాత్ర పోషిస్తున్నాయి. రెక్కాడితే కానీ డొక్కాడని కూలీల మరణం లోను కారుణ్యం చూపకుండా కొనసాగుతున్న ఈ ద్వంద్వ నీతిని పలువురు ప్రజాసంఘాల నేతలు ఖండిస్తున్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన





**బల్లికురవ, ఆగష్టు 31, ప్రభాతవార్త**

మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో ఆదివారం శంకర వైద్యశాల, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరానికి వృద్దుల నుండి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 72 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, వీరిలో 25 మందికి శుక్లములు ఉన్నట్లుగా గుర్తించారు. వీరిని ఆపరేషన్ కోసం సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమ నిర్వహణ కోసం సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ దేవినేని నరేంద్ర, డిస్ట్రిబ్యూటర్ కమిటీ వైస్ ఛైర్మన్, నీటి సంఘం అధ్యక్షులు కక్కెర సుబ్బారావు, తెలుగు యువత నాయకులు చిడిపోతు నరేంద్ర, మాజీ సర్పంచ్ అమరనేని కాశీ విశ్వనాథం, అమర్నేని వినోద్లు సహకారం అందించారు.

## త్రైత సిద్ధాంత భగవద్గీత కృష్ణాష్టమి విశిష్టతపై ప్రచారం



**బల్లికురవ, ఆగష్టు 31, ప్రభాతవార్త**

త్రైత సిద్ధాంత ఆదికర్తశ్రీ ఆచార్య ప్రబోధానంత యోగీశ్వరుడు ఆశీస్సుల తో ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూజ్ఞానవేదిక నరసరావుపేట కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని సూరేపల్లి, ముక్తేశ్వరం గ్రామాల్లో త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంధములు ఇందూ ధర్మప్రచారం నిర్వహించారు. శ్రీకృష్ణ భగవానుని ప్రాముఖ్యతను వివరించారు. దేవుడే అవతరించి ఒక మనిషిగా జన్మిస్తే ఆయననుభగవంతుడు అని అంటాము. అలాంటి భగవంతుడే శ్రీకృష్ణుడు, ఆయనను మాత్రమే అందరూ దైవంగా గుర్తించాలి అని ఊరిలోని వారందరికి వివరించారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట కమిటీ అధ్యక్షుడు ఘడియం పెద్దరెడ్డి, ఎలిశెట్టి రమేష్, పగడాల రామయ్య, కోవూరిచిన్నవెంకటేశ్వర్లు, పెరుగు ఏడుకొండలు, కాటంపోతురాజు, ఎలిశెట్టి రామాంజనేయులు, పగడాల అశోక్, చల్లగుండ్ల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడాలి

### - సీఐటీయు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు




**మద్దిపాడు, ఆగష్టు 31, ప్రభాతవార్త**

వివిధ రంగాలలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాడాలని సీఐటీయు జిల్లాఅధ్యక్షులు కాలం సుబ్బారావు అన్నారు. మండల కేంద్రమైన మద్దిపాడులో సీఐటీయు మండల మహాసభ ఎస్కే కాశీం అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్వాతంత్రానికి ముందు నుండి కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్లను మార్చి కార్మికులపై మరింత భారాలు పెరిగే విధంగా చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలలో కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నాని, పెరిగిన ధరలకు అనుకూలంగా స్కీం వర్కర్లు వేతనాలు పెరగటం లేదన్నారు. బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని పెంచిపోషిస్తుందన్నారు. కార్మికులను ఐక్యం కాకుండా మతం కులం పేరుతో వారి మధ్య అనైక్యత తెస్తుందన్నారు. కార్మికులందరూ ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవడం కోసం పోరాడాలన్నారు. అనంతరం మండల సమన్వయ కమిటీని తొమ్మిది మందితో ఎన్నుకున్నారు. సీఐటీయు మండల కన్వీనర్గా ఉబ్బా ఆదిలక్ష్మీని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆశా, ఆటో, గ్రోత్ సెంటర్, బిల్డింగ్ రంగాల నుండి కార్మికులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్శాఖ మంత్రి గొట్టిపాటి పర్యటన వివరాలు

**జె. పంగులూరు ,ఆగష్టు 31 ,ప్రభాతవార్త**

మండలంలోని జె.పంగులూరు గ్రామంలో విద్యుత్శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం ఉదయం 10 గంటలకు సామాజిక పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో,11 గంటలకు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల లోని విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ కార్యక్రమాలలో పాల్గొంటారని ఆయన క్యాంపు కార్యాలయం ప్రతినిధి తెలిపారు.

## ఘనంగా ముగిసిన ఉచిత మినరల్ కూలింగ్ చలివేంద్రం



**సంతనూతలపాడు, ఆగష్టు 31, ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండలం రుద్రవరం గ్రామంలో గత ఐదు నెలలుగా సూపర్ స్టార్ కృష్ణ, మహేష్బాబు యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వాహకులు కుక్కల గోవిందరాజులు పర్యవేక్షణలో ప్రజలు దాహార్తి నిమిత్తం ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ కూలింగ్ చలివేంద్రం ఆదివారంతో ఘనంగా ముగిసింది. ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీన రుద్రవరం గ్రామంలో గోవిందరాజులు చేయూతతో ప్రారంబించిన మినరల్ కూలింగ్ చలివేంద్రం ఆగష్టు 31వ తేదీ వరకు కొనసాగింది. ప్రతి ఏడాది ప్రజలు దాహార్తి నిమిత్తం ఇదే విధంగా మినరల్ కూలింగ్ చలి వేంద్రంను వేసవిలో ఏర్పాటు చేయనున్నట్టు దాత సూపర్ స్టార్ కృష్ణ, మహేష్బాబు ఫ్యాన్స్ ప్రతినిధి కుక్కల గోవిందరాజులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. వేసవిలో ప్రజలు దాహార్తి పరిష్కార నిమిత్తం ఈ మినరల్ కూలింగ్ చలివేంద్రం ఏర్పాటు చేయటం తమకెంతో ఆనందదాయకంగా ఉందని గోవిందరాజులు ఈ సందర్భంగా వెల్లడించారు.

## ఘనంగా గణపతినాధులకు గ్రామోత్సవ నిమజ్జన వేడుకలు



**సంతనూతలపాడు, ఆగష్టు 31, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన సంతనూతలపాడులో ఐదవ రోజున పలు వాడల్లో ఏర్పాటు చేసిన వినాయకులకు ఆయా నిర్వాహకులు ఘనంగా గ్రామోత్సవ వేడుకలు నిర్వహించారు. సంతనూతలపాడులోని అంకాలమ్మ తల్లి దేవస్థానం ప్రాంగణం వద్ద అంకాలమ్మ తల్లి యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఆదివారం నాడు ఘనంగా గణపతి నాధులకు సంతనూతలపాడు పురవీధుల్లో గ్రామోత్సవ వేడుకలు నిర్వహించారు. స్థానిక గానుగపాలెం, పోలీసు స్టేషన్ వద్ద ఎస్టీ కాలనీ, వడ్డెర పాలెం ట్యాంకు వద్ద గల పలు వినాయకులకు గ్రామోత్సవం నిర్వహించి అనంతరం చంద్రపాలెం సాగర్ కాలువల్లో వినాయకులకు నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువకులు ఈ గ్రామోత్సవంలో చిందులు తొక్కారు. ఐదో రోజున మండలంలోని పలు గ్రామాల్లో వినాయకులకు గ్రామోత్సవం నిర్వహించి తదుపరి చంద్రపాలెం ఎన్నెస్పీ కెనాల్, కొత్తపట్నం సముద్రంలో గణపతి నాధులకు నిమజ్జనం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వాడలలో అన్నదాన వేడుకలు నిర్వహించారు. ఒంగోలు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్.శ్రీకాంత్బాబు పర్యవేక్షనలో సంతనూతలపాడు ఎసెస్సై వేజెండ్ల అజయ్బాబు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తును పర్యవేక్షించారు. అంకాలమ్మ తల్లి దేవస్థానం వద్ద గల ఏర్పాటు చేసిన గణపతి వేడుకల్లో భాగంగా వినాయకుని లడ్డును ఆదివారం నాడు బాపట్ల ఏడుకొండలు 18 వేల రూపాయలకు వేలంలో పాడుకున్నారు. దగ్గు వెంకట్రావు రూ.2500లకు కలశాన్ని పాడుకున్నారు.

## సాగర్కాలువల్లో ఘనంగా వినాయకులకు నిమజ్జన వేడుకలు





**సంతనూతలపాడు, ఆగష్టు 31, ప్రభాతవార్త**

గణపతినాధులకు నిర్వాహకులు ఆదివారం నాడు 5వ రోజు ఘనంగా సంతనూతలపాడు సమీపంలోని చంద్రపాలెం ఎన్నెస్పీ కాలువలో ఘనంగా నిమజ్జన వేడుకలు నిర్వహించారు. ముఖ్యంగా సంతనూతలపాడు, బొడ్డువారిపాలెం, మద్దులూరు, ఎనికపాడు, చంద్రపాలెం తదితర గ్రామాల్లో వినాయకులకు ఈ ఎన్నెస్పీ కాలువల్లో ఘనంగా నిమజ్జన వేడుకలు నిర్వహించారు. మొదట సాగర్ కాలువ వద్ద గణపతి నాధులకు పూజలు నిర్వహించి తదుపరి కెనాల్లో స్వామివారికి నిమజ్జనం నిర్వహించారు. సాగర్ కాలువల వద్ద నీరు పుష్కలంగా ప్రవహించడంతో మహిళలు, ప్రజలు, యువకులు ఆనందోత్సవాలతో స్నానాలు చేశారు. యువకులు కేరింతలతో ఈత కొట్టారు. తమతమ వినాయకులకు నిమజ్జనం నిర్వహించి తదుపరి సాగర్ కాలువల్లో ప్రతి ఒక్కరూ స్నానమాచరించారు. గ్రామాల్లో సగం గణపతి నాధులకు ఆదివారం నాడు సాగర్ కాలువల్లో నిమజ్జనం నిర్వహించారు. ఒంగోలు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్.శ్రీకాంత్బాబు పర్యవేక్షణలో సంతనూతలపాడు ఎస్సై వేజెండ్ల అజయ్బాబు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది స్థానిక సాగర్ కాలువల వద్ద ప్రత్యేక పికెట్ ద్వారా బందోబస్తును పర్యవేక్షించారు.

## సముద్ర తీరంలో గణేశుని నిమజ్జన సందడి



**వేటపాలెం, ఆగష్టు 31, ప్రభాతవార్త**

వినాయక చవితి నవరాత్రుల్లో భాగంగా మండలంలో ఆదివారం 5 వ రోజు వినాయకుని నిమజ్జన సంబరాలు అంబరాన్ని అంటాయి. ఏకదంతుడు డప్పులతో బాణ సంచాలతో వరుసగా సముద్ర తీరానికి తరలివచ్చారు. గణేష్ నిమజ్జనంలో యువకులు ఉత్సాహంగా పాల్గొని స్వామివారిని నిమజ్జనం చేసి సముద్ర స్నానాన్ని ఆచరించారు. తీర ప్రాంతంలో నిమజ్జన సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోఈసులు కట్టుదిట్టమైన ఏర్పాటు చేశారు. మెరైన పోలీసులు గజ ఆతగాళ్లు స్నానం ఆచరించే భక్తులను లోతుకు వెళ్లకుండా గస్తీ కాచారు. వేటపాలెం పోలీసు వారు డ్రోన్ కెమెరా సహాయంతో ఎప్పటికప్పుడు తీర ప్రాంతాన్ని తమ నిఘాలోకి తీసకొచ్చారు. ఆనందోత్సహాల మధ్య భక్తులు చిన్న పెద్ద అనే తేడా లేకుండా తీర ప్రాంతం స్నానమాచరించడంతో తీర ప్రాంతం సందడిగా మారింది.

## భౌతికకాయాన్ని సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించిన గూడూరి



**పెద్దదోర్నాల, ఆగస్టు 31, ప్రభాతవార్త**
పెద్దదోర్నాల ఏబీఎం పాలెంకు చెందిన టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కటికల దానం సతీమణి లక్ష్మమ్మ మృతి సమాచారం తెలుసుకున్న యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ గూడూరి ఎరిక్షన్‌బాబు ఆదివారం దోర్నాల విచ్చేసి మృతురాలు లక్ష్మమ్మ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. టీడీపీ నాయకులు కటికల దానం కుటుంబాన్ని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిత్తూరి హారిక, మాజీ సర్పంచ్ వెచ్చహరగోపాల్, టీడీపీ నాయకుడు మాజీ ఎంపీపీ ముండ్ల వేదాంత ప్రభాకర్, ఒంగోలు పార్లమెంటు ఉపాధ్యక్షుడు షేక్ మాబు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జడి లక్ష్మయ్య, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దొడ్డ శేషాద్రి, కొప్పుల వెంకట సుబ్బారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు చంటి, దర్శనం సుధీర్‌బాబు, ఎలకపాటి చెంచయ్య, చాట్ల ఏసులు, షేక్ మౌలాలి, టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## దోర్నాల ఎస్సై మహేష్‌ను సన్మానించిన గూడూరి ఎరిక్షన్‌బాబు





**పెద్దదోర్నాల, ఆగస్టు 31, ప్రభాతవార్త**
ఉత్తమ ఎస్సైగా అవార్డు పొందిన పెద్దదోర్నాల ఎస్సై వి.మహేష్‌ను ఆదివారం పెద్దదోర్నాలలో జరిగిన కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ గూడూరి ఎరిక్షన్‌బాబు శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించి సన్మానించారు. సేవను వృత్తిగా కాకుండా ధర్మంగా భావించే అధికారులు అరుదుగా లభిస్తారు. అలాంటి అరుదైన వర్గంలో స్థానం సంపాదించిన వాడే దోర్నాల ఎస్సై వి.మహేష్, చట్టం అమలు,ప్రజల భద్రత, సామాజిక శాంతి పరిరక్షణలో ఆయన చూపిన కర్తవ్య నిష్ఠ పోలీసుశాఖలో గుర్తింపు తెచ్చి పెట్టింది. స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఉత్తమ ఎస్సైగా జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ చేతుల మీదుగా ఉత్తమ ఎస్సై అవార్డు అందుకున్నారు. ఎస్సై వి.మహేష్ లాంటి నిబద్ధత కలిగిన అధికారులు సమాజానికి ఆదర్శం. పోలీసులు ప్రజల సమస్యలు విని వాటి పరిష్కారంలో కృషి చేస్తేనే వారికి నమ్మకం పెరుగుతుంది. ఆ విశ్వాసాన్ని నిలబెట్టిన వారే దోర్నాల ఎస్సై వి.మహేష్ అని అభినందించారు. పోలీసుశాఖ అంటే కేవలం చట్టం అమలు మాత్రమే కాదు. ప్రజలకు అండా నిలిచి వారికి సమస్యలను పరిష్కరించడం కూడా. ఎస్సై వి.మహేష్ ఆ విధానాన్ని చాటారు. ఇలాంటి అధికారులు సమాజానికి ఆదర్శమని గూడూరి ఎరిక్షన్‌బాబు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఒంగోలు పార్లమెంటు ఉపాధ్యక్షుడు షేక్ మాబు, టీడీపీ లీడల్ సెల్ న్యాయవాది వల్లభనేని కాశయ్య, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జడి లక్ష్మయ్య, మాజీ సర్పంచ్ వెచ్చహర గోపాల్, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దొడ్డ శేషాద్రి, కొప్పుల వెంకట సుబ్బారెడ్డి, తాతిరెడ్డి, మైనార్టీ నాయకుడు షేక్ మౌలిలి, తెలుగు యువత నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు దర్శనం సుధీర్, ఎస్సీ సెల్ మండల కార్యదర్శి ఎలకపాటి చెంచయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.


# రైతులకు మెరుగైన సేవలందించాలి






**తాళ్లూరు, ఆగస్టు 31, ప్రభాతవార్త**
రైతులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేయాలని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి,ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ చైర్మన్, టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు నూకసాని బాలాజీ మన్నేపల్లి సొసైటీచైర్మన్ గొంది రమణారెడ్డి(సమర)కు సూచించారు. ఒంగోలులోని వారి కార్యాలయాలలో ఆదివారంమన్నేపల్లి సొసైటీచైర్మన్ రమణారెడ్డిమాగుంటశ్రీనివాసులురెడ్డి, నూకసాని బాలాజీలను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించారు.ఇటీవల చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మండలంలో యూరియా కొరత విషయం ఎంపీ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించి వ్యవసాయశాఖ జేడీతో మాట్లాడారు. సానుకూలంగా స్పందించారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇడమకంటి వెంకటరెడ్డి, కాలేషా వలి(బడే), నాదెండ్ల శ్రీను, అనపర్తి ఎఫ్రయిమ్, అన్వర్ భాషా పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా గణేశ్ నిమజ్జనోత్సవాలు





**కురిచేడు, ఆగస్టు 31, ప్రభాతవార్త**
మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం నాడు గణేశ్ నిమజ్జనోత్సవాలు అట్టహాసంగా సాగాయి. మండల కేంద్రమైన కురిచేడులో గల శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఏర్పాటు చేసిన వినాయకునికి ఆదివారం నాడు నిమజ్జనోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి కమిటీ సభ్యులు స్వామివారిని ఒక ప్రత్యేక వాహనంపై ఆసీనులను చేసి, విచిత్రవేషధారణలు, వివిధ రకాల కళాకారుల ప్రదర్శనలతో ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు కళాకారులనృత్యాలు,ప్రదర్శనలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఎస్సై ఎం.శివ ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు చర్యలను తీసుకున్నారు.

## బోధనంపాడులో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ



**కురిచేడు, ఆగస్టు 31, ప్రభాతవార్త**
మండలంలోని బోధనంపాడు గ్రామంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమానికివైఎస్సీపీ శ్రేణులు నిర్వహించారు. ఇంటింటికి తిరిగి చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తు చేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు వైసీపీ నాయకులు మాట్లాడారు. సూపర్‌సిక్స్ పథకాలు పేరుతో టీడీపీ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. టీడీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో విస్తృత ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంజీవని వృద్ధాశ్రమంలో అభిషేక్ రెడ్డి జన్మదిన వేడుకలు

**గిద్దలూరు, ఆగస్టు 31, ప్రభాతవార్త**
గిద్దలూరు పట్టణంలోని పీఆర్ కాలనీలోగల అనాథ వృద్ధాశ్రమంలో పిడతల అభిషేక్ రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎవీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం కృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది అన్నదానం, ఆహార పదార్థాల పంపిణీ, కేక్ కటింగ్ కార్యక్రమాలు చేశారు. వృద్ధులకు భోజనం వడ్డించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్‌లు, సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు కొనకనమిట్లలో రెవెన్యూ సమస్యలపై సదస్సు

**కొనకనమిట్ల, ఆగస్టు 31, ప్రభాతవార్త**
కొనకనమిట్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం 10గంటలకు రెవెన్యూ సమస్యలపై జరిగే సదస్సులో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాల్గొంటారని టీడీపీ మండల కన్వీనర్ మూరబోయిన బాబూరావు తెలిపారు. ఎమ్మెల్యేకు రెవెన్యూ సంబంధించిన సమస్యలపై అర్జీలు ఇవ్వవచ్చని, పలు శాఖల అధికారులు కూడా హాజరవుతారని తెలిపారు.

# రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వ ధ్యేయం

### - ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి



**రాచర్ల, ఆగస్టు 31, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వం ధ్యేయమని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా రూ.1.22 కోట్ల నిధులతో మంజూరైన అభివృద్ధి పనులను ఆదివారం ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేస్తుందని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా మండలంలోని చోళ్లవీడు గ్రామంలో రూ.43.60లక్షలతో నూతన సచివాలయ భవన నిర్మాణం, రూ.24లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.20.80లక్షలతో హెల్త్ క్లినిక్ సెంటర్, రూ.34లక్షలతో అంతర్గత సిమెంట్ రోడ్లు నిర్మించడం జరిగిందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అశోక్ రెడ్డిని మండల టిడిపి నాయకులు, అధికారులు శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కటిక యోగానంద్,సొసైటీ బ్యాంకు ఛైర్మన్ గోపిరెడ్డి జీవనేశ్వర్ రెడ్డి, మండల ఎంపిడిఓ ఎస్ వెంకటరామిరెడ్డి, పంచాయితీ రాజ్ డిఈ ఎన్‌వి సుబ్బారెడ్డి, ఈఓఆర్‌డి ఐ వెంకటేష్, ఏఈలు సుబ్బారావు, ఈదుల రంగస్వామిరెడ్డి,స్థానిక టిడిపి నాయకులు బత్తిని రామకృష్ణ, బత్తిని రాజశేఖర్, బత్తిని వెంకటేశ్వరరావు, శిరిగిరి శ్రీనివాసులు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## గణనాధులను దర్శించుకున్న ఎమ్మెల్యే ముత్తుముల



**రాచర్ల, ఆగస్టు 31, ప్రభాతవార్త**
వినాయక చవితి వేడుకలలో భాగంగా మండలంలోని అనుములవీడు, చోళ్ళవీడు, అక్కపల్లి సురభేశ్వరకోన గ్రామాలలో ఏర్పాటు చేసిన వినాయక స్వామి మండపాలలో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి ఆయా వినాయక స్వామి కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను ఆయనకు అందజేశారు. అనుములవీడు గ్రామంలో ఎమ్మెల్యే అశోక్ రెడ్డికి మండల టిడిపి యువ నాయకులు అంబవరం శ్రీనివాసరెడ్డి, ఆయన అనుచరులు ఘనంగా స్వగతం పలికారు. ఈ కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షులు కటిక యోగానంద్, సొసైటీ బ్యాంక్ ఛైర్మన్ జీవనేశ్వర్‌రెడ్డి, నంది శ్రీను, డి.వెంకట రమణారెడ్డి, వి.శివరామిరెడ్డి, యామ సంజయ్, టి దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

### వినాయక లడ్డును రూ.1,95,195లకు కైవసం చేసుకున్న మరడ దిలీప్‌కుమార్




**గిద్దలూరు, ఆగస్టు 31, ప్రభాతవార్త**
గిద్దలూరు పట్టణంలోని సంజీవరెడ్డినగర్‌లో జరిగిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి 31వ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం నిమజ్జన కార్యక్రమంలో స్వామివారి లడ్డు వేలంపాటలో గిద్దలూరుకు చెందిన మరడ దిలీప్ కుమార్ రూ.1,95,195లకు స్వామివారి లడ్డును కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా నిమజ్జన కార్యక్రమంలో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొని లడ్డు విజేత మరడ దిలీప్ కుమార్‌కు స్వామివారి లడ్డును అందజేశారు. వేలంపాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొనగా లడ్డుకు లక్షల్లో ధర పలకడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

# రైతన్నల అభ్యున్నతికి ప్రధమ ప్రాధాన్యం

- సమన్వయంతో బాధ్యతగా పని చేయండి
- పొగాకు సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లా
- 100 కోట్లతో గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణం
- రూ.55 కోట్లు విడుదల వారంలో ఖాతాల్లోకి నగదు
- మార్కెట్ కమిటీ, పీఏసీఎస్, డీసీల సమావేశంలో ఎమ్మెల్యే ఏలూరి



**మార్టూరు, ఆగస్టు 31, ప్రభాతవార్త**
రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రధమ ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. సొసైటీ చైర్మన్‌లు డైరక్టర్లతో నీటి సంఘాల చైర్మన్లు, డీసీలతో మార్కెట్ యార్డు చైర్మన్,కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ గ్రామాల సమగ్రాభివృద్ధి ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. చివరి భూములకు సాగునీరు అందించేలా కాలువల అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. గత ఐదేళ్ల ఆయకట్టు రైతులకు నీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కాలువలను ఆధునీకరించామని ఐదేళ్ల పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. 2014లో ప్రతినిత్యం కాలువలపై తిరిగి చివరి భూములకు నీళ్ల అందించామని గుర్తు చేశారు. రైతులకు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. రైతులకు మార్కెట్ కమిటీ, పీఏసీఎస్, సాగునీటి సంఘాలు వెన్నుదన్నుగా నిలవాలన్నారు. రూ.100 కోట్లతో సీసీ రోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వంపై నమ్మకంతో ప్రజలు అఖండ మెజార్టీ ఇచ్చారని ప్రజల నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. 2029లో కూటమి ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గ్రామాల్లో నాయకులంతా సమన్వయంతో పని చేయాలని గ్రామాభివృద్ధికి తోడ్పడాలన్నారు. పార్టీకి ప్రభుత్వానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. రాజకీయాలకు అతీతంగా పొగాకు కొనుగోలు ప్రక్రియ సాగుతుందని ఎమ్మెల్యే ఏలూరి ఏలూరి వెల్లడించారు. పొగాకు రైతు సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లాలని, తక్షణమే రూ.55 కోట్ల విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని వెల్లడించారు.వారం రోజుల్లో ఈ నగదు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ఎమ్మెల్యే ఏలూరి వివరించారు.రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు.ఈ సందర్భంగా నూతన మార్కెట్ కమిటీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ, సంఘాల అధ్యక్షుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నూతనంగా పీఏసీఎస్ చైర్మన్‌లను శాలువాతో ఘనంగా సత్కరించారు.సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గుంజి వెంకట్రావు, మండల పార్టీ అధ్యక్షులు తాటి నాగేశ్వరరావు,నల్లపునేని రంగయ్యచౌదరి,నాయుడుహనుమంతరావు,పోదవీరయ్య,తిరుమలశెట్టి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## పవన్ మృతి పట్ల ఎమ్మెల్యే ఏలూరి దిగ్భ్రాంతి

**మార్టూరు, ఆగస్టు 31, ప్రభాతవార్త**
చింతపల్లిపాడుకు చెందిన తెలుగు ప్రొఫెషనల్ వింగ్ పర్చూరు నియోజకవర్గ అధ్యక్షుడు వేంపరాల జితేంద్ర పవన్ కుమార్ మృతి పట్ల ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పవన్ మృతి పట్ల ఎమ్మెల్యే ఏలూరి సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన మరణం తీవ్ర విచారకరమన్నారు. తెలుగుదేశం పార్టీ అభ్యున్నతి కోసం, తెలుగు ప్రొఫెషనల్ వింగ్ అభివృద్ధి కోసం విశేష కృషి చేశారని గుర్తు చేశారు. ప్రొఫెషనల్ వింగ్‌లో పవన్ చురుగ్గా పాల్గొన్నాడని, ఆయన మరణ వార్తను జీర్ణించుకోలేకపోతున్నట్లు వెల్లడించారు. పవన్ మృతి కుటుంబ సభ్యులకు, తెలుగుదేశం పార్టీకి తీరని లోటు అన్నారు. పవన్ ఆత్మకు శాంతి కలగాలని దేవుని ప్రార్థించారు. ఆయన కుటుంబ సభ్యులకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందన్నారు.

## పెన్షన్ల పంపిణీలో ప్రతి నాయకుడు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

### - టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి



**హనుమంతునిపాడు, ఆగస్టు 31, ప్రభాతవార్త**
రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు, శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సూచనల మేరకు నేడు అనగా సోమవారం జరిగే పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో సచివాలయ సిబ్బందితో గ్రామ పార్టీ అధ్యక్షులు/ క్లస్టర్, యూనిట్, బూత్, సెక్షన్ ఇన్‌ఛార్జీలు/ రాష్ట్ర , జిల్లా పార్టీ పదవుల్లో ఉన్న నాయకులు, మహిళలు అందరూ ఆయా సచివాలయం పరిధిలో ఇంటింటికి వెళ్ళి పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

## గుంటి గంగా భవానీ అమ్మవారికి ప్రత్యేక పూజలు



**తాళ్లూరు, ఆగస్టు 31, ప్రభాతవార్త**
మండలంలోని తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడు గ్రామంలో వెలసిన జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం గుంటి గంగా భవానీ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారిలు మెట్టెల బాలరాజు, పుచ్చకాయల విజయలక్ష్మీ అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు ఎన్.కామేశ్వరశర్మ,అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు, పొంగళ్లు సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన అమ్మవారిని దర్శించుకోవడానికి జిల్లాతో పాటు పలు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు పొంగళ్లు పెట్టి, జంతు బలులిచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయ పక్కన ఉన్న పుట్ట, నాగ శిలలకు భక్తులు పూజలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఆర్ఏ కాటూరి ప్రసాదు సిబ్బంది పర్యవేక్షించారు. అలాగే దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

# ఊరూరా గణేష్ నిమజ్జనోత్సవాలు

### - హోరెత్తిన యువకుల నృత్యాలు


**కొనకనమిట్ల, ఆగస్టు 31, ప్రభాతవార్త**
మండలంలో ఊరూరా గణేష్ నిమజ్జనోత్సవాల సందడి ఆదివారం హోరెత్తించింది. మండల కేంద్రం కొనకనమిట్ల స్టేషన్‌పల్లిలో యాదవ్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి నాలుగు రోజులు పూజల అనంతరం నిమజ్జనానికి తరలించేందుకు ఊరేగింపు నిర్వహించారు. రాత్రి 11గంటల వరకు యువకులు,మహిళలు, పెద్దలు గులాములు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు.జై గణేష్ మహారాజ్ జై అంటూ భక్తిని చాటుకుంటూ ఊరేగింపు నిర్వహించారు. ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం కొత్తపట్నం సముద్రం వద్దకు విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు.నాగిరెడ్డిపల్లి ఎస్సీకాలనీలో వినాయక నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. చిన్నారికట్లతో పాటు వివిధ గ్రామాలలో నిమజ్జనోత్సవం వైభవంగా జరిగింది.

### ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఘనంగా గణపతి నవరాత్రి వేడుకలు



**సంతనూతలపాడు, ఆగస్టు 31, ప్రభాతవార్త**
సంతనూతలపాడులోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం రాత్రి ఘనంగా గణపతినవరాత్రి వేడుకలు జరిగాయి. అర్చకులు నేలబట్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 27వ తేదీ నుండి గణపతి నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం నాడు విగ్రహ దాత క్లాత్ మర్చంట్ నేతలు నల్లమల్లి శ్రీనివాసరావు, చేబ్రోలు బ్రహ్మయ్య, గందే కిషోర్‌బాబు, శిఘాకొల్లి హరినారాయణ, పద్మనాభుని ప్రసాదరావు, కారంశెట్టి సమీర్ కుమార్, కురిచేటి సురేష్‌లు ఆదివారం నాడు ఉభయ దాతలుగా వ్యవహరించారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపం కమిటీ ఆధ్వర్యంలో ఈ గణపతి నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రతి ఏడాది ఈ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అనంతరం అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు.

## పఠాన్ ఇమ్రాన్ వివాహ వేడుకలో పాల్గొన్న నాయకులు



**నాగులుప్పలపాడు, ఆగస్టు 21, ప్రభాతవార్త**
అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు పఠాన్ ఇమ్రాన్, అమ్రిన్‌ల రిసెప్షన్ వేడుక ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరి రవి, నాగులుప్పలపాడు మండల పార్టీ అధ్యక్షులు పోలవరపు శ్రీమన్నారాయణ, నాగులుప్పలపాడు మండలం ఎంపీపీ దంపతులు అంజమ్మ కృష్ణారెడ్డి, రాష్ట్ర మేధావుల సంఘం ప్రధాన కార్యదర్శి కంచర్ల సుధాకర్, బొట్ల రామారావు, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి పాలడుగు రాజీవ్, రాష్ట్ర గ్రీవెన్స్ సెక్రటరీ పేరాల చెన్నకేశవులు, మండల యువజన అధ్యక్షులు ఇమ్మిశెట్టి బాలకృష్ణ, మండల పార్టీ ఉపాధ్యక్షులు కాటూరి ఆదియ్య, ప్రకాశం జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు పోలినేని కోటేశ్వరరావు, రైతు విభాగ అధ్యక్షులు మారెళ్ల బంగారుబాబు, మండల రైతు విభాగ అధ్యక్షులు తగిరిస సుబ్బారావు, పంచాయతీ రాజ్ వింగ్ కాట్రగడ్డ శ్రీనివాసరావు, ఉప్పుగుండూరు గ్రామ పార్టీ అధ్యక్షులు మాదాసు రాంబాబు, పోతవరం గ్రామ సర్పంచ్ శీలం సురేష్, మట్టిగుంట గ్రామ సర్పంచ్ పాలేరు నాగేశ్వరరావు, వినోద్, రాయునిపాలెం గ్రామ సర్పంచ్ ఘట్టంనేని అశోక్, జనరల్ సెక్రటరీ కుక్కల గోపిరెడ్డి, జెట్టి శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ జాయింట్ సెక్రటరీ దుడ్డు వినోద్ కుమార్, మైనార్టీ సెల్ అధ్యక్షులు రజాక్ బేగ్, రాష్ట్ర వికలాంగుల విభాగం కాట్రగడ్డ శ్రీనివాసరావు, అమ్మనబ్రోలు గ్రామ సర్పంచ్ బత్తుల రవీన, ఐటీ వింగ్ కొల్లూరి కోటయ్య, కాటూరి యాకోబు, కనపర్తి కనకయ్య, కంచల్ల యుదారాజు, కవిల వంశీ, పోలినేని వెంకటరావు, చిన్న కత్తుల రాజేష్, బాపట్ల సాయి, నరపరెడ్డి, చాట్ల సామేల్, అత్తి, తోకల శ్రీనివాసరావు, ఎడవల్లి మోహన్‌రావు, తోటపల్లి రామస్వామి, శేషుబాబు, మార్పలా కోటిరెడ్డి, పులుగు నాగాజురెడ్డి, ఆవులూరి రాఘవులు, జేయంతి బాబు, శ్రీను, తెళ్ళ సల్మానరాజు, మదర్, బత్తుల కొండయ్య, జబ్బార్, గురిజాల యోహాను, తోరిటి అంకయ్య, పారి మార్క్, కంచల్ల నైసోను, నాయకులు పాల్గొన్నారు.

## పరిటాల నాగేశ్వరరావు మృతికి నాయకుల నివాళి



**టంగుటూరు, ఆగస్టు 31, ప్రభాతవార్త**
టంగుటూరు మాజీ టీడీపీ నాయకుడు పరిటాల నాగేశ్వరరావు స్వర్గస్తులయ్యారు. వారి భౌతికకాయానికి టంగుటూరు మాజీ ఎంపీపీ టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు చదలవాడ చంద్రశేఖర్,టంగుటూరు సొసైటీ అధ్యక్షులు మక్కెన హరిబాబు, టీడీపీ సీనియర్ నాయకులు బెజవాడ వెంకటేశ్వర్లు, బోర్డు మురళిలు నివాళులర్పించారు.

## గణపతి వేడుకల్లో పాల్గొన్న ముస్లిం సోదరులు





**పామూరు, ఆగస్టు 31, ప్రభాతవార్త**
పామూరు పలు మండపాల్లో గణేష్‌ని ఉత్సవాల్లో పాల్గొన్న ముస్లిం సోదరులు స్థానిక కన్యకా పరమేశ్వరి దేవస్థానం వద్ద ఆకుపాటి నివాసం వద్ద ఏర్పాటు చేసిన మండపం వద్దముసిలం నాయకులు గణేష్‌ని పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హాజీ గౌస్ మాట్లాడుతూ మనమంతా ఐక్యమత్యంగా పండుగ నిర్వహించుకోవాలని గణనాథుని దివ్య ఆశీస్సులతో సిరి సంపదలతో సుఖ సంతోషాలతో నిండూ నూరేళ్ల జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ముస్లిం సోదరులకు ఆకుపాటి వెంకటేష్, ఆర్యవైశ్య సోదరులు కండువాలు వేసి ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో షేక్ హాజీ గౌస్, కోడిగుంపల నాయబ్ రసూల్, సలాం,షేక్ ఖాజా మొహద్దిన్,చాంద్‌భాషా పాల్గొన్నారు.

## చప్పరం వాసుని ఘనంగా సన్మానించిన ఆర్యవైశ్యులు



**కనిగిరి, ఆగస్టు 31, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది చప్పరం వాసు శనివారం తాళ్లూరి కళ్యాణ మండపం వద్ద కొలువుదీరిన శ్రీ వినాయక స్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్యులు ఆయనకు ఘనమైన సన్మానం చేశారు. ఈ సందర్భంగా వినాయకుడి తీర్థ ప్రసాదాలు అందజేస్తూ చప్పరం వాసు కుటుంబ సభ్యులు ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఆనందంగా ఉండాలని, అభివృద్ధి కార్యక్రమాల్లో ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు గొల్ల భాస్కరరావు, కారంశెట్టి వెంకట సుబ్రహ్మణ్యం, తడవర్తి సురేష్, బచ్చు శ్రీను, తాళ్లూరి వెంకటేశ్వర్లు, తాళ్లూరి రామసుబ్బయ్య, చిన్న బాబు, తాళ్లూరి చెంగాలయ్య, కోటకొండలు, కోట నాగరాజు, కంచర్ల సురేష్, కంచర్ల నరేష్, కంచర్ల శ్రీను, తాళ్లూరి సాయి, ఒగ్గు రాము తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కొత్తపేట గణపతి దర్శనానికి వైసీపీ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణ యాదవ్




**కనిగిరి, ఆగస్టు 31, ప్రభాతవార్త**

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపేట 16వ వార్డులో ఏర్పాటు చేసిన గణేష్‌మండపాన్ని వైఎస్సార్‌సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా గణపతికి ప్రత్యేక పూజలు చేసి, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. తరువాత గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు దద్దాలను దుశ్శాలువా వేసి ఘనంగా సన్మానించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో షేక్ అబ్దుల్ గఫార్, మడతల కస్తూరిరెడ్డి, పులి శ్రీనివాసులురెడ్డి, సూరసాని మోహన్‌రెడ్డి, ఒకే రెడ్డి,ఆవుల భాస్కర్‌రెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, పిల్లిలక్ష్మీనారాయణరెడ్డి, చిలకలశివరామిరెడ్డి,దరిశి సుబ్రహ్మణ్యం,మడతల నాగిరెడ్డి, డాక్టర్ ఆవులకృష్ణారెడ్డి, పలుకూరిభాస్కర్, మూలేరాజశేఖర్‌రెడ్డి,రామసుబ్బారెడ్డి,గొడి నారాయణరెడ్డి, వీరంద్రారెడ్డి, సుబ్బారెడ్డి,రామ చంద్రారెడ్డి, దేవిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరుడి దయతో ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించిన ఇన్‌ఛార్జీ దద్దాల

**కనిగిరి, ఆగస్టు 31, ప్రభాతవార్త**



కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు కాశీనాయన గుడి వద్ద ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని ఆదివారం సందర్శించిన కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణ యాదవ్ విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలిపూజ అందుకునే గణనాథుని కృపా కటాక్షాలు ఎల్లప్పుడూ నియోజకవర్గ ప్రజలపై ఉండాలని,ప్రజలందరూ ఎటువంటి విఘ్నాలులేకుండా సుఖశాంతులతో, ఆనందభరిత జీవనాన్ని గడపాలని మనసారా ప్రార్థించాను అని తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు దద్దాల నారాయణ యాదవ్‌ని దుశ్శాలువాతో ఘనంగా సన్మానించి, స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో షేక్ అబ్దుల్‌గఫార్, మడతల కస్తూరిరెడ్డి, సూరసాని మోహన్‌ఎడ్డి, పెద్దిరెడ్డి ఒకే రెడ్డి, ద్రోనాదుల చెంచులు, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, పిల్లి లక్ష్మీనారాయణరెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గణనాథుని నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న శిద్దా సుధీర్ కుమార్



**దర్శి, ఆగస్టు 31, ప్రభాతవార్త**

వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా దర్శిలోని కురిచేడు రోడ్డులో డీవీఎస్ నగర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని నిమజ్జన పూజా కార్యక్రమంలో యువ నాయకులు శిద్దా సుధీర్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీవీఎస్ నగర్ యూత్ శిద్దా సుధీర్ కుమార్‌ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శిద్దా అభిమానులు, డీవీఎస్ నగర్ యూత్ పాల్గొన్నారు. అదే విధంగా దర్శి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జన పూజ కార్యక్రమంలో పాల్గొని అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న శిద్దా సుధీర్ కుమార్. అనంతరం ఆర్యవైశ్య ప్రముఖులు, యువజన సంఘం నాయకులు శిద్దా సుధీర్ కుమార్‌ని ఘనంగా సన్మానించారు.

## గర్ల్స్ హైస్కూల్ రోడ్డు గణేష్ లడ్డూ రూ.46 వేలకే

**కనిగిరి, ఆగస్టు 31, ప్రభాతవార్త**



కనిగిరి పట్టణంలోనిగర్ల్స్ హైస్కూల్‌లో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో లడ్డు వేలం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పేరబోయిన పుల్లారావు రూ.36 వేలకు పాట పాడి లడ్డును దక్కించుకున్నారు. ఈ ఉత్సవానికి విగ్రహ దాతగా మాజీ కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ చిన్నమస్తాన్,కి.శేముంతాజ్ బేగం,అధినేతలు వ్యవహరించారు. అనంతరం గణేష్ నిమజ్జన వేడుకలు వైభవంగా జరికి భక్తశ్రద్ధలతో ప్రజలు పాల్గొన్నారు.

## నాగబాబును సన్మానం చేసిన దేవకి, పెనుగొండ

**కనిగిరి, ఆగస్టు 31, ప్రభాతవార్త**



జనసేన పార్టీ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో మూడు రోజుల పాటు జరుగుతున్న సేనతో సేనాని కార్యక్రమంలో ఏపీ వాసవి సత్ర సముదాయ అధ్యక్షుడు దేవకి వెంకటేవ్వర్లు, రాష్ట్ర జనసేన నాయకులు, ఆర్యవైవ్య మహాసభ గౌరవ అధ్యక్షులు పెనుగొండ సుబ్బరాయుడు పాల్గొనడం జరిగింది. ఈనేపథ్యంలో వీరద్దరూ జనసేన నాయకులు ఎమ్మెల్సీ నాగబాబుకు వాలువా కప్పి మర్యాదపూర్వకంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లో విస్తృతంగా చాటాలని పిలుపునిచ్చారు. దీనికి తమ వంతు కృషి చేస్తామని దేవకి వెంకటేశ్వర్లు, పెనుగొండ సుబ్బరాయుడు హామీ ఇచ్చారు.

## వినాయకుడి నిమజ్జన పూజ కార్యక్రమం పాల్గొన్న శిద్దా సుధీర్ కుమార్



**ఒంగోలు,ప్రభాతవార్త**



దర్శి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి నిమర్జన పూజ కార్యక్రమం పాల్గొని అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ శిద్దా సుధీర్ కుమార్ గారు అనంతరం ఆర్యవైశ్య ప్రముఖులు యువజన సంఘం నాయకులు శిద్దా సుధీర్ కుమార్‌ని ఘనంగా సన్మానించారు.

## సూర్యకళ్యాణ్ చక్రవర్తికి సన్మానం

**ముండ్లమూరు, ఆగస్టు 31, ప్రభాతవార్త**



అంచలంచలుగా యువ కెరటం వల్లె దూసుకుపోతున్న బీజేపీ రాష్ట్ర సెల్స్ కన్వీనర్‌గా ఎంపికైన యువ కిషోరం నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తిని జిల్లా అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసులు పలు మండలాల బీజేపీ అధ్యక్షులు ముండ్లమూరు మందలపు వెంకట శేషయ్య దొనకొండ మూడమంచు మునేయ్య యాదవ్ కురిచేడు కూరంగా నాగేశ్వరరావు, దర్శి రూరల్ నాగసాయి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కళ్యాణ్ చక్రవర్తిని తన కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించి అభినందించారు. జిల్లాలో బీజేపీ బలోపేతానికి కంకణం కట్టుకుని పని చేయటం జరుగుతుందని వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

**దర్శి, ఆగస్టు 31, ప్రభాతవార్త**



దర్శి మండంలోని కొత్త వెంకటాపురం గ్రామంలో ఆదివారం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేస్తుందని, ఇచ్చిన హామీలను పూర్తి నెరవేర్చడంలో వైఫల్యం చెందిందని వైసీపీ ప్రభుత్వంలో జగనన్న ఇచ్చిన హామీలు అన్ని అమలు చేసిన ఘనత జగనన్నదని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి మండల పార్టీ అధ్యక్షులు వెన్నపూస వెంకటరెడ్డి, రాష్ట్ర మున్సిపల్ వింగ్ ప్రధాన కార్యదర్శి కుమ్మిత అంజిరెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, 5వ వార్డు కౌన్సిలర్, నియోజకవర్గ మున్సిపాలిటీ అధ్యక్షులు బాబు, మాజీ సర్పంచ్ మానికొండ వెంకయ్య, బాదం వెంకట రెడ్డి, జింకల అంజిరెడ్డి, సుబ్బారెడ్డిలు పాల్గొన్నారు.

**జింకల వారి ఫంక్షన్‌కి హాజరైన బూచేపల్లి :**

దర్శి మండలం తూర్పు వెంకటాపురం గ్రామంలో ఆదివారం జింకల శ్రీనివాసరెడ్డి కుమార్తె ఫంక్షన్‌కి హాజరైన హాజరైన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ. ఈ సందర్భంగా చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంపీ మాగుంట







**ఒంగోలు, ప్రభాతవార్త**

ఆదివారం ఒంగోలులో నిర్వహించిన పలు కార్యక్రమాలో పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. ఒంగోలులోని రాంనగర్2 వ లైన్‌లో అంజిరెడ్డి వారి మిత్ర బృందం నిర్వహించు గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నారు. రాజధాని సెంటర్లో రాజమతా టవర్స్‌లో శ్రీ రాజమాత సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ నవరాత్రిఉత్సవాల్లో పాల్గొన్నారు. అదే విధంగా రాజపానగల్ రోడ్డు తూము సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన, కొణిజేడు బస్టాండ్ సెంటర్‌లో దండె సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన, కోర్టు సెంటర్, ఇందిరాగాంధీ బొమ్మ దగ్గర గోల్డ్‌అండ్ సిల్వర్ వర్కర్స్ అసోసియేషన్, పత్తివారి వీధిలో నిర్వహించిన గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఈ నెల 1నుండి 30 పోలీసు యాక్ట్ అమలు

**టంగుటూరు, ఆగస్టు 31, ప్రభాతవార్త**

శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలో ఈనెల 1 నుండి 30వ తేదీ వరకు 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉంటుందని ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కాల వ్యవధిలో ప్రజా సంఘాలు, కార్మిక, యూనియన్లు రాజకీయ పార్టీలు, ఇతర సంస్థలు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు ర్యాలీలు లేదా ధర్నాలు నిర్వహించకూడదని డీఎస్పీ తెలిపారు. ఏదైనా కార్యచరణ నిర్వహించాలనుకుంటే సంబంధిత పోలీసు ఉన్నతాధికారుల నుండి ముందస్తు అనుమతి తీసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు. ఆయన వెంట ఎస్సై నాగమల్లేశ్వరరావు ఉన్నారు.

## మంత్రిని కలిసిన మండల నాయకులు





**పొన్నలూరు, ఆగస్టు 31, ప్రభాతవార్త**

రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖా మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామిని తూర్పు నాయుడుపాలెంలోని కాంపు కార్యాలయంలో పలువురు మండల నాయకులు, కార్యకర్తలు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి పాలెం గ్రామానికి చెందిన నూతలపాటి మాలకొండయ్యకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. అదేవిధంగా పలు గ్రామాల నాయకులు కొన్ని సమస్యలు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అనుమోలు సాంబయ్య, మండల నాయకులు మండవ ప్రసాద్, కర్ణాకోటిరెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏపీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీపై కూటమి ప్రభుత్వం క్లారిటీ

**దొనకొండ,ఆగస్టు 31,ప్రభాతవార్త**

అర్హులైన వారందరికీ సెప్టెంబర్ 1న పింఛన్లు పంపిణీ చేస్తామని తెలిపింది. అనర్హులను గుర్తించడానికే నోటీసులు జారీ చేశామని వెల్లడించింది. అయితే వైకల్యం 40 శాతం కంటే తక్కువగా ఉన్నవారికి, ఆరోగ్యంగా ఉండి కూడా రూ.15 వేలు పొందుతున్న వారికి ప్రభుత్వం ఇటీవల నోటీసులు పంపింది. అయితే నోటీసులు పొందివారిలో ఎవరైతే అప్పీల్ చేసుకుంటారో వారికి పింఛన్ అందుతుందని తెలిపింది.

## ముండ్లమూరు ఎంఈఓ-2 కొర్నపాటి వెంకటేశ్వర్లు పదవీ విరమణ సభ

**ముండ్లమూరు, ఆగస్టు 31, ప్రభాతవార్త**



ముండ్లమూరు ఏపీమోడల్ స్కూల్ ప్రాంగణంలో ఆదివారం ఎంఈఓ-2 కొర్నపాటి వెంకటేశ్వర్లు పదవీ విరమణ మహోత్సవ సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగావిద్యాశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, సంఘ ప్రతినిధులు ఇతర మండల ఎంఈఓలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ-1 కాలేశ్ వలి మాట్లాడుతూ కొర్నపాటి వెంకటేశ్వర్లు తన పదవీ కాలమంతా మండల విద్యారంగానికి ఎనలేని సేవలు అందించారు. ఆయన కృషి విద్యా చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అంబటి చిన్న వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు బేతపూడి లింగారావు, షేక్ కందునూరు మస్తాన్‌వలి, బి.హనుమంతరావు, చిట్టెటి భాగ్యలక్ష్మీ, గానుగపాటి ఎలీషా, అలాగే ఏపీటీఎఫ్ ముండ్లమూరు మండల అధ్యక్షులు గోపాలం శ్రీనివాసరావు ప్రసంగించారు. వారు మాట్లాడుతూ వెంకటేశ్వర్లు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల ప్రగతి పట్ల ఆయన చూపిన శ్రద్ధ మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు విద్యాశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు ని సన్మానించి, ఘనంగా వీడ్కోలు పలికారు. సభలో స్నేహపూర్వక వాతావరణం నెలకొంది.

## ఘనంగా చిన్ని శ్రీనివాసరావుకు సన్మానం



**అద్దంకి,ఆగస్టు 31,ప్రభాతవార్త**

స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా చిన్ని శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానము నందు అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి,ఉపాధ్యక్షులు,కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో చిన్ని శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు.

## సంగా తిరుపతిరావుకి డాక్టరేట్ అవార్డు

**దర్శి, ఆగస్టు 31, ప్రభాతవార్త**





దర్శి పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సూంగా తిరుపతిరావుకి ప్రతిష్ఠాత్మకమైన డాక్టరేట్ అవార్డు పట్టాని ఆయన అందుకున్నారు. అమెరికన్ ఉషడం పేస్ యూనివర్సిటీలో అవార్డు మెమొరీ అసోసియేట్ ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ రియాల్టి బుక్ ఆఫ్ వరల్డ్ సంయుక్తంగా నిర్వహించిన అవార్డును అందుకున్నారు. ఈయనకు అవార్డు రావడానికి గల కారణాలు గతంలో చేసిన ప్రజా సంఘ సేవలకు శాసన సేవలకు అవార్డు ఇవ్వడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ నుండి సంగా తిరుపతిరావుకి మాత్రమే ఈ అవార్డు దక్కడం విశేషం. అవార్డు తమిళనాడులోని హోసూరులో ప్రముఖులు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈయన గతంలో ఎస్సీ పల్లెల్లో అనేకమైన సోషల్ సర్వీసులు యువకుడిగా ఉన్నప్పుడు నుండే చేస్తుండగా ఆయన సేవలు గుర్తించి ఈ అవార్డు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డు రావడం పట్ల ఎంతో సంతోషంగా ఉందని అంతే కాకుండా తనపై ఎంతో బాధ్యత పెరిగిందన్నారు. అంతే కాకుండా ప్రతి ఒక్కరు సమాజ సేవలో పాల్గొనాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. సంగా తిరుపతిరావుకి డాక్టరేట్ రావడం పట్ల శ్రేయోభిలాషులు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.

## దర్శిలో ఘనంగా వినాయకుని నిమజ్జన వేడుకలు

**- సెంటర్లో ప్రతిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిన సీఐ రామారావు, ఎస్సై ఎం.మురళి**





**దర్శి, ఆగస్టు 21, ప్రభాతవార్త**

దర్శి పట్టణంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాలు ఐదు రోజులు పాటు పూజలు అందుకుని పట్టణంలో అంగరంగ వైభవంగా వినాయకుని ఊరేగింపు కార్యక్రమాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కువ వినాయకుని విగ్రహాలు ఊరేగింపులు ఆదివారం సాయంత్రం జరగగా దర్శి గడియారస్తంభం సెంటర్లో ఎలాంటి ట్రాఫిక్ లేకుండా అన్ని ఊరేగింపు కార్యక్రమాల్ని మూడు రోడ్ల కూడలి ఎటువైపు అటు ప్రజలకి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనదారులని ఆలస్యం కాకుండా ప్రతిష్ట బందోబస్తుని దర్శి పోలీసులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వినాయకుని భక్తులు దర్శి పోలీసులు పాల్గొన్నారు.





నిమజ్జన మహోత్సవ కార్యక్రమంలో ఒంగోలు నగరంలో ఊరేగింపుతో తరలి వెళుతున్న గణపతులు

# భారత్‌పై ఆంక్షలు విధించండి..

## ఐరోపా యూనియన్‌ను కోరిన అమెరికా



**బ్రస్సెల్స్, ఆగస్టు 31:** రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడాన్ని బూచిగా చూపి భారత్ పై భారీగా సుంకాల భారాన్ని మోపిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమలాగే భారత్‌ను లక్ష్యంగా చేసుకోవాలని యూరప్ దేశాలను కోరినట్లు సమాచారం. ప్రస్తుతం భారత దిగుమతులపై అమెరికాలో 50 శాతం టారిఫ్‌లు అమలులో ఉన్నాయి. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. మాస్కో నుంచి చమురు కొనుగోలు చేయడం ఆపకపోతే అమెరికా మాదిరిగానే భారత్‌పై సుంకాలను పెంచాలని ట్రంప్ యంత్రాంగం యూరప్ దేశాలను కోరినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఆంక్షలు విధించడంతోపాటు భారత్ నుంచి చమురు, గ్యాస్ కొనుగోలును నిలిపివేయాలని కోరినట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపే విషయంపై చర్చించేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఇటీవల ట్రంప్ భేటీ అయ్యారు. యుద్ధం ముగించేందుకు అగ్రరాజ్యాధిపతి తీసుకుంటున్న చర్యలకు కొంతమంది యూరోపియన్ నాయకులు మద్దతు పలికినట్లు సమాచారం. అయితే భారత్‌కు వ్యతిరేకంగా ట్రంప్ తీసుకున్న కఠిన నిర్ణయాలపై యూరోపియన్ దేశాలు మోనంగా ఉన్నాయి. సుంకాలు విధించడాన్ని సమర్థించలేదు. అలా అని తప్పుబట్టలేదు. ఈ క్రమంలో భారత్‌ను లక్ష్యంగా చేసుకోవాలని ట్రంప్ పరిపాలనాధికారులు కోరడం గమనించాల్సిన విషయం. భారత్ నుంచి చమురు, సహజ వాయువు కొనుగోళ్లను పూర్తిగా నిలిపివేయాలని, అమెరికా తరహాలో ఆంక్షలు విధించాలని శ్వేత సౌధం కోరినట్టు ప్రచారం జోరుగా సాగుతోంది. రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేయని పక్షంలో రెండో దశ సుంకాలను విధించాలని కూడా సూచించినట్టు సమాచారం. తమపై 50 శాతం సుంకం విధించడాన్ని భారత్ తొలి నుంచీ వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. రష్యా చమురును అత్యధికంగా కొనుగోలు చేస్తున్న చైనాను వదిలి తమపై సుంకాలు విధించడం ఏంటని భారత్ ప్రశ్నిస్తోంది. ఐరోపా దేశాలు కూడా రష్యా సహజవాయువును కొనుగోలు చేస్తున్న తీరును భారత్ లేవనెత్తింది. ఇక రష్యా ఉక్రెయిన్ యుద్ధం ముగించాలన్న ట్రంప్ ప్రయత్నాలకు కొందరు ఐరోపా నేతలు బహిరంగంగా మద్దుతు పలుకుతూ తెర వెనుక మాత్రం పూర్తిగా విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని శ్వేత సౌధం భావిస్తోంది. రష్యా చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై అమెరికా మండిపడుతున్నా ఐరోపా దేశాలు మాత్రం మౌనం వహించాయి. ట్రంప్ సుంకాల విధింపునకు బహిరంగంగా ఎలాంటి మద్దతు ప్రకటించలేదు. 'ఐరోపా నేతల విషయంలో శ్వేత సౌధం సహనం నశిస్తోంది' అని ఓవల్ ఆఫీసు ఉన్నతాధికారి ఒకరు కామెంట్ చేశారు. మరింత మెరుగైన డీల్ కోసం వేచి చూడాలని ఉక్రెయిన్ అధ్యక్షుడిని తెర వెనక ఉండి ఐరోపా దేశాలు ప్రోత్సహిస్తున్నట్టు వైట్ హౌస్ వర్గాలు భావిస్తు న్నాయి. ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోడీ షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సమావేశంలో పాల్గొనేందుకు చైనాలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో చైనా, రష్యా అధ్యక్షు లతో ప్రత్యేకంగా చర్చలు జరిపే అవకాశం ఉన్న ట్టు తెలుస్తోంది. ఈ చర్చల్లో ట్రంప్ సుంకాలు, రష్యా ఉక్రెయిన్ యుద్ధం ప్రధాన అంశాలుగా ఉండనున్నాయని సమాచారం.



## భారత్ క్వాడ్‌సదస్సుకు ట్రంప్ డుమ్మా..

### తాజా పరిణామాల నేపథ్యంలో మనసు మార్చుకొన్న అమెరికా అధ్యక్షుడు

**న్యూఢిల్లీ,ఆగస్టు 31:** అమెరికా, భారత్ మధ్య సంబంధాలు బాగా దెబ్బతిన్న నేపథ్యంలో న్యూయార్క్ టైమ్స్ ప్రచురించిన కథనాలు మరింత సంచలనంగా కలిగించాయి. భారత్‌లో పర్యటించాలన్న ప్లాన్‌ను ట్రంప్ తాజాగా పక్కన పెట్టేసినట్టు న్యూయార్క్ టైమ్స్ తన కథనంలో పేర్కొంది. సెప్టెంబర్-డిసెంబర్ మధ్య కాలంలో క్వాడ్ సమావేశాల కోసం భారత్‌లో పర్యటిస్తానని ట్రంప్ గతంలో ప్రధాని మోదీకి చెప్పారట. ఆ తరువాత జరిగిన పరిణామాల నేపథ్యంలో ఈ ప్లాన్స్‌ను పక్కన పెట్టేశారట. అయితే, ఈ విషయమై అటు అమెరికా, ఇటు భారత్ స్పందించలేదు. త్వరలో భారత్ వేదికగా క్వాడ్ కూటమి శిఖరాగ్ర సమావేశం జరగనుంది. ఇక ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన మరుసటి రోజే అమెరికాలో క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం జరిగింది. అమెరికా, భారత్ మధ్య వాణిజ్య ప్రతిష్టంభన నెలకొందని న్యూయార్క్ టైమ్స్ రాసుకొచ్చింది. డొనాల్డ్ ట్రంప్, నరేంద్ర మోదీల సంబంధాలు కూడా తిరోగమనంలో ఉన్నాయని పేర్కొంది. భారత్, పాక్ మధ్య రాజీ కుదిర్చానన్న ట్రంప్ ప్రకటనతో వివాదం ముదిరిందని న్యూయార్క్ టైమ్స్ వెల్లడించింది. 'తనే రాజీ కుదిర్చానని ట్రంప్ పదే పదే చెప్పడం ప్రధాని నరేంద్ర మోదీకి కోపం తెప్పించింది. ట్రంప్ తీరుతో మోడీ సహనం నశిస్తోంది' అని తెలిపింది. ఇక కెనడాలో ఇటీవల జరిగిన జీ7 సమావేశాలకు అటు ట్రంప్ ఇటు ప్రధాని మోదీ ఇద్దరూ హాజరయ్యారు. ఆ సందర్భంగా ఇద్దరి మధ్య సమావేశం కూడా జరగాల్సి ఉంది. అయితే, ట్రంప్ అత్యవసరంగా అమెరికాకు వెనుదిరగాల్సి వచ్చింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని మోదీతో దాదాపు 35 నిమిషాలపాటు ఫోన్ కాల్‌లో మాట్లాడారట. ఈ సందర్భంగా భారత్‌పాక్ మధ్య మూడోదేశం మధ్యవర్తిత్వం అంగీకరించబోమని ప్రధాని మోడీ స్పష్టం చేసినట్టు తెలిసింది. నోబెల్ ప్రైజ్‌కు పాక్ తనను నామినేట్ చేస్తున్న విషయాన్ని కూడా ట్రంప్ ఆకాల్‌లో పేర్కొన్నారని, భారత్ కూడా ఇదే చేయాలన్న పరోక్ష సూచనచేశారని న్యూయార్క్ టైమ్స్ రాసుకొచ్చింది. ఈ కారణంగా ఇరు నేతల మధ్య ఎడం పెరిగినట్టుతెలిపింది. ఈ ఫోన్ కాల్‌కు సంబంధించి అమెరికా ఇంతవరకూ స్పందించలేదు.

# మహాకూటమి సిఎం అభ్యర్థిని నేనే..

## రాహుల్, అఖిలేష్ సమక్షంలోనే ప్రకటించిన తేజస్వి



**పాట్నా,ఆగస్టు 31:** బీహార్‌లో మహా ఘట్‌బంధన్ కూటమి సీఎం అభ్యర్థి తానే అని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ప్రకటించారు. ఆరా జిల్లాలో 'ఓట్ అధికార్ యాత్ర' కార్యక్రమంలో భాగంగా ఈ వ్యాఖ్యలు చేశారు. అదేవేదికపై రాహుల్ గాంధీ, అఖిలేశ్ యాదవ్‌లు ఉన్నా తేజస్వి వ్యాఖ్యలు సంచలనం కలిగించాయి. సీఎం అభ్యర్థిని తానేనంటూ తేజస్వీ యాదవ్ వారి సమక్షంలో ప్రకటించగా వారు మాత్రం చప్పుడు చేయలేదు. ముఖ్యంగా రాహుల్ గాంధీ మాత్రం దీనిపై నోరు మెదపలేదు. అలాగే నితీశ్ కుమార్ ప్రభుత్వంపై తేజస్వీ యాదవ్ తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ పార్టీ అయినప్పటికీ బీహార్‌లో ఆర్జేడీదే పైచేయి అని తెలిపారు. మీకు కాపీ కొట్టే సీఎం కావాలా, ఒరిజినల్ ముఖ్యమంత్రి కావాలా అంటూ ఆరాలో జరిగిన ర్యాలీలో తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ తాను ప్రకటించిన సంక్షేమ పథకాలనే సీఎం నితీశ్ కుమార్ అమలు చేస్తు న్నారని ఆరోపించారు. ముందు నేను వెళ్తుంటే ప్రభుత్వం వెనుక వస్తోందని ఎద్దేవాచేసారు. ఈ సభలోనే ప్రజలను ఓ సూటి ప్రశ్న అడిగారు. మీకు కాపీ కొట్టే సీఎం కావాలా? ఒరిజినల్ సీఎం కావాలా? అంటూ ప్రశ్నించారు. అలాగే మహా ఘట్‌బంధన్ తరఫున సీఎం అభ్యర్థిని తానేనని తేజస్వి మరోసారి నొక్కి చెప్పారు. అయితే రెండోసారి చెప్పినప్పుడు కూడా రాహుల్ గాంధీ మోనంగానే ఉండిపోయారు. బీహార్‌లో ఆర్జేడీదే కీలక పాత్ర పోషిస్తోంది. బీహార్‌లో కాంగ్రెస్ కంటే ఆర్జేడీ పెద్దన్న పాత్ర పోషిస్తుందని తేజస్వీ పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కంటే తమ పార్టీకే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని ఆయన చెప్పకనే చెప్పారు. తేజస్వీ ప్రకటన రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్ సమక్షంలోనే ఆయన ఈ కామెంట్లు చేయగా వీరిద్దరూ నోరు మెదపకపోవడం గమనార్హంగా నిలిచింది. ముఖ్యంగా తేజస్వీ యాదవ్ మొదటి నుంచీ నితీష్ కుమార్ ప్రభుత్వాన్ని తప్పు పడుతూనే వస్తున్నారు. తీవ్ర విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. పదవీ విరమణ వయసు 60 ఏళ్లేనని మరి 75 ఏళ్ల సీఎం అవసరమా అంటూ వ్యాఖ్యానించారు. నితీష్ కుమార్ సీఎం పదవి నుంచి తొలగిపోవాలంటూ పదే పదే డిమాండ్ చేశారు.



## దేశ భద్రతపై రాజీపడుతున్న ప్రధాని మోడీ

### జిన్‌పింగ్‌తో మోడీ భేటీపై కాంగ్రెస్‌నేత ఫైర్

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ఆదివారం టియాంజిన్‌లో ద్వైపాక్షిక చర్చలు జరిగిన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. చైనా పట్ల మోదీ సర్కార్ అనుసరిస్తున్న మెతక వైఖరిని ఎండగడుతూ, దేశ భద్రత విషయంలో రాజీ పడుతున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేసింది. చైనా దూకుడుకు, బెదిరింపులకు తలొగ్గడమే భారత కొత్త భద్రతా విధానమా అని సూటిగా ప్రశ్నించింది. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా ప్రభుత్వ విధానాలను తప్పుబట్టారు. 2020 జూన్‌లో గల్వాన్ లోయలో 20 మంది భారత సైనికులు ప్రాణత్యాగం చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఆ త్యాగాలను విస్మరించి చైనాతో రాజీకి ప్రయత్నించడం దారుణమని విమర్శించారు. చైనా దురాక్రమణను గుర్తించడానికి బదులుగా, ప్రధాని మోదీ వారికి క్లీన్ చిట్ ఇచ్చారని ఆయన ఆరోపించారు. సరిహద్దుల్లో యథాతథ స్థితిని పూర్తిగా పునరుద్ధరించాలని ఆర్మీ చీఫ్ కోరుతున్నప్పటికీ, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకుండా చైనాతో సయోధ్యకు మొగ్గుచూపడం వారి దురాక్రమణను చట్టబద్ధం చేయడమేనని అన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌తో చైనా కుమ్మక్కైన తీరును మన ఆర్మీ డిప్యూటీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింగ్ జూలై 4న స్పష్టంగా వివరించారని జైరాం రమేశ్ గుర్తుచేశారు. ఈ అపవిత్ర పొత్తుపై స్పందించాల్సింది పోయి, మోదీ ప్రభుత్వం దానిని మోనంగా అంగీకరించి ఇప్పుడు చైనాకు రాచమర్యాదలుచేస్తోందని ఆయన ఆక్షేపించారు.

## యుపిఎస్‌సి మెరిట్ అభ్యర్థులకోసం 'ప్రతిభాసేతు' పోర్టల్

### మన్‌కీబాత్‌లో ప్రధాని మోడీ




**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** మెరిట్ జాబితాలో అవకాశం పొందలేకపోయిన ప్రతిభావంతుల కోసం కేంద్ర ప్రభుత్వం 'ప్రతిభా సేతు' పోర్టల్ ప్రారంభిస్తున్నట్లు ప్రధాని మోడీ వెల్లడించారు. వేలాది మంది సివిల్స్ ఆశావహ అభ్యర్థుల ప్రతిభకు ఇదొక వారధి లాంటిదని ప్రశంసించారు. యుపిఎస్‌సిలో ప్రిలిమ్స్, మెయిన్స్ అన్నీ క్లియర్ చేసినప్పటికీ తుది జాబితాలో అవకాశం చేజార్చుకున్న వారికి రెండవ ఛాన్స్ ఇచ్చేందుకు ఈ టాలెంటెడ్ పోర్టల్ ఉపకరిస్తుందని సివిల్స్ అభ్యర్థులకు ఇదొక ఆశాకిరణమని ఆయన అభివర్ణించారు. 125వ మన్ కీ బాత్ రేడియో కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ యూపీఎస్సీ అభ్యర్థులను ఉద్దేశిస్తూ ఈ కీలక ప్రకటన చేశారు. దేశంలో అత్యంత కఠినమైన పరీక్షలలో ఒకటైన సివిల్ సర్వీసెస్ పరీక్షను యూపీఎస్సీ (యుపిఎస్‌సి) నిర్వహిస్తుంది. ఎంత ప్రతిభాపాటవాలు ఉన్నప్పటికీ పరిమిత అవకాశాల కారణంగా ఏటా వేలాది మంది అభ్యర్థులు తుది జాబితాలో చోటు సాధించలేక పోతున్నారు. ఈ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు విలువైన సమయం, శ్రమ, డబ్బు వెచ్చిస్తారు. ఏళ్ల తరబడి కఠినంగా శ్రమించి విజయపుటంచులకు చేరినప్పటికీ చివరి క్షణాల్లో ఎందరో ప్రతిభావంతుల ఆశలు ఆవిరవుతున్నాయి. ఇలాంటి వారి కోసమే కేంద్ర ప్రభుత్వం ఒక డిజిటల్ ప్లాట్‌ఫామ్ తీసుకొచ్చింది. అదే 'ప్రతిభా సేతు'. మన్ కీ బాత్ 125వ ఎడిషన్‌లో ప ప్రతిభా సేతు గురించి ప్రస్తావించారు. ఇందులో యూపీఎస్సీలో వివిధ పరీక్షల్లో అన్ని దశల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల డేటాను సేవ్ చేస్తుంది. అర్హత గల అభ్యర్థుల వివరాలను ప్రతిభా సేతు పోర్టల్‌లో నమోదు చేస్తారు. తుది మెరిట్ జాబితాలో చోటు సంపాదించలేని వారి వివరాలను ప్రైవేట్ కంపెనీలకు అందుబాటులో ఉంచుతుంది. ఈ పోర్టల్ లోని సమాచారం ఆధారంగా కార్పొరేట్ కంపెనీలు భారీ జీతాలు ఇచ్చి సివిల్స్ అభ్యర్థులకు కొలువు ఆఫర్ చేస్తాయని ప్రధాని మోదీ వెల్లడించారు.

# నేను బతికే ఉన్నా..

## సోషల్‌మీడియా వైరల్‌కు ఫుల్‌స్టాప్ పెట్టిన ట్రంప్



**వాషింగ్టన్, ఆగస్టు 31:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరణించారంటూ సోషల్ మీడియాలో వ్యాపించిన వదంతులకు ఎట్టకేలకు తెరపడింది. కొన్ని రోజులుగా ఆయన ప్రజల ముందుకు రాకపోవడంతో మొదలైన ఊహాగానాలు తీవ్రరూపం దాల్చాయి. అయితే, శనివారం ఉదయం ఆయన వైట్‌హౌస్‌లో ప్రత్యక్షమవ్వడంతో ఈ పుకార్లన్నీ అబద్ధమని తేలిపోయింది. ఐదురోజుల క్రితం జరిగిన క్యాబినెట్ సమావేశం తర్వాత ట్రంప్ మళ్లీ బహిరంగంగా కనిపించలేదు. దీనికి తోడు, వారాంతంలో అధ్యక్షుడికి ఎలాంటి అధికారిక కార్యక్రమాలు లేవని వైట్‌హౌస్ షెడ్యూల్ విడుదల చేయడంతో అనుమానాలు మరింత బలపడ్డాయి. దీంతో శుక్రవారం రాత్రి నుంచి హ్యాష్‌ట్యాగ్‌లు ఎక్స్‌లో విపరీతంగా ట్రెండ్ అయ్యాయి. ట్రంప్ ఆరోగ్యంపై రకరకాల కుట్ర సిద్ధాంతాలు నెట్టింట చక్కర్లు కొట్టాయి. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 8:45 గంటల సమయంలో ట్రంప్ వైట్‌హౌస్‌లో కనిపించారు. తెల్లటి పోలో షర్ట్, నల్ల ప్యాంటు, ఎర్రటి మాగా టోపీ ధరించి, తన మనవరాళ్లు కై ట్రంప్, స్పెన్సర్ ఫ్రెడరిక్ ట్రంప్‌లతో కలిసి వర్జీనియాలోని స్టెర్లింగ్‌లో ఉన్న తన గోల్ఫ్ క్లబ్‌కు బయలుదేరారు. దీంతో ఆయన ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉన్నారని స్పష్టమైంది. అంతకుముందు కూడా ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్‌లో యాక్టివ్‌గా ఉన్నారు. అమెరికా వాణిజ్య విధానాలకు సంబంధించి ఫెడరల్ అప్పీల్స్ కోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన స్పందించారు. అన్ని టారిఫ్‌లు ఇంకా అమలులోనే ఉన్నాయి. పక్షపాతంతో కూడిన కోర్టు వాటిని తొలగించాలని చెప్పినా, అంతిమంగా అమెరికానే గెలుస్తుంది. ఈ సుంకాలను ఎత్తేస్తే దేశానికి పెను నష్టం జరుగుతుందని ఆయన పోస్ట్ చేశారు. ఇదే సమయంలో డైలీ కాలర్ వైట్‌హౌస్ కరస్పాండెంట్ రీగన్ రీస్ కూడా ఈ వదంతులను ఖండించారు. నేను నిన్న మధ్యాహ్నం అధ్యక్షుడితోనే ఉన్నాను. ఆయన్ను గంటపాటు ఇంటర్వ్యూ చేశాను. ఆయన చనిపోయారని లేదా అనారోగ్యంతో ఉన్నారని ప్రచారం జరగ డం ఆశ్చర్యంగా ఉందని ఆమె తెలిపారు. మొత్తానికి, ట్రంప్ ప్రత్యక్షం కావడంతో ఈ వార్తలకు ఫుల్‌స్టాప్ పడింది.

# సరిహద్దు వివాదాలతో మరుగునపడిన పంచశీల ఒప్పందం



**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** భారత్‌చైనా సంబంధాల గురించి చర్చ వచ్చినప్పుడల్లా 'పంచశీల ఒప్పందం' ప్రస్తావనకు వస్తున్నది. 'హిందీచీనీ భాయ్ భాయ్' నినాదాలతో స్నేహానికి ప్రతీకగా మొదలైన ఈ ఒప్పందం, చివరికి రెండు దేశాల మధ్య యుద్ధానికి దారితీయడం ఒక చారిత్రక విషాదం. సుమారు 70 ఏళ్ల క్రితం జరిగిన ఈ ఒప్పందం వెనుక ఎన్నో ఆశలు, రాజీలు, ఆ తర్వాత తీవ్ర పరిణామాలు ఉన్నాయి. 1954లో అప్పటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చైనాలో పర్యటించారు. మావో జెడాంగ్ నేతృత్వంలో చైనాలో కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, ఆ దేశాన్ని సందర్శించిన తొలి కమ్యూనిస్టేతర నేత నెహ్రూనే. తన కుమార్తె ఇందిరా గాంధీతో కలిసి చైనాకు వెళ్లిన ఆయనకు చైనా ప్రభుత్వం అపూర్వ స్వాగతం పలికింది. బీజింగ్, షాంఘై వంటి నగరాల్లో పర్యటించిన నెహ్రూ.. అమెరికా, సోవియట్ యూనియన్ కూటములతో సంబంధం లేకుండా ఆసియా దేశాల మధ్య శాంతియుత సంబంధాలు ఉండాలని ఆకాంక్షించారు. ఈ పర్యటన రెండు దేశాల మధ్య కొత్త స్నేహానికి నాంది పలుకుతుందని ఆయన బలంగా విశ్వసించారు. నెహ్రూ పర్యటనకు రెండు నెలల ముందు, అంటే 1954 ఏప్రిల్ 29న, టిబెట్ ఒప్పందంలో భాగంగా భారత్‌చైనా మధ్య పంచశీల ఒప్పందం కుదిరింది. భారత రాయబారి ఎన్. రాఘవన్, చైనా ప్రతినిధి చాంగ్ హన్‌ఫు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఒకరి సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను మరొకరు గౌరవించుకోవడం. పరస్పరం దురాక్రమణలకు పాల్పడకపోవడం. ఒకరి అంతర్గత వ్యవహారాల్లో మరొకరు జోక్యం చేసుకోకపోవడం. సమానత్వం, పరస్పర ప్రయోజనాల కోసం పనిచేయడం. శాంతియుత సహజీవనం. అయితే, ఈ ఒప్పందంలో భారత్ ఒక చారిత్రక రాజీకి తలొగ్గాల్సి వచ్చింది. టిబెట్‌ను చైనాలోని టిబెట్ ప్రాంతంగా అంగీకరించి, దానిపై చైనా సార్వభౌమత్వాన్ని అధికారికంగా గుర్తించింది. శాంతి మంత్రంలా కనిపించిన ఈ ఒప్పందం వెనుక చర్చల సమయంలోనే తీవ్ర భేదాభిప్రాయాలు తలెత్తాయి. ముఖ్యంగా హిమాలయాల్లోని వ్యాపార, యాత్రా మార్గాల విషయంలో చైనా మొండిగా వ్యవహరించింది. భారత్ ప్రతిపాదించిన పలు సరిహద్దు మార్గాలను తిరస్కరించింది. లడక్‌లోని డెమ్‌చోక్ మార్గాన్ని చేర్చాలన్న భారత అభ్యర్థనను కూడా తోసిపుచ్చింది. ఈ ఒప్పందం 1962 జూన్‌లో ముగిసింది. ఆ తర్వాత కొద్ది నెలలకే అక్సాయి చిన్, మెక్‌మహాన్ లైన్ వంటి సరిహద్దు ప్రాంతాలపై వివాదాలు ముదిరి రెండు దేశాల మధ్య పూర్తిస్థాయి యుద్ధానికి దారితీశాయి. దీంతో పంచశీల సూత్రాలు కాగితాలకే పరిమితమై, ఇరు దేశాల సంబంధాల్లో తీవ్రమైన అపనమ్మకానికి బీజం పడింది.



## నిశ్చితార్థంకోసం రమ్మని వరుడిని చితకబాదిన వధువు కుటుంబీకులు

### చికిత్సపొందుతూ వరుడు మృతి

**ముంబయి, ఆగస్టు 31:** మహారాష్ట్రలోని పూణేలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ప్రేమ పేరుతో తమ అమ్మాయిని వలలో వేసుకున్నాడనే కోపంతో ఓ కుటుంబం ఘోరానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పింప్రి చించ్వాడ్ లోని సాంఘ్వి ఏరియాకు చెందిన ఓ యువతి స్థానిక యువకుడు రమేశ్ ఘెంగాత్ ను ప్రేమించింది. ఈ విషయం తెలిసి యువతి కుటుంబ సభ్యులు అభ్యంతరం తెలిపారు. రమేశ్‌పై రేప్ కేసు నమోదైందని, పోస్కో కేసులోనూ నిందితుడని కూతురుకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా కూతురు పట్టువిడవకపోవడంతో గత్యంతరం లేక పెళ్లికి ఒప్పుకున్నారు. పెళ్లి కుదుర్చుకునేందుకు రమ్మంటూ రమేశ్ కుటుంబాన్ని ఇంటికి ఆహ్వానించారు. తల్లిదండ్రులను వెంటబెట్టుకుని వచ్చిన రమేశ్‌ను యువతి కుటుంబ సభ్యులు నిలదీశారు. ప్రేమ పేరుతో తమ కూతురును వలలో వేసుకున్నాడని ఆరోపించారు. ఈ విషయంపై మాటామాటా పెరగడంతో కోపోద్రిక్తులైన యువతి కుటుంబ సభ్యులు రమేశ్‌ను గదిలోకి లాక్కెళ్లి చితకబాదారు. తీవ్ర గాయాలతో రమేశ్ స్పృహ తప్పడంతో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ రమేశ్ మరణించాడు. రమేశ్ తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు యువతి కుటుంబ సభ్యులు 9 మందిని అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని, వారికోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

# సంక్షిప్తంగా..

## ఎంపి మహువా మొయిత్రాపై కేసు నమోదు



**నయారాయ్‌పూర్, ఆగస్టు 31:** కేంద్ర హోంమంత్రి అమిత్ షా పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా పై కేసు నమోదు చేశారు. బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లను నిరోధించడంలో విఫలమయ్యారంటూ అమిత్‌షా పై మహువా మొయిత్రా ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యల నేపథ్యంలో మహువాపై కేసు నమోదైంది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు రాయ్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎంపీ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని, రాజ్యాంగ విరుద్ధమని ఆ నాయ కుడు పేర్కొన్నాడు. 1971 సమయంలో రాయ్‌పూర్ లోని మానా క్యాంప్ ప్రాంతంలో అనేక మంది బంగ్లాదేశీ శరణార్థులు స్థిరపడ్డారని, మహువా వ్యాఖ్యలు వారిలో భయాందోళనలు రేకెత్తించాయని తెలిపాడు. అంతకుముందు పశ్చిమ బెంగాల్‌లోని కృష్ణానగర్ కొత్వాలీ పోలీస్ స్టేషన్‌లోనూ ఆమెపై ఫిర్యాదు దాఖలైంది.

## టేకాఫ్.. అంతలోనే తిరిగొచ్చిన ఎయిరిండియా విమానం




**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** దేశ రాజధాని ఢిల్లీ నుంచి ఇండోర్ కు వెళ్లాల్సిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఢిల్లీకి తిరిగి వచ్చింది. విమానం కుడి ఇంజిన్‌లో మంటలు రేగినట్లు సూచన అందుకున్న పైలట్ ఆ విమానాన్ని వెంటనే ఢిల్లీకి మళ్లించినట్లు ఎయిరిండియా తెలిపింది. ఢిల్లీకి తిరిగొచ్చిన విమానాన్ని తనిఖీల కోసం నిలిపివేశామని అధికారులు చెప్పారు. ప్రయాణికులను ప్రత్యామ్నాయ విమానంలో ఇండోర్‌కు తరలించామని ఎయిరిండియా అధికారులు తెలిపారు. ఆగస్టు 31న ఢిల్లీ నుంచి ఇండోర్‌కు బయలుదేరిన విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఢిల్లీకి తిరిగొచ్చింది. కాక్‌పిట్ సిబ్బందికి ఇంజిన్‌లో మంటలు వస్తున్నట్లు సూచన అందింది. ప్రామాణిక విధానాన్ని అనుసరించి, కాక్‌పిట్ సిబ్బంది ఇంజిన్‌ను ఆపేయాలని నిర్ణయించుకుని ఢిల్లీకి తిరిగొచ్చారు.

## విమానం గాల్లో ఉండగా టాయిలెట్లలో సమస్య..




**కాన్‌బెర్రా, ఆగస్టు 31:** బాలి నుంచి బ్రిస్బేన్‌కు వెళ్తున్న విమానంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విమానం గాల్లో ఉన్న సమయంలో టాయిలెట్లతో సమస్య తలెత్తడంతో ప్రయాణికులకు నీళ్ల బాటిళ్లలో మూత్ర విసర్జన చేయాల్సి వచ్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అంతర్జాతీయ మీడియా తెలిపిన వివరాల ప్రకారం.. వర్జిన్ ఆస్ట్రేలియా బోయింగ్ (737 మాక్స్ 8) విమానం గురువారం మధ్యాహ్నం బాలిలోని డెన్‌పసర్ విమానాశ్రయం నుంచి బ్రిస్బేన్‌కు బయల్దేరింది. టేకాఫ్ తర్వాత అందులోని పలు టాయిలెట్లలో సమస్య ఉండడాన్ని సిబ్బంది గుర్తించారు. మొత్తం ఆరు గంటలు కాగా మొదటి మూడు గంటలు ప్రయాణికులు ఒక్క బాత్రూమ్‌నే వినియోగించుకున్నారు. మూడు గంటల తర్వాత అందులో కూడా సమస్య తలెత్తడంతో నీళ్ల బాటిళ్లలో మూత్ర విసర్జన చేయాలని విమానసిబ్బంది ప్రయాణికులకు సూచించారు. దీంతో ప్రయాణికులు విమాన సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము తీవ్ర ఇబ్బందులకు గురయ్యామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు.

## ఎయిర్‌ఫోర్స్‌కు రెండు తేజాస్ జెట్ విమానాలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** తేజస్ యుద్ధ విమానాల డెలివరీలో జాప్యం జరుగుతోందంటూ ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ గతంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంది. సెప్టెంబర్ నెలాఖరు కల్లా రెండు తేజస్ ఎమ్‌కే1ఏ యుద్ధ విమానాలను హిందుస్థాన్ ఎయిరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) ఎయిర్‌ఫోర్స్‌కు అందజేయనుంది. ఈ విషయాన్ని డిఫెన్స్ సెక్రెటరీ ఆర్‌కే సింగ్ వెల్లడించారు. ఆ తరువాత మరో 97 తేజస్ యుద్ధ విమానాల డెలివరీకి ఎయిర్ ఫోర్స్‌తో హెచ్ఏఎల్ ఒప్పందం కుదుర్చుకుంటుందని కూడా తెలిపారు. పూర్తి స్థాయి వెపన్స్ (ఆయుధాలు) ఇంటెగ్రేషన్‌తో ఈ రెండు తేజస్ యుద్ధ విమానాలు డెలివరీ అవ్వొచ్చని అన్నారు. ఇప్పటికే హెచ్ఏఎల్, ఎయిర్‌ఫోర్స్ మధ్య యుద్ధ విమానాల డెలివరీకి ఒప్పందం ఉంది. అయితే, విమానాల తయారీలో జాప్యంపై ఎయిర్ ఫోర్స్ చీఫ్ ఇటీవల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

# రష్యానుంచి కొనుగోళ్లు.. ఉక్రెయిన్‌కు సరఫరా చేస్తున్న భారత్

## 'నాఫ్టొరైనోక్' గణాంకాల జాబితా విడుదల



**క్యీవ్, ఆగస్టు 31:** ఉక్రెయిన్‌రష్యా యుద్ధం నేపథ్యం లో భారత్ వైఖరిని అమెరికా నిందిస్తున్న సంగతి తెలిసిందే. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూ, ఉక్రెయిన్ పై పోరాడేందుకు అవసరమైన డబ్బును ఆ దేశానికి అందిస్తోందని అమెరికా కన్నెర్ర చేస్తోంది. అగ్రరాజ్యం ఇప్పటికే అదనపు సుంకంతో కలిపి భారత్ పై 50 శాతం సుంకాలు విధించింది. ఈ నేపథ్యంలో, అత్యంత ఆసక్తికరమైన అంశం వెల్లడైంది. భారత్ ఒకవైపు రష్యా నుంచి భారీగా ముడి చమురును కొనుగోలు చేస్తూనే, మరోవైపు అదే చమురును శుద్ధి చేసి యుద్ధంతో సతమతమవుతున్న ఉక్రెయిన్‌కు అతిపెద్ద డీజిల్ సరఫరాదారుగా నిలిచింది. అమెరికాలోని కొందరు విమర్శిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థకు, సైనిక అవసరాలకు భారత ఇంధనమే కీలకంగా మారింది. ఉక్రెయిన్‌కు చెందిన చమురు మార్కెట్ విశ్లేషణ సంస్థ 'నాఫ్టొరైనోక్' విడుదల చేసిన గణాంకాల ప్రకారం, 2025 జులై నెలలో ఉక్రెయిన్‌కు అత్యధికంగా డీజిల్ సరఫరా చేసిన దేశంగా భారత్ మొదటి స్థానంలో నిలిచింది. ఆ నెలలో ఉక్రెయిన్ వినియోగించిన మొత్తం డీజిల్‌లో 15.5 శాతం వాటా భారత్‌దే కావడం గమనార్హం. సగటున రోజుకు 2,700 టన్నుల డీజిల్‌ను భారత్ నుంచి ఉక్రెయిన్ దిగుమతి చేసుకుంది. ఈ ఏడాది జనవరి నుంచి జులై వరకు ఉక్రెయిన్‌కు భారత డీజిల్ ఎగుమతులు 10.2 శాతానికి పెరిగాయి. 2024లో ఇదే కాలంలో ఇది కేవలం 1.9 శాతంగా మాత్రమే ఉంది. భారత్ నుంచి శుద్ధి చేసిన ఈ డీజిల్ రొమానియా, తుర్కియే దేశాల ద్వారా ఉక్రెయిన్‌కు చేరుతోంది. యుద్ధం కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న ఉక్రెయిన్ నగరాలు, రవాణా వ్యవస్థ, యుద్ధ క్షేత్రాలు నడవడానికి ఈ ఇంధన సరఫరా అత్యంత కీలకంగా మారింది. భారత్‌తో పాటు స్లొవాకియా, గ్రీస్, తుర్కియే, లిథువేనియా వంటి దేశాలు కూడా ఉక్రెయిన్‌కు ఇంధనాన్ని అందిస్తున్నాయి. అయితే, అమెరికాలోని ట్రంప్ కార్యవర్గానికి చెందిన పీటర్ నవారో వంటి కొందరు, రష్యా నుంచి చమురు కొనడం ద్వారా భారత్ యుద్ధాన్ని పరోక్షంగా ప్రోత్సహిస్తోందని ఆరోపణలు చేస్తున్నారు. కానీ, అదే రష్యా చమురుతో నడుస్తున్న ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థ వాస్తవ పరిస్థితిని స్పష్టం చేస్తోంది. గతంలో అమెరికా ఆంక్షల వల్ల ఇరాన్, వెనిజులా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేసిన భారత్, ఇప్పుడు రష్యా విషయంలో కూడా అదే పనిచేస్తే తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

1-9pg6exHMNWJQE 10_1-9pg6exHMNWJQE.qxd 8/31/2025 11:59 PM Page 1



## 3 నుంచి శ్రీకాళహస్తీశ్వరుని పవిత్రోత్సవాలు

**శ్రీకాళహస్తి,ఆగస్టు 31 ప్రభాతవార్త:** దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో వార్షిక పవిత్రోత్స వాలు ఈ నెల 3 నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి ఆదివారం ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం అధికారులు, సిబ్బంది పవిత్రోత్స వాలకు స్వామి అమ్మవార్లకు అలంకారాల్లో ప్రత్యేకతకు ఈ ఏడాది లాకర్లోని ఏడు వారాల నగలను బయటకు తీయనున్నట్లు వివరించారు.. ప్రతి ఏడాది పవిత్రోత్స వాలను శాస్త్రోక్తంగా స్థానిక సంప్రదాయం మేరకునిర్వహించటం ఆనవాయితిగా వస్తుంది. ఐదు రోజుల పాటు శాస్త్రోక్తంగా నిర్వహించే ఈ పూజలకు ఎంతో ప్రాధాన్యత చోటు చేసుకుంది.

## శేషవాహనంపై లంబోదరుడి దరహాసం



**కాణిపాకం, ఆగస్టు 31 ప్రభాతవార్త:** కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్స వాల్లో భాగంగా ఆదివారం సర్వాలాంకృతుడైన స్వామివారు ఉభయదేవేరులతో కలసి ఉదయం చిన్న శేషవాహనం, రాత్రి బంగారు పెద్ద శేషవాహనంపై అధిరోహించి కాణిపాకం గ్రామ పుర వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈకార్యక్రమానికి కాణిపాకం, కాకర్లవారిపల్లె, వడ్రాంపల్లె, మిట్టయిండ్లు, కొత్తపల్లె, అడప గుండ్లపల్లె, 44 బొమ్మసముద్రం, తిమ్మోజిపల్లె, తిరువణంపల్లె, చిగరపల్లె, అగరంపల్లె గ్రామాదుల కమ్మవ ంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం ఉభయదారులు వరుస ఉభయం తీసుకురాగా అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలను నిర్వహించి శోభాయమానంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్స వమూర్తులను అలంకార మండపంలో వుంచి అర్చకులు వేద పండితుల మంత్రఘోష నడుమ ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలాగే సిద్ధి, బుద్ధి సమేత గణనాధుడు చిన్నశేషవాహనంపై అధిరోహించి మంగళ వాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈకార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు, ఆలయ ఉభయదారుల కమిటీ ఛైర్మన్ ఈశ్వర్ బాబు,ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, స్థానిక మాజీ సర్పంచ్ మదుసూధన్‌రావు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయడు, చిట్టిబాబు ఉత్స వ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## గణనాధునికి వైభవంగా అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకం





**కాణిపాకం, ఆగస్టు 31 ప్రభాతవార్త:** కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్స వాలలో భాగంగా ఆదివారం జరిగిన చిన్నశేషవాహనం, బంగారు పెద్ద శేషవాహనసేవ సందర్భంగా ఉభయదారులచే స్వామివారికి అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకంను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈమేరకు ఉదయం కాణిపాకం, కాకర్లవారిపల్లె, వడ్రాంపల్లె, మిట్టయిండ్లు, కొత్తపల్లె, అడపగుండ్లపల్లె, బొమ్మసముద్రం, తిమ్మోజిపల్లె, తిరువణంపల్లె, చిగరపల్లె, అగరంపల్లె గ్రామాలతో పాటు వివిధ ప్రాంతాల నుండి వేలాదిగా తరలివచ్చిన కమ్మవ ంశస్థులు స్వామివారికి అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకంను నిర్వహించారు.

## చిన్నశేషవాహనంపై శివపుత్రుని చిద్విలాసం

**కాణిపాకం, ఆగస్టు 31 ప్రభాతవార్త:** కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్స వాల్లో భాగంగా ఆదివారం ఉదయం సర్వాలాంకృతుడైన స్వామివారు ఆలయ మాడా వీధుల్లో ఉభయదేవేరులతో కలసి చిన్నశేషవాహనంపై అధిరోహించి భక్తులకు అభయ హస్తం అందించారు. ఉదయం ఉత్స వ ఉభయదారులు వరుస ఉభయం తీసుకురాగా ఆలయ అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలను నిర్వహించి శోభాయమానంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్స వమూర్తులను అలంకార మండపంలో వుంచి అర్చకులు వేద పండితుల మంత్రఘోష నడుమ ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలాగే సిద్ధి, బుద్ధి సమేత గణనాధుడు దేదీప్యమానంగా అలంకరించిన చిన్నశేషవాహనంపై అధిరోహించి మంగళ వాయిద్యాల నడుమ ఆలయ మాడా వీధుల్లో ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు.





దాతలకు దుర్గమ్మవారి మెమొంటో అందిస్తున్న దృశ్యం

## దుర్గమ్మ ఆలయానికి విరాళాల వెల్లువ

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 31, ప్రభాతవార్త:** ఇంద్రకీలాద్రిపై వేంచేసిన శ్రీ దుర్గమ్మ వారి ఆలయానికి భక్తులు ఆదివారం పెద్ద ఎత్తున విరాళాలు సమర్పించారు. నిత్యాన్నదాన పథకానికి రు.1,00,111ల విరాళాన్ని విజయవాడకు చెందిన పి సుబ్బలక్ష్మి పేరిట వారి కుమార్డు నాగేశ్వరమ్మ దంపతులు, కుమార్తె మమత శ్రీరంగ తరపున రు.1,00,001ల విరాళాన్ని ఉచిత ప్రసాదపంపిణీ కోసం అందించారు. ఆయా దాతలకు, వారి కుటుంబ సభ్యులకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అధికారులు వారికి దుర్గమ్మవారి మెమొంటో, ప్రసాదం,





మంచుమనోజ్‌కు దుర్గమ్మ చిత్రపటం అందిస్తున్న ఇఓ శీనా నాయక్

శివశంకర్, కోడలు విజయదుర్గ కామేశ్వరి లు అధికారులకు అందించారు. ఇక ఉచిత ప్రసాద పథకానికి హైదరాబాద్‌కు చెందిన కెవి లక్ష్మి నరసింహ శాస్త్రి, పద్మావతి దంపతులు, వారి కుమారుడు కెవి సునీల్‌చంద్ర, కెవి ఫణిశ్రీ లు రు.1,00,001ల విరాళాన్ని అందించారు. నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన డి కనకదుర్గ, కావ్య,సుధీర్ కుమార్ లు రు.1,00,116ల విరాళాన్ని అందించారు. అదేవిధంగా గుంటూరు జిల్లా కొత్తూరుకు చెందిన మండవ శ్రీనివాసరావు, ఆదిలక్ష్మి దంపతుల పేరిట రు.1,00,001ల విరాళాన్ని అందించారు. గుంటూరుకు చెందిన తేగెల రవీంద్రబాబు, డా శేషవస్త్రాలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**దుర్గమ్మను దర్శించుకున్న మంచు మనోజ్:** దుర్గమ్మవారిని సినీ నటుడు మంచు మనోజ్ ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఇఓ వికె శీనా నాయక్ దుర్గమ్మ ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటో అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

## వైఎస్ జగన్‌కు ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఫోన్..

**విజయవాడ,ఆగస్టు 31,ప్రభాతవార్త ప్రతినిధి:** ఉప రాష్ట్రపతి ఎన్నికల నేపథ్యంలో మాజీ సిఎం, వైఎస్సార్ సిపి అధినేత వైఎస్ జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఫోన్ చేసి మద్దతు కోరగా,జగన్ తన నిర్ణయాన్ని ఆయనకు స్పష్టంగా తెలియచేశారు. ఇప్పటికే ఎన్డీఏ నాయకులు తమతో సంప్రదించారని, ముందుగానే వారికి మద్దతు ఇస్తామని హామీ ఇచ్చామని జగన్ తెలిపారు. అంతేకాకుండా వ్యక్తిగతంగా సుదర్శన్‌రెడ్డిని ఎంతో గౌరవిస్తాను. ఆయన న్యాయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అపారమైన సేవలందించారు. కానీ,మేము ముందే ఎన్డీఏకు మాట ఇచ్చినందు ఎన్నికల్లో మద్దతు ఇవ్వడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. అలాగే ఈ విషయంలో అపార్థం చేసుకోవచ్చని, తన నిర్ణయాన్ని అన్యథాభావంగా తీసుకోవద్దని జగన్ విజ్ఞప్తి చేశారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల నేపథ్యంలో ఆయన స్పష్టమైన ధోరణి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

# నేడు సిఎం రాజంపేటకు రాక

## అన్నమయ్య జిల్లాకు చంద్రబాబు వరాలు ప్రకటించేనా?



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

**రాజంపేట, ఆగస్టు 31 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు అన్నమయ్య జిల్లాలో పర్యటించనున్నారు. రాజంపేట మండలం బోయినపల్లిలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం వస్తున్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాజంపేట నియోజకవర్గంలో మొదటిసారి పర్యటిస్తున్నారు. దీంతో జిల్లాలోని రాజంపేట తో పాటు పక్కనే ఉన్న రైల్వే కోడూరు నియోజకవర్గాల ప్రజలు సీఎం చంద్రబాబు ఈ ప్రాంతానికి వరాలు ప్రకటిస్తారని కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. ఎన్నికల సమయంలో ఈ ప్రాంత పర్యటనకు వచ్చినప్పుడు కూటమి నేతగా చంద్రబాబు పలు హామీలను ప్రకటించారు. అందులో ప్రధానంగా రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని చంద్రబాబు స్పష్టమైన హామీ చేశారు. మదనపల్లె జిల్లా చేయాలని అక్కడి ప్రజలు డిమాండ్ చేస్తున్నారని, రాజంపేటలో జిల్లా కేంద్రం చేయకపోతే ప్రజలు తిరుగుబాటు చేసే పరిస్థితి కనిపిస్తోందని, ఇప్పటికే రాయచోటి జిల్లా కేంద్రంగా కొనసాగుతోందని, అందరి మనోభావాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని చంద్రబాబు ప్రకటించారు. తాజాగా జిల్లాల పునర్వ్యవస్థీకరణకు ప్రభుత్వం మంత్రులతో ఉప సంఘం ఏర్పాటు చేసిన నేపథ్యంలో జిల్లా సెంటిమెంట్ మరింత బలంగా మారింది. ఈ నేపథ్యంలో చంద్రబాబు వైఖరి ఎలా ఉంటుందనేది సర్వత్ర చర్చనీయాంశంగా మారింది. రాజంపేట కేంద్రంగా జిల్లా ప్రకటిస్తారని ప్రజలు ఎదురుచూస్తున్నారు. మరోవైపు రాజంపేట జిల్లా కేంద్రంగా చేయాలని తెలుగుదేశం పార్టీ రాజంపేట నియోజకవర్గస్థాయి ఏకగ్రీవ తీర్మానం చేసి సీఎంకు అందజేస్తామని పార్టీ అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు ప్రకటించారు. మరోవైపు జిల్లా కేంద్రం సాధన కోసం ఏర్పడిన కమిటీ ఆందోళన లో భాగంగా ఇప్పటికే 4000 పోస్టు కార్డులను మంత్రివర్గ సభ్యులకు పంపారు. ఇకపోతే కడపతో పాటు అన్నమయ్య, తిరుపతి జిల్లాల రైతాంగానికి వరప్రసాదిని అయిన గాలేరు నగిరి ప్రాజెక్టు రెండో దశ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉన్నాయి. రాష్ట్రంలోనే ఉద్యానవన పంటలకు ప్రసిద్ధిగాంచిన రాజంపేట , రైల్వే కోడూరు ప్రాంతంలో ఒక్క పరిశ్రమ కూడా లేదు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు ఈ ప్రాంతం ఎంతో అనుకూలం. అయితే ఇంతవరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. రాజంపేటలో ఏపీఐఐసీ ఏర్పాటుచేసిన ఇండస్ట్రియల్ క్లస్టర్ ఉన్నా కూడా పరిశ్రమలు లేవు. అన్నమయ్య ప్రాజెక్టు వరదల్లో కొట్టుకుపోయిన తర్వాత పునర్నిర్మాణం చేస్తామని ప్రకటించి నిపుణుల కమిటీని నియమించారు. నిపుణుల కమిటీనివేదిక సిద్ధమైంది. ప్రభుత్వానికి కమిటీ నివేదిక సమర్పించిన తర్వాత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. దీనిపై కూడా ఇంకా స్పష్టతరాలేదు. దశాబ్దాలుగా రైల్వే కోడూరు రైతాంగం డిమాండ్ చేస్తున్న కోల్డ్ స్టోరేజ్ కి దిక్కు లేదు. రాజంపేట రైల్వేకోడూరు నియోజవర్గాలకు సోమశిల వెనుక జలాలను మళ్లించినట్లయితే బీడు భూములు సస్యశ్యామలం కానున్నాయి. దీనిపై కూడా ప్రతిపాదనలు ఉన్నా ఇంతవరకు ఎలాంటి ప్రయత్నం జరగలేదు. ఇలా ఎన్నో సమస్యలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాజంపేటకు ఎలాంటి వరాలు ప్రకటిస్తారో వేచి చూడాల్సి ఉంది.

## కళాశాలల్లో డిగ్రీ ప్రవేశాల రద్దీ

**విజయవాడ,ఆగస్టు 31,ప్రభాతవార్త ప్రతినిధి:** డిగ్రీ ప్రవేశాల కౌన్సిలింగ్‌లో కళాశాలల నుంచి సైతం రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఇవ్వడంతో కొన్ని కళాశాలలకు భారీగా ధరఖాస్తులు వస్తున్నాయి. దీంతో వీటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఎక్కువ సమయం పడుతోంది.

ఈ ఏడాది డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాలకు విద్యార్థులు నేరుగా నమోదు చేసుకోవడంతో పాటు కళాశాలల నుంచి ప్రవేశాలు పొందేందుకు అవకాశం కల్పించారు. విజయవాడ లోని సిద్ధార్థ కళాశాలలకు సుమారు 1,330 వరకు ధరఖాస్తులు వచ్చాయి. విభాగాల వారీగా ప్రత్యేకంగా అధ్యాపకులు,కంప్యూటర్లను ఏర్పాటు చేసి నమోదు చేయిస్తున్నారు. డిగ్రీ ప్రవేశాలు ఎక్కువగా ఉండే కళాశాలల వద్ద ఈ పరిస్థితి నెలకొంది.

కౌన్సిలింగ్‌లో రిజిస్ట్రేషన్ గడువు సెప్టెంబరు ఒకటితో ముగుస్తుంది. తిరుపతి లోని పద్మావతి మహిళా డిగ్రీ పీజీ కళాశాలకు సుమారు 2వేల వరకు ధరఖాస్తులు వచ్చాయి. వీటన్నింటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం సిబ్బందికి కొంత ఇబ్బందిగా మారింది, ఒక్కో విద్యార్థి వివరాల నమోదుకు 20 నిముషాలకు పైగా సమయం పడుతోంది.

అందరి వివరాలను నమోదు చేయలేక నేరుగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కొంతమంది విద్యార్థులకు సిబ్బంది ఫోన్లు చేసి చెబుతున్నారు.

## బ్యాంకు మేనేజర్, క్యాషియర్‌సహా 44 మంది నిందితుల అరెస్టు

### 15.237 కిలోల బంగారం, 1.61 లక్షల నగదు జప్తు

### చెన్నూరు ఎస్‌బిఐ 2 భారీచోరీ కేసులో వీడిన మిస్టరీ



చెన్నూరు ఎస్‌బిఐ 2 భారీ చోరీ కేసులో నిందితుల అరెస్టు వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా.

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** సంచలనం రేపిన ఆదిలాబాద్ జిల్లా చెన్నూరు ఎస్‌బిఐ 2లో వెలుగు చూసిన భారీ చోరీ కేసులో బ్యాంకు మేనేజర్, క్యాషియర్ సహా 44 మంది నిందితులను అ రెస్టు చేశారు. ఈ సందర్భంగా వీరి వద్ద నుంచి 15.237 కిలోల బంగారంతో పాటు 1.61 లక్షల రూపాయల నగదును జప్తు చేశారు. రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా దీనికి సంబంధించిన వివరాలను ఆదివారం మీడియాకు వెల్లడించారు. చెన్నూరు ఎస్‌బిఐ 2 బ్యాంకులో క్యాషియర్‌గా పనిచేస్తున్న రవీందర్ కొంతకాలంగా బెట్టింగ్‌లకు అలవాటు పడి స్థానికంగా అనేక మందికి బాకీ పడడం, ఈ క్రమంలో బ్యాంకులో ప్రజలు దాచిన బంగారు నగలను ఇదే ప్రాంతంలోని ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల వద్ద తనఖా పెట్టి డబ్బులు తీసు కుని, వాటిని కూడా పందాలు కాసి నిండా మునగడం తెలిసిందే. దీంతో పాటు బ్యాంకులోని కోటి పది లక్షల రూపాయల నగదు కూడా ఇతను సొ ంత అవసరాలకు వాడుకోవడం విదితమే. తన అక్రమాలు వెలుగు చూడకుండా వుండేందుకు తనకు తెలిసిన ఖాతాదారుల నుంచి వడ్డీకి డబ్బులు, బంగారు నగలు తీసుకుని లాకర్లలో వుంచేవాడు. అయితే పది రోజుల క్రితం రవీందర్ నాలుగు రోజుల సెలవుపై వెళ్లి పారిపోవడం, మేనేజర్ మనో హర్ రెడ్డి కూడా పత్తా లేకుండా పోవడంతో ఎనిమిది రోజుల క్రితం జరిగిన ఆడిటింగ్‌లో ఈ భారీ చోరీ రట్టయ్యింది. 2024 అక్టోబర్ నెల నుంచే ఈ బ్యాంకు క్యాషియర్ సరిగే రవీందర్ ఆన్‌లైన్ బెట్టింగ్‌ల్లో నష్టపోయి బ్యాంకులో ఖాతాదారుల నగలను మరో ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో వారికి తెలియకుండా తాకట్టు పెట్టి అక్కడ తీసుకున్న డబ్బులతో మళ్లీ పందాలు కాసీ మరోదఫా కూడా నష్టపోయాడు. ఇతను మొత్తం మీద 40 లక్షల రూ పాయలకు పైగా నష్టపోయాడు. ఈ క్రమంలో ఇతను బ్యాంకులో 402 మంది తనఖా పెట్టిన 25.17 కిలోల బంగారు నగలు, 1.10 లక్షల రూపాయల నగదును తన అవసరా లకు వాడుకున్నాడు. అయితే ఇందుకు మేనేజర్ మనోహర్ రెడ్డితో పాటు మరో ఉద్యోగి సహకరించాడు. అయితే బ్యాంకు అంతర్గత ఆడిటింగ్‌లో ఈ గోల్ మాల్ వెలుగు చూడడంతో చెన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేబట్టి పరారీలో వున్న క్యాషియర్ రవీందర్‌ను మహారాష్ట్రలో అరెస్టు చేసి విచారించగా మొత్తం వ్యవహారం రట్టయ్యింది. దీని తరువాత మేనేజర్ మనోహర్ రెడ్డి ఇతర నిందితులు కొంగండి బీరేష్, నరిగే సరిత, నరిగే స్వర్ణలత అలియాస్ గోపు, ఉమ్మల సురేష్, కొదటి రాజశేఖర్, గౌడ సుమన్, ఎనంపల్లి సాయి కిరణ్, సందీప్, మోత్కూరి రమ్యలతో పాటు మరో 32 మందిని అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి బ్యాంకులో కాజేసిన 15.237 కిలోల బంగారం, 1.61 లక్షల నగదును జప్తు చేశారు. అయితే మరో 20 శాతం నగలు ఇంకా జప్తు కావాల్సి వుందని పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలి పారు. ఈ కేసులో పక్కాగా వ్యవహరించిన చెన్నూరు పోలీసులను ఆయన అభినందించారు. ఈ సమావేశంలో మంచిర్యాల డిసిపి భాస్కర్, జైపూర్ ఏసిపి వెంకటేశ్వర్, చెన్నూరు సిఐ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## గంగులకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చిన మంత్రి పొన్నం

### ఆకారం పెద్దగా ఉంటే అవగాహన ఎక్కువ ఉంటుందనుకోవడం పొరపాటు

### నేను బాడీషేమింగ్ గురించి మాట్లాడితే వివాదాస్పదమవుతుంది: గంగుల





**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** అసెంబ్లీలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై చర్చ సందర్భంగా బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బిఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఇద్దరు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. ఒకదశలో బాడీ షేమింగ్ వరకు పోయింది. బిసి రిజర్వేషన్లపై మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ..గంగుల కంటే ఎక్కువ చదువుకున్నా.. రాజకీయాల్లో విద్యార్థి దశ నుంచి ఉన్నా.. నాకు ఎక్కువ తెల్వదు అనుకుంటే పొరపాటు.. నేను ఏమంటున్న అంటే.. ఆకారంలో పెద్దగా ఉంటే అవగాహన ఎక్కువ ఉంటది అనుకుంటే పొరపాటన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే గంగుల కమలాకర్ స్పందించారు. నేను కూడా బాడీ షేమింగ్ గురించి మాట్లాడితే పెద్ద కాంట్రా వర్సీ అవుతదన్నారు. తాను కేవలం ఒక్కటే అడగుతు న్నానని.. శాస్త్రీయంగా బిసి రిజర్వేషన్లు కల్పించాలని.. రాజ్యాం గపరంగా 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తున్నా మన్నారు. అసెంబ్లీలో బిల్లు పెట్టి జీవో పాస్ చేయడానికి 20 నెలలు ఎందుకు టైమ్ వేస్ట్ చేశారని.. ఈ పని అప్పుడే చేసి, ఎన్నికలకు వెళ్ళాల్సింది కదా అని గంగుల కమలాకర్ అన్నారు. మార్చి 2024లో జీవో నెంబర్ 26ను బిసి కమిషన్ ద్వారా తీసుకొచ్చారు.. ఆ తర్వాత బిసి కమిషన్ కాస్త మాయమైందని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. బిఆర్ఎస్ అంటే భారత రాష్ట్ర సమితి కాదని... బహుజన రాష్ట్ర సమితి అని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. ఈ బిల్లు తీసుకొచ్చి ఆ తర్వాత జీవో ఇచ్చి బిసిలకు అన్యాయం చేయొద్దని.. షెడ్యూల్ 9లో బిసి రిజర్వేషన్లను చేయాలని గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. బిసి బిల్లు అమలును తమిళనాడు తరహాలో శాస్త్రీయంగా చేయాలని.. అశాస్త్రీయంగా చేస్తే బీహార్, మధ్య ప్రదేశ్, యూపీ రాష్ట్రాల్లో ఫెయిల్ అయినట్లుగా అవుతుందన్నారు.



## జనసేన వల్ల రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు

### మాజీ మంత్రి పేర్నినాని

**విజయవాడ,ఆగస్టు31,ప్రభాతవార్త ప్రతినిధి:** పదకొండేళ్ల రాజకీయ ప్రయాణంలో జనసేన పార్టీ, దాని అధినేత పవన్ కల్యాణ్ వల్ల రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని వైసిపి కృష్ణా జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. తన అవసరానికి అనుగుణంగా రాజకీయాల్లో స్టాండ్ మార్చే పవన్ కల్యాణ్ ఐడియాలజీ ఆయన్ను నమ్మి పార్టీలో చేరిన వారికే అర్థం కావడం లేదన్నారు. లెఫ్టిజం, రైటిజం, సెంట్రలిజం అన్ని కలిపి పవనిజం అని పేర్కొన్నారు. 2017లో సుగాలి ప్రీతి హత్య జరిగితే, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఆధారాలు ఎలా తారుమారు అవుతాయని ప్రశ్నించారు. ప్రధాని మోడీ, అమిత్ షాలు తనకు అత్యంత సన్నిహితులని చెప్పుకుంటున్న పవన్ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై వారిని ఎందుకు ఒప్పించడం లేదన్నారు. కేంద్రం ప్రత్యేక ప్యాకేజీలో భాగంగా ఇచ్చిన రూ.11,400 కోట్లు ఒక జేబులో నుంచి తీసి మరో జేబులో పెట్టుకున్న చందంగా ఉందన్నారు. స్టీల్ ప్లాంట్‌లో 14 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉంటే, కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం 4 వేల మందికి ఉద్వాసన పలికిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. త్వరలో మరో 2 వేల మందిని ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికల ముందు స్టీల్ ప్లాంట్‌కు భూములు ఇచ్చిన వారిలో ఉద్యోగాలు లభించని 8 వేల కుటుంబాలకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు వారికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ప్లాంటుకు చెందిన కీలకమైన విభాగాల్లో 32 విభాగాల ప్రైవేటీకరణకు టెండర్లు ఆహ్వానించారని, ఇవి కూటమి ప్రభుత్వ నిర్ణయాలేనని పేర్కొన్నారు.

## దేశంలో విచారణ పెండింగ్ సిబిఐ కేసులు 7,072

### సివిసి వార్షిక నివేదిక విడుదల

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** దేశంలో కేంద్ర దర్యాప్తుసంస్థ సిబిఐ నమోదుచేసిన అవినీతికేసుల్లో ఇప్పటికీ 7072 కేసులు విచారణపరంగా పెండింగ్‌లో ఉఆననయి. వాటిలో 379 కేసులు 20 ఏళ్లకుపైగా నమోదయిన కేసులని కేంద్ర విజిలెన్స్‌కమిషన్ తన వార్షిక నివేదికలో వెల్లడించింది. మొత్తం కేసుల్లో 1506 కేసులు మూడేళ్లకుపైగా పెండింగ్‌లో ఉన్నాయి. 791 కేసులు మూడేళ్లనుంచి ఐదేళ్లలోపు పెండింగ్‌లో ఉంటే 2115 కేసులు ఐదేళ్లనుంచి పదేళ్లకుపైగా పెండింగ్‌లో ఉన్నాయని సివిసిస్పష్టంచేసింది. మొత్తం 2281 ఇలాంటి అవినీతికేసులు పదేళ్లనుంచి 20 ఏళ్లుగా విచారణలో పెండింగ్‌లో ఉన్నాయి. 2024 డిసెంబరు 31వ తేదీనాటికే 7072 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిలో 2660 కేసులు పదేళ్లకుపైబడి విచారణలో పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడించింది. నివేదికప్రకారంచూస్తే 13,100 కేసుల్లో అప్పీళ్లు, రివిజన్లు అటు సిబిఐ, ఇటు నిందితులు దాఖలుచేసినవి కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇవన్నీ వివిధ హైకోర్టులు, సుప్రీంకోర్టులోనే ఉన్నాయి. 20 ఏళ్లకుపైబడిన కేసులు 606వరకూ ఉనానయి. 1227 కేసులు 15ఏళ్లకుపైబడి, 2989 కేసులు పదేళ్లనుంచి 15 ఏళ్లలోపు విచారణలోపెండింగ్‌లో ఉన్నాయి. 4059 కేసుల్లో ఐదేళ్లనుంచి పదేళ్లలోపు విచారణకు రాని కేసులు ఉన్నట్లు తేల్చింది. రెండేళ్లనుంచి ఐదేళ్లలోపు పెండింగ్‌లో ఉన్న కేసులు 1778 కాగా రెండేళ్లలోపు పెండింగ్ ఉన్న కేసులు 2441 కేసులుగా ఉన్నాయని తెలిపారు. 644 కేసుల్లో తీర్పులు వచ్చాయని, 392 కేసుల్లో శిక్షపడిందని, 154 కేసుల్లో నిందితులు విడుదలకాగా 21 మందిపై ఉన్న అభియోగాలు డిశ్చార్జిచేసారు. మరో 77 కేసులు ఇతర కారణాలదృష్ట్యా కొట్టివేసినట్లు సివిసి తెలిపింది. 2023లో కేసులపరిష్కారం 71.47శాతం కాగా 2024లో 69.14శాతంగా ఉంది. 2024లో 11,384 కోర్టుకేసులు అవినీతిలేని, అవినీతికేసులు వివిధకేసుల్లో విచారణకురానివి ఉన్నాయని సివిసి తెలిపింది. 2024లో సిబిఐ 807 కేసులు నమోదుచేసిందని, వీటిలో 674 రెగ్యులర్‌కేసులు, 133 కేసులుప్రాథమిక దర్యాప్తుకు సంబంధించినవిగా సివిసి వెల్లడించింది. 2024 డిసెంబరునాటికి సిబిఐ 529 కేసులు రిజిస్టరుచేసిందని, అవన్నీ దర్యాప్తు పెండింగ్‌లోనే ఉన్నాయి. వీటిలో 56 కేసులు ఐదేళ్ల పెండింగ్‌లో ఉంటే 60కిపైగా కేసులు మూడేళ్లు, 64కేసులు ఐదేళ్లకుపైబడి, 108 కేసులు ఏడాది నుంచి రెండేళ్లలోపు పెండింగ్‌లో ఉన్నాయి. మరో 241 కేసులు ఏడాదిలోపు విచారణపెండింగ్‌లో ఉన్నట్లు సివిసి తెలిపింది. కేసునమోదుచేసిన ఏడాదిలోగా సిబిఐ దర్యాప్తుపూర్తిచేయాల్సి ఉందని విచారణ పూర్తి అంటే కోర్టులో ఛార్జిషీటును కూడా దాఖలుచేయాలని, కొన్నికేసుల్లో దర్యాప్తు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉందని సివిసి అభిప్రాయపడింది.

# 4 బిల్లులకు అసెంబ్లీ పచ్చజెండా

## మున్సిపల్, పంచాయతీరాజ్ చట్ట సవరణల బిల్లులకు ఆమోదం

### అల్లోపతిక్ ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్స్, ఇస్నాపూర్ మున్సిపాలిటీ విస్తరణ బిల్లులకు ఆమోదం

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** ఆదివారం రెండోరోజు సమావేశమైన శాసనసభ నాలుగు బిల్లులను ఆమోదించింది. నాలుగు బిల్లులను ప్రవేశ పెట్టిన ప్రభుత్వం వాటిని ఆమోదింప చేసుకుంది. 4 బిల్లులను శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. మున్సిపల్ చట్ట సవరణ బిల్లుకు, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుకు, అల్లోపతిక్ ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్ మెంట్స్ బిల్లుకు, ఇస్నాపూర్ మున్సిపాలిటీ విస్తరణ బిల్లుకు, ఇంద్రేశం, జిన్నారం మున్సిపాలిటీల ఏర్పాటు బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. మున్సిపల్, పంచాయతీరాజ్ చట్టసవరణ బిల్లులను తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

దీంతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే అవకాశముంది. తొలుత మున్సిపల్ చట్టసవరణ బిల్లు, ఆ తర్వాత పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులను సభలో ప్రవేశపెట్టి చర్చించి.. అనంతరం ఆ బిల్లులకు సభ ఆమోదం తెలిపింది.

# దుష్ట రాజకీయాలు చేస్తోన్న కాంగ్రెస్

## మోడీని రాజకీయంగా ఎదుర్కొనలేక

### ఆయన మాతృమూర్తిపై దూషణకు దిగిన కాంగ్రెస్

### అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బిజెపి మహిళా నేతల ధర్నా

### బిజెపి రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తల్లిపై కాంగ్రెస్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా, బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నీచ ప్రవర్తనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, రాహుల్ గాంధీ వెంటనే ప్రజల ముందు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీని, భారతీయ జనతా పార్టీని రాజకీయంగా ఎదుర్కోలేక కాంగ్రెస్ పార్టీ దారుణ స్థాయికి దిగజారిందన్నారు. ప్రధాని మోడీ కన్న తల్లిపై అనుచిత, అవమానకర వ్యాఖ్యలు చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీ తమ అసలైన స్వభావాన్ని బయటపెట్టుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీహార్‌లో రాహుల్ గాంధీ చేపట్టిన ఓటర్ అధికార యాత్ర సభలో, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సమక్షంలోనే కాంగ్రెస్ నాయకులు మోడీ తల్లిపై దుర్భాషలాడడం దేశ ప్రజల మనసును కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యతగల ప్రతిపక్ష నాయకుడిగా ఉండి రాహుల్ గాంధీ మౌనంగా ఉండడం సిగ్గుచేటు అన్నారు. మోడీని ఎదుర్కొనే ధైర్యం లేక, ఆయన కుటుంబాన్ని, మాతృమూర్తిని దూషించడం రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నాయకుల బలహీనతను చూపిస్తున్నదని అన్నారు. ఓటు చోరీ యాత్ర కాదు – భారత్ ఇజ్జత్ చోరీ యాత్ర అన్నారు. మొన్న మహిళలపై దూషణలు చేస్తే, ఇప్పుడు మోడీ మాతృమూర్తిని అవమానపరిచారు.

బీహార్ ఎన్నికల్లో ఓటమి తప్పదనే భయంతో, కాంగ్రెస్ పార్టీ పిచ్చి వ్యాఖ్యలకు దిగుతుందని, చరిత్రలో గజని మహ్మద్ 17 సార్లు దండయాత్ర చేసినట్లే.. రాహుల్ గాంధీ యాత్రల పేరుతో మహిళల దూషణల దండయాత్ర చేస్తూ తిరుగుతున్నాడన్నారు. ఒక కాంగ్రెస్ నాయకుడు మోడీ తండ్రి గురించి తిట్టాడు.. మరొకరు తల్లి గురించి దూషించాడు.. ఇంకొకరు భారత్ మాతపై అవమానకర వ్యాఖ్యలు చేశారు.. మరొక కాంగ్రెస్ ముఖ్యమంత్రి గిరిజన మహిళల చర్మరంగంపై దుర్భాషలాడాడు. అంటే.. రాహుల్ గాంధీ రాష్ట్ర ముఖ్యమంత్రి వరకు, ఎంపి నుండి కార్యకర్త వరకు, సోనియా గాంధీ నుంచి మహిళా ఎంపిల వరకు మహిళలను కించపరచడం కాంగ్రెస్ పార్టీ సంప్రదాయంగా మారిందని అన్నారు.

అందుకే గల్లీ నుండి ఢిల్లీ దాకా – గలీజ్ గాళ్లకు అడ్డా కాంగ్రెస్.. ఇండీ కచరా కూటమి అని ప్రజలు చెబుతున్నారన్నారు. ఇటలీ పుత్రుడైన రాహుల్ గాంధీకి తల్లి మాతృభావం, భారత మాత గొప్పదనం అర్థం కాదని, రాహుల్ గాంధీ ప్రజల ముందు క్షమాపణ చెప్పకపోతే దేశ వ్యాప్తంగా మహిళల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. మహిళా శక్తిని అవమానించే కాంగ్రెస్‌కు దేశ ప్రజల తీర్పుతో తగిన బుద్ధి చెప్పాలన్నారు.



బిసిల యుద్ధభేరి సభలో ఐక్యత చాటుతున్న ఆర్.కృష్ణయ్య, మధుసూద నాచారి, నారాయణ, బండారు దత్తాత్రేయ తదితరులు

# బిసి బిల్లును ఎవరైనా వ్యతిరేకిస్తే రాజకీయ సమాధి

## 50 శాతం రిజర్వేషన్లు సాధించేదాకా ఉద్యమిస్తాం

### రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), ఆగస్టు 31, ప్రభాతవార్త:** బిసిలకు రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ అసెంబ్లీలో తీసుకువచ్చిన బిల్లును ఎవరైనా వ్యతిరేకిస్తే సహించేది లేదని, రాజకీయ సమాధి చేస్తామని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య హెచ్చరించారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌లు సాధించిన స్ఫూర్తి తోనే చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్‌లు సాధించేవరకు ఉద్యమిస్తామని, ఇదే చివరి పోరాటమన్నారు.

జాతీయ బిసి సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్ అధ్యక్షతన ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన 'బిసిల యుద్ధభేరి' సభలో ఆయన ప్రసంగించారు. కోర్టుకు ఏవరు వెళ్ళరాదని, ఏవరైన వెళితే పోరాడి విజయం సాధిస్తామన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో వేలాది హాస్టల్స్, గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలు, స్కాలర్‌షిప్‌లు, ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకాలను సాధించడం జరిగిందని, ఈ పథకాలన్ని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసేందుక రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్ని స్తున్నదని, ఎత్తివేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎమ్మెల్సీ, రాష్ట్ర అసెంబ్లీ మాజీ స్పీకర్ సిరికొండ మధుసూధనాచారి మాట్లాడుతూ దోపిడి, అన్యాయం, అణిచివేతకు గురైన బిసిలు రాజ్యాధికారం సాధించాలని, ఇది సాధ్యం కావాలంటే బిసిలంతా ఐక్యంగా ఉండి బిసిలకే ఓట్లు వేయాలని సూచించారు. ఈ సభలో బిసి నేతలు కోలా జనారదన్, నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, పి.సుధాకర్, భరత్‌గౌడ్, శ్రావణి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాల్టీల్లో ఫాగింగ్‌కు డబ్బులు లేవు

### సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** మున్సి పాల్టీలలో నిధుల లేమితో రోజువారీ ఖర్చులు కూడా నిర్వహించలేని పరిస్థితిలో ఉన్నాయని మున్సిపాల్టీలు చేయడం కాదు వాటికి నిధులు సిబ్బంది కూడా సమకూర్చాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. ముఖ్యమంత్రి వద్దనే మున్సిపాలిటీ శాఖ ఉంది. ప్రభుత్వం ఏర్పడి 22 నెలలు అయిందికానీ వాటికి మౌలిక వసతుల కల్పనలో వెనక్కి నెట్టివేశారని ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉండే మున్సిపాల్టీలకు నిధులు విడుదల చేయడం లేదని ఆరోపించారు. మున్సిపాలిటీలు ఎన్ని ఏర్పాటు చేశామన్నది ముఖ్యం కాదు, ఎంత మేర కు అభివృద్ధి చేశాం అన్నది ముఖ్యం అని ఆయన అన్నారు నిధులు ఇస్తున్నారా లేదా? అనేది ఆలో చించాలి. ఫాగింగ్‌కు కూడా డబ్బులు లేని పరిస్థితి. బిఆర్ఎస్ హయాంలో నెల నెల పట్టణ ప్రగతి కింద మున్సిపాలిటీలకు డబ్బులు ఇచ్చాం. ఈ ప్రభుత్వం వచ్చాక నిధులు ఇవ్వలేదు. ఎన్నికలు జరగలేదని ఫైనాన్స్ కమిషన్ డబ్బులు ఇవ్వడం లేదు అని హరీశ్‌రావు తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వం పేదల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తుంది రక్తమాంసాలు పీలుస్తుంది అంటూ ఊదరగొట్టి కాంగ్రెస్ వస్తే ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తాం నో ఎల్ఆర్ఎస్ నో బిఆర్ఎస్ అన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఇవాళ్నేమో బరాబర్ పైసలు కట్టాలని వసూలు చేస్తున్నారు. మరి అదే ప్రజలు నో ఎల్ఆర్ఎస్ నో కాంగ్రెస్ అనే పరిస్థితి వస్తుంది. ఎల్ఆర్ఎస్ జీవో తెచ్చాం.. ఎల్ఆర్ఎస్ ద్వారా వచ్చిన డబ్బుల్లో కొంత మేర ఆ మున్సిపాలిటీ అభివృద్ధికి కేటాయించడం జరుగు తుందని జీవోలో చెప్పాం. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వసూలు చేసిన ఎల్ఆర్ఎస్ డబ్బులను మున్సిపాలిటీలకు ఎప్పటి వరకు అందజేస్తారో చెప్పాలి. వచ్చిన డబ్బు ఎంతనో చెప్పాలి అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. పట్టణ ప్రగతి కింద నిధులు ఇవ్వలేదు.. ఫైనాన్స్ కమిషన్ నుంచి డబ్బులు రావడం లేదు. ఎల్ఆర్ఎస్ నిధుల నుంచి డబ్బులు ఇవ్వడం లేదు. రాష్ట్ర నుంచి నయా పైసా లేదు. మరి ఎలా కొనసాగాలి మున్సిపాలిటీలు. ప్రజలు కట్టిన డబ్బును ఎప్పటిలోగా చెల్లిస్తారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం.

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ద్వారా వచ్చే డబ్బులను కూడా ఇవ్వడం లేదు. మరి మున్సిపాలిటీలు ఎలా నడవాలి..? పరిస్థితి ఏంటి అనేది ఆలోచించాలి. మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు లేరు. కొత్త మున్సిపాలిటీలకు అనుగుణంగా పోస్టులు మంజూరు చేయండి. ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరుతున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కేసీఆర్ పటాన్‌చెరు, సంగారెడ్డి, జహీరాబాద్‌కు ఎస్డీఎఫ్ కింద రూ. 50 కోట్లు మంజూరు చేశారు. ఆ డబ్బులన్నీ మీరు రద్దు చేశారు. ఇదేం పద్ధతి అని హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు.

# మంత్రిమండలిలో 42శాతం కోటా అమలు పరచండి

## బిఆర్ఎస్ అంటే బహుజన రాష్ట్ర సమితి

### కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్



**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రాష్ట్రప్రభుత్వస్థాయిలో బిసిలకు సామాజిక ఆర్థిక అభివృద్ధికోసం 42శాతం కోటాలో చేయాల్సి న రిజర్వేషన్ కల్పించాలని ముఖ్యంగా మంత్రి మండలిలో, కార్పొరేషన్ చైర్మన్ వంటి పదవుల పందేరంలో వెనుకబడిన కులాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కోరారు. ఔశాసనసభలో బిసి బిల్లుపై చర్చ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్లు రావాలని మా పార్టీ కూడా కోరుకుంటుంది.18 జీవో తర్వాత హైకోర్టు ఏం చేసిందంటే, ఇందిరా సహాని ప్రకారం కమిషన్ వేయమని చెప్పింది. ఆ తర్వాత 46 జీవో తీసుకొచ్చింది. నేను బీఆర్ఎస్ పార్టీ తరపున మాట్లాడుతున్నా సూచనను విమర్శగా భావించకండి.బిఆర్ఎస్ అంటే అంటే భారత రాష్ట్ర సమితి కాదుబహుజన రాష్ట్ర సమితి అని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కొత్తగా నిర్వచనం ఇస్తూ మా సూచనను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వంను కోరారు

. బీహార్‌లో బిసి రిజర్వేషన్లు ఫెయిల్ అయినట్టు కావొద్దు అని అంటున్నాను. నిజంగా బిసి లపై చిత్తశుద్ధి ఉంటే కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్ 1992 కింద మాత్రమే డెడికేటెడ్ కమిషన్ వేయాలి అని గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు.బిసి బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉందంటున్నారు. షెడ్యూల్ 9లో బీసీ రిజర్వేషన్లు చేర్చాలి. కాబట్టి సవరణ చేయాలి. అలా చేయకపోతే కోర్టుల్లో ఈ బిల్లు నిలబడదు.

బీహార్, మధ్యప్రదేశ్‌లో కొట్టేశారు. పార్లమెంట్‌లో బిల్లు పాస్ అయితేనే 42 శాతం రిజర్వేషన్లకు ప్రొటెక్షన్ లభిస్తుంది. బిసిల మీద చిత్తశుద్ధి ఉంటే ఈ ప్రకారం చేయండి. భూసాని వెంకటేశ్వర్ రిపోర్టును టేబుల్ చేయండి. బిసిలకు అన్యాయం జరగొద్దని శాస్త్రీయంగా చేయాలని కోరుతున్నా ను అని గంగుల కమలాకర్ పేర్కొ న్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ఏమైంది? ఇది సీఎం చేతు ల్లోనే ఉంది. 42 శాతం మంత్రి వర్గంలో కల్పి స్తామన్నారు. మంత్రివర్గంలో వెనుకబడిన తరగతులకు అవకాశం కల్పిస్తే మేం సంతోషపడు తామని ఆయన అన్నారు

ప్రతి ఏడాది కూడా 20 వేల కోట్లు బిసిలకు బడ్జెట్ పెడుతామన్నారు. ఇప్పటివరకు 20 నెలలు కావొస్తున్నా 20 పైసలు కూడా ఖర్చు పెట్టలేదు. దీనికి చట్టం అవసరం లేదు సిఎం తలచుకుంటే క్షణాల్లో అయిపోతది. ఎంబిసి కులాలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ పెడుతా మన్నారు.. ఇవ్వండి. తెలంగాణలో ఏ వర్కు బిసి లకు ఇవ్వలేదు. బిసిల ఓట్లు గంపగుత్తగా ఓట్లు వేసుకుని అధికారంలోకి వచ్చారు అని గంగుల కమలాకర్ మండిపడ్డారు.

# అమలుకాని ప్రధానమంత్రి ఫసల్ బీమా.. రైతులకు శాపం

### బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** ప్రధానమంత్రి ఫసల్ బీమా (పంటల బీమా)యోజనను తెలంగాణలో రేవంత్ ప్రభుత్వం అమలు చేయకపోవడమే రైతులకు శాపంగా మారిందని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి ఆరోపించారు. భారీ వర్షాలతో తీవ్రంగా రైతాంగం నష్టపోయిన కామారెడ్డి జిల్లాలో బిజెపి కిసాన్ మోర్చా, స్థానిక బిజెపి జిల్లా నాయకులతో కలిసి భిక్కనూరు మండలం రామేశ్వరపల్లి అంతంపల్లి లక్ష్మీ మ్రదేవి పల్లిలో పర్యటించారు. వాగు ఉధృతికి ముంపుకు గురైన పొలాలను పరిశీలించి రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా రైతులు ఇంతవరకు వ్యవసాయ శాఖ అధికారులు గానీ, రెవెన్యూ అధికారులు గానీ నష్టాన్ని నమోదు చేయడానికి రాకపోవడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

కొందరు రైతులు పొలాల్లో పూర్తిగా ఇసుక మేటలు వేసి సాగుకు పనికి రాకుండా పోయిందని శ్రీధర్ రెడ్డి సమక్షంలో కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల అత్యంత నిరక్ష ్యంగా వ్యవహరిస్తున్నదని గతంలో అనేక సందర్భాలలో కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన తెలంగాణలో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని అయినప్పటికీ నిరక్ష ్యంగా వ్యవహరించి నాటి కెసిఆర్ లాగానే రేవంత్ ప్రభుత్వం ప్రధానమంత్రి పంటల బీమా యోజనను తెలంగాణలో అమలు చేయకపోవడం రైతులకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

పంటల బీమా యోజన అమలులో ఉంటే రైతు సహాయం కోసం ఎదురుచూడాల్సి న అవసరం లేకుండా ఇన్సూరెన్స్ కంపెనీ నుండి పరిహారం పొందే అవకాశం ఉండేదన్నారు. ఈ పాపం కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని ధ్వజమెత్తారు. వెంటనే యుద్ధ ప్రాతిపదిక మీద రైతులకు జరిగిన నష్టాన్ని రెవెన్యూ వ్యవసాయ అధికారులతో నమోదు చేయించి ఎకరాకు 50 వేల రూపాయల నష్టపరిహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి తెలంగాణలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పొలాలలో ఇసుకమేట వేసిన నేపథ్యంలో వెంటనే ఇసుకమేటను తొలగించడానికి రైతులకు సహాయ కార్యక్రమాలను ప్రారంభించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు నీలం రాజు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎన్నడూ లేనివిధంగా భారీ వర్షాలతో వరదలతో రైతాంగం పెద్ద ఎత్తున నష్టపోయిన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు రాజకీయ ప్రకటనలకు పరిమితం కాకుండా రైతులను ఆదుకోవడానికి సమగ్ర కార్యాచరణను సిద్ధం చేసి కామారెడ్డికు స్పెషల్ ప్యాకేజీని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పాపయ్య గౌడ్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్మోహన్ రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవర శ్రీనివాస్ బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నిరంజన్ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాటిపల్లి భాస్కర్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ రావు రమేష్ మండల పార్టీ అధ్యక్షుడు ఉప్పరి రమేష్ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు జయపాల్ రెడ్డి జిల్లా నాయకులు రవీందర్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి రాజు రవీందర్ గంగారెడ్డి పిచ్చయ్య లింగారెడ్డి సుధాకర్ రెడ్డి సంపత్ తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియం వద్ద సైక్లింగ్ ర్యాలీని ప్రారంభించిన గవర్నర్ విష్ణుదేవ్‌వర్మ

# సండేస్ అండ్ సైక్లింగ్ విస్తృతం చేయాలి

### గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** పర్యావరణహితానికి, పచ్చని జీవనశైలికి సైక్లింగ్ ఎంతో దోహదం చేస్తుందని, ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమైన సైక్లింగ్‌ను తెలంగాణలో విస్తృతంగా ముందుకు తీసుకెళ్లాలని గవర్నర్ విష్ణుదేవ్ వర్మ అన్నారు. ఆదివారం జాతీయ క్రీడా దినోత్సవాల్లో భాగంగా గచ్చిబౌలి స్టేడియం వద్ద జరిగిన ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జెండా ఊపి సైక్లింగ్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం విస్తృతంగా చేపట్టిన సండేస్ ఆన్ సైక్లింగ్ అనే కార్యక్రమాన్ని జాతీయ ఫిట్‌నెస్ ఉద్యమంలా తెలంగాణలో నిర్వహించాలన్నారు. ఫిట్నెస్‌కి డోస్ అరగంట రోజ్ అన్న నినాదాన్ని విద్యార్థుల్లో యువకుల్లో ఉద్యోగులు స్వచ్ఛంద సంస్థలు వివిధ వర్గాల ప్రజల్లో అవగాహన కలిగించే కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు. క్రీడా కార్యక్రమాల్లో అందరూ పాల్గొనడం వల్ల సామాజిక బంధాలను బలపరుస్తాయన్నారు. క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, రాష్ట్ర క్రీడా శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ జాతీయ క్రీడా దినోత్సవం తొమ్మిది రోజుల పాటు ఘనంగా నిర్వహించి, దేశంలోనే ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలబడిందని అన్నారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ప్రోత్సాహంతో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ నిర్వహించే కార్యక్రమాలకు దేశ వ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయని, సైక్లింగ్ క్రీడను మరింతగా ప్రోత్సహించే కార్యక్రమాలు విస్తృతస్థాయిలో చేపడతామని అన్నారు.

# ప్రజల కష్టాల్లో తోడుగా ఉండటం మా కర్తవ్యం, బాధ్యత

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో భారీ వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో, భారతీయ జనతా పార్టీకి చెందిన తెలంగాణ రాష్ట్రంలోని ఆరుగురు ఎంపిలు, ఇద్దరు కేంద్రమంత్రులు తమ ఎంపి నిధుల నుంచి ఒక్కొక్కరు రూ.10 లక్షల చొప్పున కేటాయించడం ద్వారా ప్రజల పక్షాన నిలబడ్డారని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు అన్నారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజల సమస్యలపై నిరక్ష ్యం చూపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిన సందర్భంలో, బిజెపి ఎంపిలు తక్షణమే ముందుకు వచ్చి సహాయక చర్యల కోసం నిధులను కేటాయించడం గమనార్హం అని అన్నారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజల పక్షాన నిలబడి సహకారం అందించిన బిజెపి ఎంపిలు, కేంద్రమంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడల్లా బిజెపి ముందుండి తోడ్పడుతుంది. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతీయ జనతా పార్టీ ప్రజా హితం కోసం పనిచేస్తుంది. ప్రజల పక్షాన నిలబడేది బిజెపి మాత్రమే అన్నది మరోసారి రుజువైందన్నారు. ప్రజల కష్టాల్లో తోడుగా ఉండటం, సహాయక చర్యల్లో పాల్గొనడం భారతీయ జనతా పార్టీ కర్తవ్యబాధ్యత అని గుర్తుచేశారు. తెలంగాణ ప్రజల భవిష్యత్తు కోసం మా పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.

# బిసి వర్గాల జీవితాల్లో వెలుగు నింపేందుకే 42 శాతం రిజర్వేషన్లు

### బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 31 ప్రభాతవార్త:** అసెంబ్లీలో రిజర్వేషన్ల క్యాప్ ఎత్తివేస్తూ బీసీ లకు 42 శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేసేందుకు బిల్లు ఆమో దించిన నేపథ్యంలో మంత్రివర్గానికి తమ హర్షమోదాలు తెలుపుతూ, జిల్లా కేంద్రాలలో పెద్దఎత్తున సంబరాలు చేసుకోవాలని, బీసీ సమాజానికి కోరు తున్నట్లు బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. గత ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్ శాతాన్ని సీలింగ్ చేస్తూ చేసిన క్యాప్ ఎత్తివేస్తూ బీసీలకు 42 శాతం స్థానిక సంస్థలలో రిజర్వేషన్‌లు అమలు చేసేం దుకు బిల్లు ఆమోదించిన నేపథ్యంలో, మంత్రివర్గానికి, ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్‌ఖర్గేకు లోక్‌సభ ప్రధానప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి, సిఎం రేవంత్‌రెడ్డికి, పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు, ఎఐసిసి రాష్ట్ర ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజ్‌కు, మంత్రివర్గానికి ధన్యవాదాలు తెలుపుతూ, అన్ని జిల్లాలవ్యాప్తంగా బాణాసంచాకాల్చి స్వీట్స్ పంచి సంబరాలుచేసి పత్రికా విలేకరుల సమావేశాలు ఏర్పాటుచేసి ఈ చారిత్రక ఘట్టాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నూతి శ్రీకాంత్‌గౌడ్ కోరారు.

# తూతూమంత్రంగా అసెంబ్లీ సమావేశాలు

## బిసిల పట్ల కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు

### బిఆర్ఎస్ ఎమ్మెల్యే కె.పి.వివేకానందగౌడ్



**హైదరాబాద్, ఆగస్టు 31 ప్రభాతవార్త:** తూతూ మంత్రంగా అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్న సీఎం రేవంత్ రెడ్డిపై బిఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్ నిప్పులు చెరిగారు. అసెంబ్లీ సమావేశాలను పక్కనపెట్టి సీఎం కేరళ పర్యటనకు వెళ్లడం.. వారికి బీసీల పట్ల ఉన్న చిత్తశుద్ధి ఏంటో అర్థమవుతుందన్నారు. ఆదివారం అసెంబ్లీ మీడి యా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో ఏబిల్లులు పెడతారో స్పష్టత ఇవ్వలేదని రాష్ట్రంలో వరదలతో, యూరియా కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అసెంబ్లీ సమావేశాలను పట్టించుకోకుండా పుస్తక ఆవిష్కరణ కోసం ఫ్లైట్ బుక్ చేసుకొని మరి సీఎం కేరళకు వెళ్లారు అని మండిపడ్డారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో వరద కారణంగా ఇబ్బంది పడుతున్నారని రైతులు యూరియా కోసం ఎదురు చూస్తున్నారు. ఇలాంటి సమయంలో మేమంతా అసెంబ్లీకి వచ్చామన్నారు. రేవంత్‌రెడ్డికి డిల్లీలో హై కమాండ్‌కు భజన చేయడం, కుర్చీ కాపాడుకోవడం తప్పా రాష్ట్ర ప్రయోజనాలు పట్టడం లేదన్నారు. రాజకీయ కక్షతో పీసీ ఘోష్ రిపోర్ట్‌పై చర్చ పెట్టారని పీసీ ఘోష్ కమిషన్ కేవలం కాంగ్రెస్ కమిషన్ మాత్రమే అన్నారు. ఇంకా కొన్ని రోజులు సభ నడ పాలని డిమాండ్ చేస్తుంటే పట్టించుకోవడం లేదని యూరియాపై చర్చ చేద్దామంటే స్పందన లేదని వివేకానంద పేర్కొన్నారు.

**కాళేశ్వరంపై కెసిఆర్ లక్ష కోట్లు దోచుకున్నాడు: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



కెసిఆర్ కాలేశ్వరం ప్రాజెక్టును కామ ధేనువుగా వాడుకుని 30 వేల కోట్ల బడ్జెట్ తో కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభించి లక్ష కోట్లు దోచుకున్నారని ప్రభు త్వ విప్, వేముల వాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ విమర్శిం చారు. ఈ మేరకు మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ అవినీతి అక్రమాలతో తెలంగాణ ఆత్మగౌరవం ఎప్పుడో పోయిందన్నారు. కోర్టులో లంచు మోషన్ పిటిషన్ వేసి కాళేశ్వరంపై చర్చ జరగకుండా చేసే ప్రయత్నం చేశారని కమీషన్‌ను కూడా తప్పు పడుతు న్నారన్నారు. యూరియా కొరతపై కావాలనే రచ్చ చేస్తున్నారని తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నులు అవసరం ఉంటే కేంద్రం అందుకు తగ్గట్టు ఇవ్వడం లేదన్నారు.

**కాళేశ్వరం భయంతోనే యూరియా నినాదం : కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి**

కాళేశ్వరం ప్రాజెక్టు నివేదికపై భయంతో బిఆర్ఎస్ యూరియా నినాదం ఎత్తుకుందని కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మండిపడ్డారు. ఈమేరకు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ ఇద్దరు ముగ్గురు కలిసి కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్షలకోట్లు దోచుకుని తిన్నారన్నారు. ప్రాజెక్టు ఎస్టిమేషన్ ఎం? ఎంత వరకు తీసుకెళ్లారు. అనే విషయం వాస్తవాలు ప్రజలకు తెలువాల్సి న అవసరం ఉందన్నారు. వరంగల్ కు చెందిన బాలు నాయక్ అనే రైతుకు యూరియా వచ్చినప్పటికీ బి.ఆర్.ఎస్ దొంగలు కావాలని రైతుతో పత్తిని చేను నుండి తీయించి ధర్నా చేయించారని మండిపడ్డారు.

**వరద బాధిత రైతులను ఆదుకోవాలి**

**బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్**

ఇటీవల కురిసిన వరదల కారణంగా రాష్ట్రంలో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్,మెదక్ జిల్లా లో రైతులకు వేలకోట్ల రూపాయల పంట నష్టం జరిగింది వేల ఇండ్లు నీట మునిగి 10 నుండి 15 మంది చనిపోవడం జరిగింది బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఈమేరకు ఆదివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ 70 నుండి 80 శాతం పంట పై పెట్టుబడి పెట్టిన రైతు పంట నీట మునిగిందన్నారు. కావున ప్రభుత్వం దగ్గరనుండి రైతుకు భరోసా ఇచ్చేటట్టు ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. శాసన సభ సమావేశాల్లో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్య అతివృష్టి వల్ల రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయమని చెప్పామని ఆ పథకం తెస్తే రైతు భరోసాగా ఉంటాడన్నారు. బడ్జెట్లో 3000 కోట్లు పెట్టి చివరికి మూడు రూపాయిలు కూడా పంట బీమా ఇవ్వలేదుని మండిపడ్డారు. పంట బీమా లేని కారణంగా ప్రకృతి నష్టానికి రైతు నష్టపోయాడని పత్తికి ఎకరాకు 50 వేలు, సోయాబీన్‌కు 40వేలు, వరి పంటకు ఎకరాకు 30 వేల నష్టపరిహారం, కందులకు 40 వేల రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ శాసనసభ సమావేశాల్లోనే ప్రభుత్వం రైతు బీమా ప్రకటించాలని లేదంటే బీజేపీ ఆధ్వర్యంలో నష్టపోయిన రైతుల పక్షాన ఆందోళన చేస్తామని పాయల్‌శంకర్ పేర్కొన్నారు.

## అసెంబ్లీ మీడియా పాయింట్

**గోదావరి పరీవాహకాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయ్ : బిజెపి ఎమ్మెల్యేలు, రామారావుపటేల్, పాల్వాయి హరీశ్, సూర్యనారాయణ**

గోదావరి పరివాహక ప్రాంతాల్లో వరదల వల్ల పంటల తీవ్రంగా దెబ్బ తిన్నాయని సోయా, పత్తి, వరి పంటలు



దెబ్బతిన్నాయని వెంటనే రైతులకి నష్టపరిహారం ఇవ్వాలని బిజెపి ఎమ్మెల్యేలు రామారావు పటేల్, పాల్వాయి హరీష్, దన్‌పాల్ సూర్యనారాయణలు డిమాండ్ చేశారు. మీడియా పాయింట్ వద్ద వారు మాట్లాడుతూ రైతేరాజు అంటారు. ఇప్పుడు రైతును పట్టించుకోవడం లేదన్నారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లో తీవ్రంగానష్ట పోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే బిసి రిజర్వేషన్‌లకి బీజేపీ పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తుందని మతపరమైన రిజర్వేషన్లకు వ్యతిరేకిస్తుందన్నారు. 42 రిజర్వేషన్ బీసీ లకు మాత్రమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. 10 శాతం ముస్లిం లకి ఇస్తే వక్ బోర్డ్ ఆస్తులు హిందువులకి ఇస్తారా..అని ప్రశ్నించారు. కెసిఆర్ గతంలో పోడు రైతు లని ఇబ్బందిపెట్టి.. శంకరగిరిమాన్యాలకి పోయిం దని..కాంగ్రెస్‌కి అదే గతి పడుతుందని పేర్కొన్నారు.

01-09pg10 12 ONG_01-09pg10.qxd 8/31/2025 10:46 PM Page 1



### ఆసియా షూటింగ్ ఛాంపియన్‌లో..

# నం.వన్ భారత్


## 50 స్వర్ణాలతో ముగిసిన టోర్నీ



**న్యూఢిల్లీ:** అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన భారత్ 50 బంగారు పతకాలతో ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్-2025ను ముగించింది. కజకిస్తాన్‌లోని షిమ్‌కెంట్‌లో జరిగిన 16వ ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ జట్టు చారిత్రాత్మక అత్యుత్తమ ప్రదర్శనను నమోదు చేసి 50 స్వర్ణాలతో అగ్రస్థానంలో నిలిచింది. రైఫిల్, పిస్టల్ మరియు షాట్‌గన్ విభాగాలలో జరిగిన 15 ఒలింపిక్ ఈవెంట్లలో సీనియర్ భారత్ షూటర్లు 6 స్వర్ణాలు, 2 రజతాలు, 3 కాంస్య పతకాలను గెలుచుకున్నారు. 8 స్వర్ణాలను గెలుచుకున్న ప్రపంచ పవర్‌హౌస్ చైనా కంటే వెనుకబడి, ఆతిథ్య కజకిస్తాన్ మరొకటి కైవసం చేసుకుంది. 100 పతకాల మార్కుకు కొద్ది దూరంలోనే భారత్ ఛాంపియన్‌షిప్‌ను ముగించింది. 26 రజతాలు, 23 కాంస్యాలతో సహా 50 స్వర్ణాలతో. ఆతిథ్య జట్టు 70 పతకాలు, 21 స్వర్ణాలతో రెండవ స్థానంలో ఉండగా, చైనా 15 స్వర్ణాలు, 37 పతకాలతో మొత్తం మీద 3వ స్థానంలో ఉంది. సీనియర్ మహిళల ఎయిర్ రైఫిల్‌లో రెండుసార్లు ఒలింపియన్ ఎలవెనిల్ వలరివన్ ఆసియా రికార్డు స్కోరుతో రెండవ ఆసియా కిరీటాన్ని (ఆమె మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో అర్జున్ బాబుటాతో కలిసి డబుల్ స్వర్ణం గెలుచుకుంది). మహిళల ట్రాప్‌లో భారత్ తరపున నీరూ దండా తొలి స్వర్ణం, మహిళల 50 రైఫిల్ 3పొజిషన్‌లో సిఫ్ట్ కౌర్ సామ్రా తొలి ఆసియా టైటిల్, ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ పురుషుల టైటిల్ కైవసం, భారత్ జూనియర్ షూటర్లు కూడా అన్ని ఒలింపిక్ ఈవెంట్లలో పూర్తిగా ఆధిపత్యం చెలాయించడం ద్వారా దేశ ప్రతిభ ప్రదర్శించారు. ఒక్కొక్కరు 10 స్వర్ణాలు, 4 రజతాలు, 3 కాంస్య పతకాలను గెలుచుకున్నారు.

# యుఎస్ ఓపెన్‌లో యుకీ జోడీ ముందుకు

## బోపన్న ద్వయం నిష్క్రమణ



**న్యూఢిల్లీ:** యుఎస్ ఓపెన్‌లో యుకీ భాంబ్రీ-మైఖేల్ వీనస్ ముందుకు దూసుకుపోగా, బోపన్న-కాడే ద్వయం మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించింది. న్యూయార్క్‌లో ఆదివారం జరిగిన పురుషుల డబుల్స్‌లో భారత జోడీ యుకీ భాంబ్రీ, అతని భాగస్వామి న్యూజిలాండ్‌కు చెందిన మైఖేల్ వీనస్ ఆధిపత్య విజయంతో రెండో రౌండ్‌కు దూసుకెళ్లగా, రోహన్ బోపన్న-అర్జున్ కాదే తొలి రౌండ్‌లో పరాజయంతో నిష్క్రమించింది. 14వ సీడ్ గా బరిలోకి దిగిన భాంబ్రి, వీనస్ జంట కేవలం గంట వ్యవధిలోనే అమెరికన్లు మార్కోస్ గిరోన్, లెర్నర్ టియన్ లను 6-0, 6-3 తేడాతో ఓడించారు. రెండో సెట్ ప్రారంభంలోనే బ్రేక్ చేసి మ్యాచ్‌ను ముగించారు. మొత్తం మూడు ఆటలను మాత్రమే కోల్పోయారు. ఇక మొనాకోకు చెందిన రొమైన్ ఆర్నియోడోతో జతకట్టిన బోపన్న, అమెరికన్ ద్వయం రాబర్ట్ క్యాష్-జేమ్స్ ట్రేసీ చేతిలో 4-6, 3-6 తేడాతో ఓడిపోయాడు. దాదాపు 65 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో క్యాష్-ట్రేసీ కీలకమైన బ్రేక్ పాయింట్లను సద్వినియోగం చేసుకుని ఓటమిని చవిచూశారు. యుఎస్ ఓపెన్‌లో అరంగేట్రం చేసిన అర్జున్ కాడే, ఈక్వెడార్‌కు చెందిన డియెగో హిడాల్గోతో కలిసి రెండవ సీడ్ జంట మేట్ పావిక్-మార్సెలో అరెవాలోతో తలపడ్డారు. కాడే-హిడాల్గో మొదటి సెట్‌ను 7-5తో కైవసం చేసుకున్నా, చివరికి హోరాహోరీ పోరులో 7-5, 6-7(4), 36తో ఓడిపోయారు. దీంతో పురుషుల డబుల్స్‌లో భాంబ్రీ-వీనస్ మాత్రమే భారత్ తరపున టోర్నీలో కొనసాగుతున్నారు.

### ముక్కోణపు టి20లో..

# పాక్ రెండో విజయం

## 31 రన్స్ తేడాతో యుఎఇ చిత్తు

**న్యూఢిల్లీ:** ముక్కోణపు టీ20 సిరీస్‌లో పాకిస్థాన్ అదరగొడుతోంది. ఈ ట్రైసిరీస్‌లో వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. తొలి మ్యాచ్‌లో ఆఫ్గానిస్తాన్‌ను చిత్తు చేసిన పాకిస్థాన్ ఇప్పుడు రెండో మ్యాచ్‌లో యుఎఇ పై అదే ఫలితాన్ని పునరావృతం చేసింది. షార్జాలో ఆదివారం



జరిగిన మ్యాచ్‌లో యూఏఈపై 31 పరుగుల తేడాతో మెన్ ఇన్ గ్రీన్ విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 207 పరుగులకు ఆలౌటైంది. పాక్ బ్యాటర్లలో సైమ్ ఆయుబ్ (38 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లతో 69), హసన్ నవాజ్ (26 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్స్‌లతో 56) మెరుపు హాఫ్ సెంచరీలతో మెరిశారు. వారితో మహ్మద్ నవాజ్ (25), అష్రాఫ్ (16) రాణించారు. యూఏఈ బౌలర్లలో సిద్దఖీ, నగీర్ ఖాన్ తలా 3 వికెట్లు పడగొట్టగా, హైదర్ అలీ 2 వికెట్లు సాధించాడు. అనంతరం భారీ లక్ష్య ఛేదనకు దిగిన యూఏఈ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 176 పరుగులకే పరిమితమైంది. యూఏఈ బ్యాటర్ ఆసిఫ్ ఖాన్ (35 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్స్‌లతో 77) మెరుపు ఇన్నింగ్స్ ఆడినప్పటికీ తన జట్టును గెలిపించుకోలేకపోయాడు. అతడితో మహ్మద్ వసీం (33) ఫర్వాలేదనిపించాడు. మిగిలిన బ్యాటర్లంతా దారుణంగా విఫలమయ్యారు. పాక్ బౌలర్లలో హసన్ అలీ 3 వికెట్లు పడగొట్టగా, నవాజ్ 2, మిర్జా, ఆయూబ్ ఒక్క వికెట్ సాధించారు.







# రాజస్థాన్ రాయల్స్‌లో అంతర్గత విభేదాలు

## మూడు గ్రూపులుగా టీం.. కెప్టెన్ రేసులో ముగ్గురు

**న్యూఢిల్లీ:** రాజస్థాన్ రాయల్స్ జట్టులో అంతర్గత గొడవలు మొదలయ్యాయి. ఈ సీజన్‌లో రాజస్థాన్ పాయింట్ల పట్టికలో 9వ స్థానంలో ఉంది. తాజాగా రాహుల్ ద్రవిడ్ రాజీనామా చేయడం దాని వెనుక ఈ విభేదాలే కారణాలు అని తెలుస్తోంది. జట్టు మూడు గ్రూపులుగా విడిపోయి ఒక్కో గ్రూపు ఒక్కో ఆటగాడిని కెప్టెన్‌గా చేయాలని పట్టుదలతో ఉన్నాయి. ద్రావిడ్ కోచింగ్‌లో భారత టీ20 ప్రపంచ కప్ 2024 గెలిచింది. దాని తర్వాత రాజస్థాన్ తమ మాజీకెప్టెన్ ద్రావిడ్‌ను హెడ్ కోచ్‌గా నియమించింది. కానీ ఒక సీజన్ తర్వాతే ఆయన జట్టు నుంచి తప్పుకున్నాడు. ద్రావిడ్‌కు మరో పోస్ట్ ఆఫర్ చేసినా ఆయన అంగీకరించలేదు. ఫ్రాంఛైజీ తీసుకుంటున్న నిర్ణయాలు ద్రావిడ్ ప్రణాళికలకు భిన్నంగా ఉండటం వల్ల ఆయన రాజీనామా చేశాడు. ఈ నేపథ్యంలో జట్టు 3గ్రూపులుగా విడిపోయింది. రాజస్థాన్ రాయల్స్‌లో ఒక గ్రూపు రియాన్ పరాగ్‌ను కెప్టెన్‌గా చేయాలనుకుంటోంది. పరాగ్ గతంలో సంజు శాంసన్ లేని సమయంలో, ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఉన్నప్పుడు కెప్టెన్‌గా వ్యవహరించాడు. 23 ఏళ్ల పరాగ్ 2019 నుంచి ఈ జట్టులో ఉన్నాడు. ఆయన ఇప్పటివరకు 84 మ్యాచ్‌లలో 1566 పరుగులు చేశాడు. అలాగే మరో గ్రూప్ యశస్వి జైస్వాల్‌ను కెప్టెన్‌గా చేయాలని యత్నాలు చేస్తోంది. యశస్వి తన మొదటి సీజన్ నుంచే రాజస్థాన్ రాయల్స్‌కు ఆడుతున్నాడు. అతను 2020లో తొలిసారి ఈ జట్టు కోసం ఆడాడు. యువకుడైన జైస్వాల్ ప్రస్తుతం భారత జట్టులో కూడా ఉన్నాడు. ఆసియా కప్ జట్టులో అతను రిజర్వ్ ప్లేయర్‌గా ఉన్నాడు. కాగా మూడో గ్రూపు సంజు శాంసన్ కెప్టెన్‌గా కొనసాగాలని కోరుకుంటోంది. కొన్ని రోజుల క్రితం, రాజస్థాన్ శాంసన్‌ను ట్రేడ్ డీల్ ద్వారా మార్చవచ్చని చర్చ జరిగింది. 30 ఏళ్ల సంజు శాంసన్ 2013లో రాజస్థాన్ రాయల్స్‌కు తొలిసారిగా ఆడాడు. ఆ తర్వాత 2015 వరకు ఈ జట్టులో ఉన్నాడు. 2016, 2017లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆడి, 2018లో తిరిగి రాజస్థాన్‌కు వచ్చాడు. అప్పటి నుంచి ఈ జట్టులో కొనసాగుతూ ఇప్పుడు కెప్టెన్‌గా కూడా ఉన్నాడు. ఐపీఎల్‌లో మొత్తం 177 మ్యాచ్‌లలో 4704 పరుగులు చేశాడు. సంజు ఆసియా కప్ 2025 జట్టులో కూడా ఉన్నాడు.

### మహిళల ఛాంపియన్‌షిప్..

# భారత్ ఓటమి

## 3-4 తేడాతో బంగ్లాదేశ్ విక్టరీ



**న్యూఢిల్లీ:** శాప్ అండర్ 17 మహిళల ఛాంపియన్‌షిప్-2025 చివరి పూల్ మ్యాచ్‌లో బాంగ్లాదేశ్ చేతిలో భారత్ ఓటమి చెందింది. భూటాన్‌లోని చాంగ్లిమితాంగ్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఈ చివరి మ్యాచ్‌లో అత్యధిక స్కోరింగ్ థ్రిల్లర్‌లో బంగ్లాదేశ్ కొన్ని గోల్స్‌తో మూడుసార్లు ఆధిక్యంలోకి దూసుకెళ్లడంతో భారత్ మహిళా జట్టు తన ప్రచారాన్ని నిరాశాజనకంగా ముగించింది. ఈ ఓటమి చెందినప్పటికీ, యంగ్ టైగ్రెస్సెస్ ఛాంపియన్లుగా నిలిచారు. చేతిలో ఒక ఆట ఉండగానే పాయింట్ల పట్టికలో తిరుగులేని ఆధిక్యాన్ని సంపాదించారు. యంగ్ టైగ్రెస్సెస్ 5 విజయాలు, ఒక ఓటమితో మహిళల ఛాంపియన్‌షిప్‌ను ముగించింది. తొలి నిమిషంలోనే బంగ్లాదేశ్ తరపున పూర్ణిమ మర్మ గోల్ చేయగా, 9వ నిమిషంలో భారత క్రీడాకారిణి అనుష్క కుమారి గోల్ చేసి స్కోరును సమం చేసింది. అయితే, 34వ నిమిషంలో ఆల్పి అక్టర్ గోల్ చేయడంతో బంగ్లాదేశ్ తిరిగి ఆధిక్యాన్ని పొందింది. 48వ నిమిషంలో సౌరవి ప్రీతి దాన్ని పొడిగించింది. 65వ నిమిషంలో ప్రీతికా బర్మన్ చేసిన స్ట్రైక్‌తో భారత్ గోల్‌ను వెనక్కి తీసుకుంది. 89వ నిమిషంలో కెప్టెన్ జులన్ గోల్‌ను సమం చేసింది. ఇంజురీ టైమ్‌లో ప్రీతి మళ్ళీ గోల్ చేసి బంగ్లాదేశ్‌కు విజయాన్ని అందించింది. ఆట ప్రారంభమైన 30 సెకన్లలోనే పూర్ణిమ మర్మ ద్వారా బంగ్లాదేశ్ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. దీనితో యంగ్ టైగ్రెస్సెస్ మొత్తం టోర్నమెంట్‌లో ఇచ్చిన తొలి గోల్‌గా నిలిచింది. క్లీన్ షీట్ పరంపర ముగిసింది.

# 77 యాప్‌లు ప్లేస్టోర్‌నుంచి తొలగింపు



**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** యాప్‌లపై టెక్ దిగ్గజం గూగుల్ కొరడా ఝుళిపించింది. ప్లే స్టోర్ నుంచి గూగుల్ 77 ప్రమాదకరమైన యాప్‌లను తొలగించింది. ఆయా యాప్‌లన్నీ వినియోగదారుల భద్రత, గోప్యతకు ముప్పుగా మారడంతో చర్యలు తీసుకున్నది. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం గూగుల్ గత సంవత్సరం సుమారు 40 లక్షల యాప్‌లను తొలగించింది. సగటున ప్రతిరోజూ 11వేల యాప్‌లను ప్లే స్టోర్ నుంచి వేటు వేసింది. ఈ యాప్‌లలో సగానికి పైగా డేటా భద్రత, గోప్యతా నియమాలను ఉల్లంఘిస్తున్నాయని తేలింది. గూగుల్ గత సంవత్సరం యాప్ ప్లబిషింగ్‌కు సంబంధించి కఠినమైన నియమాలను అమలు చేస్తామని ప్రకటించింది. 2024 ప్రారంభం నాటికి ప్లే స్టోర్‌లో ఉన్న దాదాపు సగం యాప్‌లను తొలగించారు. గూగుల్ ఈ సంవత్సరం దాదాపు 1.55 లక్షల డెవలపర్ ఖాతాలను కూడా బ్లాక్ చేసింది. కంపెనీ ఇప్పుడు సైడ్‌లోడెడ్ యాప్‌లపై కఠినమైన చర్యలు తీసుకుంటోంది. ఇప్పుడు ధ్రువీకరణ ప్రక్రియ ద్వారా వెళ్లే డెవలపర్స్ మాత్రమే యాప్‌లను ప్రచురించగలరని గూగుల్ చెబుతోంది. ప్లే స్టోర్ నుంచి ఒక యాప్ అదృశ్యమైతే.. దాని అర్థం డెవలపర్ దాన్ని తీసివేసినట్లు కాదని గూగుల్ వినియోగదారులను హెచ్చరించింది. తరచుగా దీనికి కారణం యాప్ నియమాలను ఉల్లంఘించడమే. అయితే, యాప్ ఇప్పటికే మీ ఫోన్‌లో ఉంటే అది రన్ అవుతూనే ఉంటుంది. కానీ, అది మరిన్ని అప్‌డేట్‌లు అందవు. యాప్ ప్రమాదకరమైనదిగా తేలితే ప్లే ప్రొటెక్ట్ దాన్ని అన్ ఇన్‌స్టాల్ చేయమని హెచ్చరిస్తుంది అని కంపెనీ స్పష్టం చేసింది. కానీ, అలాంటి హెచ్చరిక రాకపోతే యాప్ భద్రతా అప్‌డేట్స్ లేకుండా మీ ఫోన్‌లో రన్ అవుతూనే ఉంటుంది. యూజర్లు సురక్షితంగా డౌన్‌లోడ్ చేసుకునే అలవాటును మార్చుకోవాలని నిపుణులు అంటున్నారు. యాప్‌లను డౌన్‌లోడ్ చేస్తున్నప్పుడు అనుమతులను తనిఖీ చేయాలని రివ్యూలను చదవాలని విశ్వసనీయ డెవలపర్‌ల నుంచి మాత్రమే యాప్‌లను ఇన్‌స్టాల్ నివేదిక పేర్కొంది. ఆండ్రాయిడ్ అథారిటీ నివేదిక ప్రకారం గూగుల్ ప్రస్తుతం ప్లే స్టోర్‌లో కొత్త 'అన్‌ఇన్‌స్టాల్' బటన్‌ను పరీక్షిస్తోంది. ఈ బటన్ యాప్ పేజీలో నేరుగా కనిపిస్తుంది. తద్వారా వినియోగదారులు తమ ఫోన్ నుంచి ఏదైనా యాప్‌ను వెంటనే తీసివేసే అవకాశం ఉంది.

### కార్పొరేట్ విదేశీ వాణిజ్య

# రుణాల్లో భారీ పెరుగుదల



**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** విదేశీ వాణిజ్య రుణాలపరంగా ఈ ఏడాది ఏప్రిల్‌జూన్‌త్రైమాసికంలో గణనీయంగా పెరిగాయి. గత ఏడాది ఇదేకాలంలో 2.8 బిలియన్ డాలర్లు రుణం పొందితే ఈసారి ఇదేకాలంలో ఏకంగా 4.6 బిలియన్ డాలర్లకుపెరిగాయి. భారతీయ రిజర్వుబ్యాంకు ఈ డేటా వివరాలను విడుదలచేసింది. ఆగస్టు నెలవారీ బులిటెన్‌లో విదేశీ వాణిజ్యరుణాలకు రిజిస్ట్రేషన్లు మెరుగుపడుతున్నట్లు తెలిపింది. అయితే తొలిత్రైమాసికంలో రిజిస్ట్రేషన్‌లు మందగించాయి. గత ఏడాది 11.1 బిలియన్ డాలర్ల రుణాలకోసం దరఖాస్తులు వస్తే ఈ ఏడాది 9.1 బిలియన్ డాలర్లకు మాత్రమే రిజిస్ట్రేషన్లు వచ్చినట్లు తెలిపింది. నికర రాబడులు రుణాలు పెరుగుతున్నా రిజిస్ట్రేషన్లలో స్వల్పంగా మందగమనం ఉన్నట్లు గుర్తించింది. ఐపిఒలు, విదేశీ వాణిజ్యరుణాలరూపంలో మూలధన వ్యయాలకోసం ముందు త్రైమాసికంతో పోలిస్తే కొంత తగ్గాయి. నెలవారీ ధోరణులు చూస్తే క్రమానుగతంగా జూన్‌లో కేవలం 0.2 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. అదే మేనెలలో 1.2 బిలియన్ డాలర్లని ఆర్బీఐ తెలిపింది. ఇసిబి రిజిస్ట్రేషన్లపరంగా జూన్‌లో 3.5 బిలియన్ డాలర్లకు చేరాయి. అదే మేనెలలో 2.7 బిలియన్ డాలర్లు మాత్రమే ఉన్నట్లు తెలిపింది. ఇక విదేశీ వాణిజ్యరుణాలకోసం 113 రిజిస్ట్రేషన్లు జూన్‌లో వచ్చాయి. వీటి విలువలుమొత్తం 3.5 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. అదే మేనెలలో 2.73 బిలియన్ డాలర్లకోసం 100 రిజిస్ట్రేషన్లురాగా జూన్2024లో 2.81 బిలియన్‌డాలర్ల విలువైన 125 దరఖాస్తులు వచ్చినట్లు ఆర్బీఐ విశ్లేషించింది. ఉత్పత్తిరంగానికి ఇచెందిన కార్పొరేట్ సంస్థలు 954 మిలియన్ డాలర్లమేర జూన్‌లో దరఖాస్తులుచేసాయి. అదే గత ఏడాది జూన్‌లో 603 మిలియన్ డాలర్ల విలువైన రిజిస్ట్రేషన్లు మాత్రమే ఉన్నాయి. సేవలరంగంలో ఇసీబిలకోసం 19 మిలియన్ డాలర్ల దరఖాస్తులు వచ్చాయి. అదే గత ఏడాదిజూన్‌లో 37 మిలియన్ డాలర్లతోపోలిస్తే తగ్గాయి. ఇక ఎన్బీఎఫ్‌సిలు గత ఏడాది 1.31 బిలియన్ డాలర్లకు రిజిస్ట్రేషన్‌లు దాఖలుచేస్తే ఈసారి కేవలం 682 మిలియన్ డాలర్లు మాత్రమే ఉన్నాయి. ఫిక్స్‌డ్ వడ్డీరేట్ల పరిధి శూన్యశాతంనుంచి 10.50శాతంవరకూ ఉన్నాయి. అదే గత ఏడాది జూన్‌లో జీరో నుంచి 11శాతం వరకూ ఉన్నట్లు వెల్లడించింది.



## భారత్‌లోకి మళ్లీ టిక్‌టాక్!

### నియామకాలకు నోటిఫికేషన్

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** భారత్‌లోనిషేధం ఎదుర్కొంటున్న ప్రముఖ సోషల్‌మీడియా యాప్ టిక్‌టాక్ తాజా ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్ జారీచేసింది. గురుగ్రామ్‌లోని తన ఆఫీస్‌లో 2 ఖాలీలను భర్తీచేయనున్నట్లు పోస్టుచేసింది. వీటిలో ఒకటి కంటెంట్ మోడరేటర్ బెంగాలీ మాట్లాడే అభ్యర్థి, మరొకటి మంచి భాగస్వామ్యం, కార్యకలాపాల నాయకత్వానికి సంబందించినపోస్టులు. ఈ క్రమంలో టిక్‌టాక్‌సేవలు మళ్లీ భారత్‌లో అందుబాటులోకి వస్తున్నట్లుప్రచారం జోరందుకుంది. టిక్‌టాక్ వెబ్‌సైట్‌ను అనేకమందియాక్సెస్‌చేస్తున్నారు. అయితే దానిలోకి లాగిన్‌కావడం, విడియోలను చూడటం సాధ్యంకావడంలేదు.మరోవైపు కేంద్రం మాత్రం టిక్‌టాక్‌పై ఇప్పటికీ నిషేధం కొనసాగుతోందని స్పష్టంచేసింది. భారత్‌లో టిక్‌టాక్ సేవలను పునరుద్ధరించేందుకు ఎటువంటి ఆదేశాలు జారీకాలేదని అధికారులు తెలిపారు. ఆగస్టు 22న కూడా ఇలాంటి వార్తలను ప్రభుత్వం ఖండించింది. టిక్‌టాక్ వెబ్‌సైట్‌లోసేవలు అందుబాటులో లేవని చూపించేది. ఇపుడు మాత్రం అబౌట్ ఆజ్‌పేజీ ఓపెన్ అవుతోంది. కానీవిడియోలు కనిపించడంలేదు. యాప్‌కూడా ఆండ్రాయిడ్‌ప్లేస్టోర్‌లో డౌన్‌లోడ్‌చేయడానికి అందుబాటులోలేదు. భారత్‌లో టిక్‌టాక్‌సేవలను మేం పునరుద్ధరించడంలేదని భారత సర్కార్ ఆదేశాలు పాటిస్తున్నట్లు టిక్‌టాక్‌ప్రతినిధి తెలిపారు. బీజింగ్ న్యూఢిల్లీ సంబంధాలు వేగంగా పునరుద్ధరణజరుగుతున్న వేళ ఈ నియామకాలప్రకటన ఆశ్చర్యం కలిగిస్తోంది. అలాగే యాడ్స్‌పైనా నిషేధం తొలగించవచ్చనే ప్రచారం యూజర్లమధ్య నలుగుతోంది.

# నేటినుంచి మారనున్న రూల్స్ ఇవిగో!

**ముంబయి, ఆగస్టు31:** ఆర్థికసంవత్సరంలో సెప్టెంబర్ నుంచి పలు రూల్స్ మారనున్నాయి. ఈనెలలో ఆదాయపు పన్ను రిటర్న్‌లు, యూపీఎస్, క్రెడిట్ కార్డులకు సంబంధించిన నియమాలను మారనున్నాయి. అలాగే, ఎల్‌పీజీ ధరలు సైతం మారే సూచనలున్నాయి. ఐటీ ఆర్ దాఖలు చేసేందుకు చివరి తేదీ జులై 30 కాగా ఆదాయపు పన్నుశాఖ సెప్టెంబర్ వరకు పొడిగించింది. తప్పనిసరిగా సెప్టెంబర్ 15 లోపు ఐటీఆర్ దాఖలు చేయాల్సి ఉంటుంది.



లేకపోతే నోటీసులు జారీ చేసే అవకాశం ఉంది. యూపీఎస్ఎన్‌పీఎస్ అంటే నేషనల్ పెన్షన్ సిస్టమ్ కిందకు వచ్చే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు సెప్టెంబర్ 30లోగా ఏకీకృత పెన్షన్ స్కీమ్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది. గతంలో జూన్ 30 వరకు గడువు ఉండగా సెప్టెంబర్ 30 వరకు గడువు పొడిగించారు.

ప్రభుత్వరంగ బ్యాంక్ ఎస్‌బీఐ ఎంపిక చేసిన క్రెడిట్ కార్డుల రూల్స్‌ను మార్పులు చేసింది. సెప్టెంబర్ ఒకటి నుంచి ఈ మార్పులు అమలులోకి రానున్నాయి. రూల్స్ ప్రకారం కొన్ని కార్డుల రివార్డ్ పాయింట్ల నిబంధనలను సవరించింది. ఇకపై డిజిటల్ గేమింగ్, ప్రభుత్వ వెబ్‌సైట్లలో లావాదేవీలపై రివార్డ్ పాయింట్లు పొందలేరు. సెప్టెంబర్ ఒకటి నుంచి ఎల్‌పీజీ గ్యాస్ ధరల్లో మార్పులు చేసే అవకాశం ఉంది. ప్రతినెలా ఒకటో తేదీన చమురు కంపెనీలు ఎల్‌పీజీ ధరలను సవరించే విషయం తెలిసిందే. ఈ క్రమంలో రేపు ఎల్‌పీజీ ధరలు మారే అవకాశం ఉంది.

# రూ.17,200 కోట్లకు టాటా మెగా ఐపిఒ!

**న్యూఢిల్లీ,ఆగస్టు 31:** స్టాక్ మార్కెట్లలోకి మరో భారీ ఐపిఒ వస్తోంది. టాటా గ్రూప్‌లోని టాటాక్యాపిటల్ ఇపుడు తన తొలిపబ్లిక్ ఆఫరింగ్‌తో వస్తోంది. సెప్టెంబరు 22వ తేదీ రూ.17,200 కోట్ల విలువైన ఐపిఒను మార్కెట్‌కు తీసుకువస్తోంది. ఈ ఐపిఒద్వారా టాటా క్యాపిటల్‌కి దాదాపు 11 బిలియన్ డాలర్లు అంటే రూ.91 వేల కోట్లకుపైగా విలువలుపెరుగుతాయని అంచనాలున్నాయి. మొత్తం 47.58 కోట్ల షేర్లు అమ్మకానికి వస్తున్నాయి. వీటిలో 21కోట్ల షేర్లు కొత్తగా ఇష్యూ అవుతాయి. 26.58 కోట్ల షేర్లు ఆఫర్‌ఫర్‌సేల్ అంటే ఒఎఫ్ఎస్‌ద్వారా ప్రస్తుత వాటాదార్లు విక్రయిస్తారు. టాటాసన్స్ 23 కోట్ల షేర్లు విక్రయిస్తుంది. ఐఎఫ్‌సి అంటే ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ 3.58 కోట్లషేర్లు అమ్ముతోంది. ప్రస్తుతం టాటాసన్స్ టాటాక్యాపిటల్‌లో 88.6శాతం వాటాతో ఉంది.ఐఎఫ్‌సి వద్ద 1.8శాతం వాటాలున్నాయి. ఈ ఐపిఒద్వారా వచ్చే నిధులు మూలధన బేస్ పెంచేందుకు వినియోగిస్తామని తెలిపింది. జూన్‌లో హెచ్‌డిబి ఫైనాన్షియల్ 12,500 కోట్లకు ఐపిఒకు వచ్చింది. తొలిరోజు లిస్టింగ్‌లో బజాజ్‌హౌసింగ్ ఫైనాన్స్‌కూడా 135శాతం ప్రీమియంతో ముగిసింది. టాటా క్యాపిటల్‌మొత్తం రుణాలు రూ.2.26 లక్షలకోట్లకు చేరాయి. 2025లో సంస్థ లాభం 3646.6 కోట్లుగా ఉంది. 2023లో 3029.2కోట్లతో పోలిస్తే 10శాతం వార్షిక వృద్ధిని నమోదుచేసింది. స్థూల రానిబాకీలు 1.9శాతంతో తక్కువగానే ఉన్నాయి. నికర పారుబాకీలు 0.8శాతంమాత్రమే ఉన్నాయి. 2007లో వ్యాపారం ప్రారంభించిన టాటా క్యాపిటల్ ఇప్పటివరకూ 70 లక్షలమంది కస్టమర్లకు సేవలందించినట్లు వెల్లడించింది.




# పాస్‌వర్డ్‌లు వెంటనే మార్చుకోండి..

## 2 ఎస్వీ అమలుచేయండి..

### జిమెయిల్ కస్టమర్లకు గూగుల్ హెచ్చరిక

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** జీమెయిల్ ఖాతాదారులకు గూగుల్ అత్యవసర హెచ్చరికలు జారీచేసింది. 2.5 బిలియన్ జిమెయిల్ ఖాతాదారుల పాస్‌వర్డ్‌లు ప్రమాదంలో ఉన్నాయని వెంటనే మార్చుకోవాలనిహెచ్చరించింది. సైబర్‌సెక్యూరిటీ బలోపేతంకావాలంటే వెంటనే పాస్‌వర్డ్ మార్చుకోవాలని అలాగే టూస్టెప్ వెరిఫికేషన్ అంటే టూఎస్వీని తప్పనిసరిగా వర్తింపచేసుకోవాలని సూచించింది. హ్యాకింగ్ కుట్రలు భారీగాపెరగడంతో కస్టమర్లు అప్రమత్తం కావాలని, హ్యాకింగ్ వెనక షైనీ హంటర్స్ అనే అంతర్జాతీయ హ్యాకర్లముఠా ఉన్నట్లు గుర్తించామని తెలిపింది. 2020 నుంచి యాక్టివ్‌గా ఉన్న ఈగ్రూప్‌పై ఇప్పటికే ఎటిఅండ్‌టి, మైక్రోసాఫ్ట్, సాంటాండర్, టికెట్‌మాస్టర్ వంటి సంస్థల డేటాలీక్ కేసుల్లోప్రమేయం ఉన్నట్లు ఆరోపణలున్నాయి. ఈ హ్యాకర్లు ఫిషింగ్‌ఫద్ధతిని ప్రధాన ఆయుధంగా వాడుతున్నారని గూగుల్ తెలిపింది.నకిలీ ఇమెయిళ్లు పంపించి యూజర్లను వేరే లాగిన్‌పేజీలలోకి మళ్లించడం, సెక్యూరిటీ కోడ్‌లు సహా కీలక సమాచారాన్ని దోచుకోవడం వీరి ప్రధాన వ్యూహం. గూగుల్‌జూన్‌లోనే ఒక బ్లాగ్‌పోస్ట్‌లో షైనీ హంటర్స్‌గ్రూప్ డేటా లీక్‌సైట్‌ప్రారంభించడానికి సిద్ధమవుతోందని భావిస్తున్నట్లు గూగుల్ తెలిపింది సున్నితమైన సమాచారం దోపిడీ అవుతుందని గుర్తించాలని కోరింది. పాస్‌వర్డ్ మార్చుకోవడంతోపాటు 2ఎస్వీని వెంటనే అమలుచేసుకోవాలని సూచించింది. 2ఎస్వీ ప్రారంభిస్తే దొంగలు అకౌంట్‌లోకి చొరబాటుచేయలేరని అన్నారు. బ్రిటన్‌లోని యాక్షన్‌ఫ్రాడ్‌కూడా ఇమెయిళ్లు సురక్షితంగా ఉంచుకోవాలని తెలిపింది. జిమెయిల్‌కే కాకుండా బ్యాంకింగ్, షాపింగ్, సోషల్‌మీడియా ఖాతాలన్నింటి సర్వీసుల్లోను 2ఎస్వీ ఆప్షన్ అందుబాటులో ఉంది. సెక్యూరిటీసెట్టింగ్స్‌లో టూఫ్యాక్టర్ ఆథెంటికేషన్‌లేదా మల్టీఫ్యాక్టర్ ఆథెంటికేషన్ పేరుతో అందుబాటులో ఉంటుందని గూగుల్ స్పష్టంచేసింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps